



ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

వెల 4 అణాలు ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY 12-4-1950

నెహ్రూ - లియాకత్ ఆలీ సంప్రదింపులు



సర్దార్ పటేలు, లియాకతాలీఖాను, పండిత నెహ్రూగార్లు దీర్ఘాలోచనలో నున్నారు

పాకిస్తాన్ ప్రధానమంత్రి లియాకతాలీఖానుగారు, రాజఘాటునందు గాంధిసమాధిపై పూలదండ నుంచుట



సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు


ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరులేయవియొనరించిన నరవర! యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్
(మహాభారతము)


Founder : K. NAGESWARA RAO.

సంపుటము **42**
సంచిక **32**

వికృతి సంవత్సర చైత్ర బహుళ దశమి బుధవారము



గా॥ ప్రధానమంత్రి నెహ్రూగారు పాకీస్తాను ప్రధాని లియాఖత్ ఆలీఖాన్‌గార్లు ఒకేసారి అల్ప సంఖ్యాకవర్గ రక్షణల ఒడంబడికపై సంతకం చేయుట. పాకిస్తాన్ ప్రధాని వెనుక వారి ఉన్నతోద్యోగులు. నెహ్రూగారి వెనుక బాజపాయి మున్నగు భారతీయ ఉద్యోగబృందం నిలిచియున్నారు.



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ ఏప్రెల్ నెల 12-వ తేది బుధవారము

రాష్ట్రంలో అరాచకం: ప్రభుత్వ కర్తవ్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కుమారస్వామి రాజాగారు కృష్ణాజిల్లాలో కల్లోలిత ప్రాంతములో పర్యటించి ప్రజలకు ధైర్యము చెప్పి, దుష్టశక్తుల విజృంభణవలన నష్టపోయినవారిని ఓదార్చుటకు బదులు వారు దర్శించిన ప్రతిగ్రామమునందును ప్రజల వైఖరిని విధానమును విమర్శించిరి. 'నాయకులై సత్కరించిన' ప్రజల హేళన చేసిరి. అరాచకశక్తులను ఎదుర్కొనుటకు ప్రజల నుత్సాహపరచి, అట్టి కార్యక్రమమునందు ప్రభుత్వము ప్రజలకు పూర్తిగ తోడ్పడగలదని హామీ నిచ్చుటకు బదులు ముఖ్యమంత్రి తప్పులెన్నుటే పనిగ పెట్టుకొనిరి. గతమాసము రాష్ట్ర పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ కూడ "ఆంధ్రులు చాల ధైర్యసాహసములు గలవారని" తాము ఇంతవరకు భావించుచుంటిమని, వీరింత పిరికివారని తాము అనుకొనలేదని నూజవీడు సభలో చమత్కరించిరి ఇది చమత్కారమునకు, తప్పులెన్నుటకు సమయము గాదని వీరు గ్రహింపకపోవుట శోచనీయము.

ముఖ్యమంత్రి శ్రీ కుమారస్వామి రాజా ధోరణి ప్రజాసహకారమును పొందుటకు ఏమాత్రము తోడ్పడదు. "కమ్యూనిస్టుల విషయము గ్రామస్థులకే పట్టనిచో ప్రభుత్వమునకు ఏమి పట్టినది?" అని శ్రీ కుమారస్వామి రాజా ప్రశ్నించుట యుక్తముగ లేదు. రాష్ట్రమున శాంతిని స్థాపించుట, అరాచకశక్తులను నిర్మూలించుట ప్రభుత్వ బాధ్యత. బ్రహ్మాండమైన పోలీసుదళములను, సైనికబలమును కలిగి అమాయకులైన గ్రామీణులను నానాహింసలు పెట్టుచున్న ప్రభుత్వము అరాచకశక్తులను నిర్మూలింపలేకపోయిన అందుకు ప్రజలు ఎన్నటికిని బాధ్యులు గారు.

ప్రభుత్వమునకు ప్రజల సహకారము లభించుట లేదను నెపముతో అధికారుల అసమర్థతను సమర్థింప సాధ్యముగాదు. యథార్థముగ ప్రభుత్వమునకు ప్రజల సహకారము లభింపకపోవచ్చును అట్టి సహకారము లభించుటలేదని విలపించుటతో ఈ సమస్య పరిష్కారముగాదు. ప్రజల సహకారము ఎందుకు లభించుట లేదు అన్న ప్రశ్నకు సమాధానమును తెలుసుకొనుటకు ముఖ్యమంత్రి ప్రయత్నింపవలసి యున్నది "ఇది ప్రజలు పెట్టుకున్న ప్రభుత్వము. కాబట్టి ప్రభుత్వములోని మంచి చెడ్డ లన్నింటికి ప్రజలే బాధ్యులు" అన్న వాదముతో ప్రజలు ఏకీభవింపరు. ఈ ప్రభుత్వమును ప్రజాప్రతినిధులు ఎన్నుకొనియుండవచ్చును. కాని ఈ ప్రభుత్వవిధానముతో ప్రజలకు సంబంధము లేదు. ప్రజాభిప్రాయానుగుణముగ ప్రభుత్వవిధానము నిర్ణయమగుటలేదు. ప్రజలు వాంఛించినట్లు ప్రభుత్వకార్యకలాపములు జరుగుటలేదు. కనుకనే ప్రజల సహకారము ప్రభుత్వమునకు గాక, ఈ ప్రభుత్వమును "కూలద్రోయుటకు విప్లవమును ప్రోత్సహించుచున్న వారికి" లభించుచున్నది.

ఇప్పటికి ఈ అరాచకచర్యలు రాష్ట్రమునందు కొన్ని ప్రాంతములకే పరిమితమై యున్నవి ఇతర ప్రాంతములందు చెదురువాటుగ కొన్ని సంఘటనలు జరిగినను, ఈ అరాచకశక్తులు రాష్ట్రమంతట వ్యాపింపలేదు. ఈ అరాచకచర్యలు నేడు ప్రారంభమైనవి గావు, ఇప్పటికి అయిదుసంవత్సరములుగ దాదాపు ఒకే ప్రాంతమునందు చెలరేగుచున్నది ప్రభుత్వము "పోలీసుశాఖ వ్యయమును మూడుకోట్లరూపాయలనుండి ఆరుకోట్ల రూపాయలవరకు" పెంచినను ఈ అరాచకచర్యలు అణగిపోలేదు సరిగదా తగ్గనైనను తగ్గలేదు. నానాటికి అధికమగుచున్నవి. తీవ్రమగుచున్నవి. పోలీసుసిబ్బందిని వృద్ధిచేయుటవలననే ఈ సమస్య

పరిష్కారము గాదని స్పష్టమైనది. ప్రజలకు ఆయుధముల నిచ్చెద మని ముఖ్యమంత్రి వాగ్దానము చేసెను. ప్రజలకు కావలసినది ఆయుధములుగాదు, రెండుపూటల తిండి, వంటికి బట్ట, ఉండుటకు ఇల్లు. ఈ సమస్యలను పరిష్కరించుటకు ప్రభుత్వము ఏమి చేసినది? కలవా రెవ్వరూ కమ్యూనిస్టులతో సహకరింపరు. ఆ విషయమును ప్రభుత్వము గ్రహించిన కేవలము ఆయుధప్రయోగముతో ఈ సమస్యను పరిష్కరించుట సాధ్యము గాదని గుర్తింపగలదు.

ముఖ్యమంత్రిపర్యటనవలన పరిస్థితులు చక్కబడగల వను ఆశ కలుగుటలేదు. శ్రీ కుమారస్వామి రాజాగారు అసలు విషయమును గ్రహించినట్లు కన్పింపదు. ఈ అరాచకచర్యలు ఆ ప్రాంతములకే పరిమితమై అచటే విపరీతముగ నుండుటకు కారణ మేమి? ఈ అరాచకచర్యలను జరుపువారితో కమ్యూనిస్టులకు గల సంబంధ మేమి? ఈ చర్యలతో కమ్యూనిస్టులకు ఎంతవరకు ప్రమేయ మున్నది? ప్రజలు ఈ అరాచకశక్తులను ఎదుర్కొనకపోవుటకు కారణ మేమి? ఈ విషయము లన్నింటిపై ఒక సమగ్రమైన విచారణ జరుపుట యవసరము. ఆ విచారణఫలితములను బట్టి ప్రభుత్వము ఒక క్రొత్తవిధానమును అవలంబింపవలసియుండును. కాలహరణములేక ఈ విచారణ జరుపుటకు వెంటనే ప్రభుత్వము పూనుకొనవలెను.

విషయానుక్రమణిక
12 ఏప్రెల్ 1950

మనదేశం

పోలీసుల్ని సోదాచేసే అధికారం *

ఇంతవరకూ సంస్కరణలు కొత్త పన్నులు ప్రవేశపెట్టడంలో భారతదేశంలోని రాష్ట్రాలన్నిటికీ చెన్నరాష్ట్రం వొరవడిపెట్టింది. మద్యనిషేధం, అమ్మకపు పన్నులు, జమీందారీల రద్దు మొట్టమొదట చెన్నరాష్ట్రంలోనే అమలుజరిగాయి. మద్యనిషేధం అమలు జరిపినందువల్ల చెన్నరాష్ట్రప్రభుత్వానికి ఆదాయం లోపమై అమ్మకపు పన్నులు విధిస్తే, మిగతా రాష్ట్రాల్లో మద్యనిషేధం అమలుజరపకుండానే అమ్మకపుపన్నులు విధించారు. ఈ కామధేనువు ఉందని భారతదేశానికి చూపినది మద్రాసుప్రభుత్వంవారు. కాంగ్రెస్ ప్రభుత్వాల్ని కాంగ్రెస్ వారే పడగొట్టడంలో కూడా చెన్నరాష్ట్రమే మిగతా రాష్ట్రాలకి దారిచూపింది

కాని ఈమధ్య కొన్నివిషయాల్లో ఇతర రాష్ట్రాలు ముందడుగు వేస్తున్నాయి. తిరువాన్కూరులో ఆడపోలీసు లున్నారు. విడాకుల అనుమతిచట్టం మొదట బొంబాయి రాష్ట్రంలో ప్రవేశపెట్టబడింది.

పోలీసుల్ని ప్రజలు సోదాచేసే అధికారం బొంబాయిరాష్ట్రంలో ఇవ్వబడుతోంది. ఈ ఏప్రిల్ 1 వ తేదీని ప్రవేశపెట్టబడిన మద్యనిషేధచట్టంకింద పోలీసులు ఎవరి ఇళ్ళనైనా సోదాచెయ్యదలిస్తే, వారు ఇంట్లో ప్రవేశించేముందు, వారిని ఇంటి యజమానిముందుగా సోదా చెయ్యవచ్చును. ఎవరిపైనైనా కక్షవహించి పగతీర్చుకోడానికిగాను పోలీసులు స్వయంగా మద్యం తీసుకెళ్లి వారి ఇళ్లలో ప్రవేశించి అక్కడ పెట్టి వారిపైన కేసు బనాయించే వీలు ఉందని ప్రభుత్వంఅభిప్రాయం. ఇటువంటి అన్యాయం జరక్కుండా ఇటువంటి అధికారాన్ని ప్రజలకు ఇస్తున్నట్లు బొంబాయి ప్రభుత్వం విశదీకరించింది

ఇటువంటి నియమం మన రాష్ట్రంలో కూడా అవసరమేనని చెప్తే, అనవసరంగా పోలీసులపైన అనుమానం పడుతున్నారని భావించడానికి వీలుంది. పోలీసుల్ని అనుమానించవద్దు వారు చాలా కష్టపడి దేశంలో శాంతిని కాపాడుతున్నారు కాని అక్కడక్కడ జరిగిన కొన్ని విషయాల్ని చూస్తే ముందు జాగ్రత్తపడ్డంలో తప్పు లేదనిపిస్తుంది. అంటే పోలీసులు ప్రజలమీద కేసులు బనాయిస్తారని కాదు అక్కడక్కడ మద్యనిషేధశాఖపోలీసులే మద్యనిషేధచట్టాన్ని అతిక్రమించినందువల్ల అయితే దీనివల్ల ఒక ముప్పుంది మద్యం తాగుతున్నారనికాని నిలవవేసుకున్నారనికాని ప్రజల్ని పోలీసులు సోదా చేసినట్లే పోలీసుల్ని ప్రజలూ సోదా చెయ్యడానికి తలపెట్టితే?

ప్రకాశంగారికి కాంగ్రెస్ శ్రీముఖం *

శాసనసభ కాంగ్రెస్ పార్టీ నియమాల్ని అతిక్రమించి కాంగ్రెస్ లోవర్గాలు పెంపొందించుతున్నందుల శ్రీ టంగుటూరి ప్రకాశం గారిపైన చర్య తీసుకోడానికి కేంద్ర కాంగ్రెస్ కార్యవర్గం తీర్మానించింది పూర్వమంత్రులు కొందరిపైన, ఇప్పటి మంత్రులు కొందరిపైన అధికారదుర్వినియోగం చేశారని ప్రకాశంగారు నిందారోపణ చెయ్యడం, ఈ విషయమై తగుచర్య తీసుకోవాలని ప్రకాశంగారు కేంద్ర కాంగ్రెస్ కార్యవర్గాన్ని కోరడం, కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ శంకర్రావుదేవ్ విచారించడం గతసంవత్సరమే జరిగిపోయాయి. గత సంవత్సరం కాంగ్రెస్ పార్టీ నాయకునిగా కుమారస్వామిరాజా గారిని ఎన్నుకున్న సందర్భంలో ఎవరిపైనైతే నిందలు మోపబడ్డాయో వారిని మంత్రులుగా నియమించవద్దని ప్రకాశంగారు కొత్త ప్రధానిని హెచ్చరించారు అయితే ప్రధాని కుమారస్వామిరాజా గారు పాటించలేదు దానిపైన ప్రకాశంగారు ఈ మంత్రుల్ని తొలగించి, వారిపైన అభియోగాల్ని విచారణచెయ్యడానికి ఏర్పాటుచెయ్యవలసిందని కాంగ్రెస్ కార్యవర్గాన్ని కోరారు. శ్రీశంకర్రావ్ దేవ్ గారు విచారించి నివేదికను కార్యవర్గానికి సమర్పించారు. వారి నివేదికనుబట్టి కొన్ని ఆరోపణల్లో నిజం లేకపోలేదనీ, న్యాయవిచారణ జరిపించదలుచుకుంటే విచారణచెయ్యడానికి విషయాలున్నాయనీ, కాని న్యాయవిచారణ తప్పనిసరి అనుకోకూడదనీ శంకర్రావ్ దేవ్ గారి అభిప్రాయమైనట్లు గోచరించింది. తరవాత కాంగ్రె కార్యవర్గంఆదేశానుసారం పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ గార్లు నివేదికను, ప్రకాశంగారి వాదాన్ని పరిశీలించి, న్యాయవిచారణ అనవసరమని నిర్ధారణచేశారు కాని కొన్ని విషయాల్లో మంత్రుల చర్యలు అనుమానరహితంగా లేనందువల్ల, ఇకనుంచి మద్రాసు మంత్రివర్గం జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ముగ్గురునాయకుల తీర్పును కాంగ్రెస్ కార్యవర్గం ఆమోదించింది.

కాని ప్రకాశంగారు అగ్రనాయకులు న్యాయం చేకూర్చలేదని చెప్పి అలిండియా కాంగ్రెస్ కమిటీలో ఈవిషయమై తీర్మానం తేగలరని ప్రకటించారు ఇదిగాక నూతన రాజ్యాంగంలో శాసనసభ్యల కివ్వబడిన హక్కుల ననుసరించి మద్రాసు మంత్రుల చర్యలను విచారించడానికి సెలక్ట్ కమిటీని నియమించాలని సూచిస్తూ శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి సంకల్పించారు. బడ్జెట్ పై చర్చ జరుగుతున్న సందర్భంలో విరామ తీర్మానం ప్రతిపాదించడానికి యత్నించగా, అది శాసనసభానియమాలకి విరుద్ధమైనందువల్ల స్పీకర్ అనుమతి నిరాకరించారు. తరువాత పరిపాలన సక్రమంగా నిర్వహించబడునట్లు శ్రద్ధ వహించే హక్కు శాసనసభ్యులందరికీ ఉన్నదనీ, మంత్రులపై అభియోగాల్ని విచారించడానికి ఒక సెలెక్ట్ కమిటీని నియమించాలని కోరే హక్కు శాసనసభ్యులకున్నదనీ వాదిస్తూ, ఆప్రకారం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దానికికూడా స్పీకర్ అనుమతి నిరాకరించారు. శాసనసభలో అనధికారప్రతిపాదనలు చర్చించే అవకాశాల్లో ఇటువంటి తీర్మానాన్ని ప్రవేశ

(40 వ పేజీ చూడుడు)

నాటిక:

సులోచన

(సులోచన కూతురుని ఉయ్యాలలో ఊపుతూ జోల పాట పాడుతూ ఉంటుంది. కొడుకు పులస్త్యుడు ప్రక్కనే కళ్లు మూసికొని పడుకొని ఉంటాడు.)

సు జో జో జో. (పాటపాడుతూ ఉంది)

పాప అమ్మా, నాన్న వచ్చారా .

సు ఇంకా పడుకోనేలేదేమే. ఇంతసేపటినుంచి నిద్రపుచ్చుతోంటే. వస్తారమ్మ పడుకో. జో జో.

పా ఇంకా ఎప్పుడొస్తారేమిటి నాన్న నిన్నా ఇల్లాగే అన్నావు మొన్నా ఇల్లాగే అన్నావు. ఇంకా రాలేదు మరి ఎప్పుడొస్తారూ ఊ. ఊ. (అని గారాబంగా రాగాలు తీస్తుంది)

పులస్త్యుడు: అమ్మా! నేను ఏడవను కాదమ్మా?

సులో నువ్వూ నిద్రపోలేదురా? పడుకో! నాన్నా. పడుకోండి త్వరగా.

పుల కాదే అమ్మా! మొన్న నాన్న నన్ను యుద్ధంలోకి తీసుకెళ్తానన్నారు నేను కవచం కత్తి అన్నీ కట్టుకొన్నాను ఇంతవరకూ రానే లేదు మరి నేను ఏడ్చానా చెల్లాయిలాగా? చెల్లాయి వట్టి పిరికి. ఊరికే ఏడుస్తుంది.

పాప పాపం నువ్వు ఏడవలేదు కాబోలు! కాదే అమ్మా! నిన్న కోటగుమ్మం దాటి యుద్ధంలోకి వెళ్తానని వెళ్తూంటే తాతయ్యగారు, చూసి వెనక్కి పొమ్మన్నారు. గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ వచ్చాడు

పుల నేనేం గుడ్లనీళ్ళు కుక్కుకోలేదు ఇప్పుడు కాదన్నారుగా! నేన్నాన్నతో కలసి యుద్ధాని కెళ్లనూ? తాతయ్యగారు కూడా అప్పుడు ఏమీ అనరు.

సులో పెద్దగానిలే నాన్నా, పడుకో పొద్దుపోయింది. నాన్న వచ్చేటప్పటికి ఇంకా లేచిఉంటే కోప్పడతారు. పడుకోండమ్మా.

పుల అమ్మా నాన్న ఈ పాటికి రామలక్ష్మణులను ఇద్దరినీ చంపేసి ఉంటారు కాదూ. నేను వాళ్లను చూడాలనుకొన్నాను ఎల్లాగమ్మా మరి?

సులో: పెద్దవుగానిలే నాయనా! పడుకో.

(జో జో అని పాడుతూవుంది. పిల్లలు నెమ్మదిగా నిద్రకు కునికి గుఱ్ఱు పట్టుతారు. అత్తయి ప్రవేశం)

అత్తయి ఏం అక్కా! పిల్లలు పడుకున్నారా?

సులో రా, అత్తయీ! ఇప్పుడే పడుకొన్నారు కూర్చో.

అత్తయి ఏం కూర్చోను. నాకేమీ తోచటం లేదు మీవారు మేఘనాథులు ఇవాళిటికి ఇంకా ఇంటికి రాలేదా?

సులో రాలేదు ఈ యుద్ధం ఏమిటో నాకు తోచటం లేదు. దేవేంద్రుడిని జయించి లొంకకు వచ్చినప్పుడైనా వీరికిన్నాళ్లు పట్టలేదు. అదీకాకుండా లోకవిజేతలైన మామగారిమీదికి ఈ రాజకొడుకు లిద్దరూ ఇంత సాహసంగా ఎల్లా వచ్చారో.

అత్తయి పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ అన్నట్టు, అష్టదిక్పాలురని వాకిళ్లో పడిగాపులు కాయిస్తూ ముల్లోకాల నేలుతున్న మీ మామగారిమీదికీ వానరాలనీ, భల్లూకాలనీ చేరదీసుకొని దండెత్తివచ్చారంటే, వల్లమాలిన పొగరుగాక మరేవిటచెప్పు?

సులో ఏమైనా మామగారంతటివారితో మనుష్యు లెవళ్లూ చెయ్యానంతటి ఘోరంగా ఇంత యుద్ధం సాగించగలుగుతున్నారంటే, వాళ్లలోనూ ఏదో మహత్యం ఉండి తీరాలి! వీళ్ల కన్నేళ్లుంటాయి ఏమిటి?

అత్తయి ఎన్నెన్ని ఉంటాయి! పట్టుమని పాతికేళ్లయినా ఉన్నట్టు లేదట.

సులో అయితే ఆ సీత అంతకన్నా కూడా చిన్నదన్నమాట. మనుమల నెత్తిన ఈ ముదిమిలో మామగారు.

అత్తయి మామగారు ఇంత బతుకూ బతికి చివరికి ఈ నరస్త్రీని ఇంతకన్న అందకత్తె దొరదని కామించే తెచ్చారనుకున్నావేమిటి?

సులో అబ్బే. అది కాదు ఛా ఛా. పితృతుల్యులగు వారిని నేనలా అంటానా. కాదు. అసలు ఈ కాలంలో వీరిల్లా ఎందుకు తలపెట్టారో? ఇదంతా ఎందుకొస్తోందో?

అత్తయి ఎందుకు తలపెట్టారా? వీళ్ల పొగరణచడానికే తలపెట్టారు ఎంతపొగరు కాకపోతే, మనజనపదాలలోకి వచ్చి, ఆ ఋషులఅండ చూసుకొని, మనవాళ్లనందరినీ హతమారుస్తూ తిరుగుతారు? అదీ కాకుండా, సాక్షాత్తూ త్రిలోకనాయకులైన రావణుల సహోదరిని అపహాస్యాలపాలుచేసి, 'చెప్పకో పో' అన్నట్టు నిర్భీతిగా వెక్కిరించి పంపిస్తారా? పైగా నీ ప్రతాపమెంతా అని ఆయన్ని ఉడికించినట్లు ఒంటరిగా పసిఆడదాన్ని వెంటపెట్టుకొని, మన ఏలుబడిలో ఉన్న రాజ్యంలో నిర్భయంగా సంచరిస్తారా? ఇంతకన్న తిరస్కారముంటుందా? ఆ పొగరణచటానికే కాదా రావణులు నరాంగనను తీసుకొచ్చింది— అందానికోసం ఈవిడనే తేవాలా? చివరికి మనఆడవాళ్లలో ధాన్యమాలి కాలిగోరుకైనా పోలికకు వస్తుందా ఈఅమ్మాయి? కామంతో

తెచ్చినవారైతే ఏడాదిపాటు అల్లా అశోకవనంలో దిక్కు మొక్కు లేకుండా పడేసి ఉంచటం ఎందుకు. కానీ, కానీ! పీళ్లకి శాస్తి చెయ్యకపోరు!

పుల (నిద్రలో కలవరిస్తూ) నాన్నా నేను వస్తున్నా! ఇదిగో నిన్నంతా కూర్చుని క్షాత్రబాణాలు తయారుచేశా! నేను నీలాగే ఎగిరి రానా.

అత్తయి పులస్త్యా! పులస్త్యా!

సులో: ఏవో నిద్రలో కలవరిస్తున్నాడు. మూడురోజులనించి అస్తమానూ "రామలక్ష్మణులను చూసి యుద్ధం చేస్తాను. నాన్నతో వెళ్తాను" అని

పుల (నిద్రలో) ఆఁ. ఆఁ నాన్నా. నాన్నా అమ్మో. నాన్న (అంటూ గట్టిగా ఏడుస్తూ లేస్తాడు)

సులో (పిల్లడికి దిష్టి తీస్తున్నట్లుగా) థూ! థూ! లంకిణీ దేవరక్ష! థూథూ! బాబూ లేదులే! లేదులే పడుకో కల వచ్చిందా నాయనా.

పుల (ఏడుస్తూ) అమ్మా నాన్న మడి గట్టుకొని జపం చేస్తుంటే ఆ విభీషణుడు తాతయ్య కోతులూవచ్చి అల్లరి చేసి నాన్నను లేవగొట్టి తరుముతూ తీసుకెళ్లారు. నాన్న వాళ్లను తరుముతుంటే ఆయ నెవరో బాణము వేసి నాన్నను చంపేశాడు అమ్మా నాన్న ఏడీ?

అత్తయి ఛీఁ. ఛీ వెధవ పీడకల. లేదు బాబూ లేదు పడుకో నాన్న యిప్పుడే వస్తారు.

సులో పిచ్చిబాబు మీ నాన్న కేం భయంలేదమ్మా నాన్నను ఎవరూ చంపలేరు. నా దగ్గిరమణి ఇచ్చారుగా నాన్నకు.

పుల లేదే అమ్మా. ఆ మణి కట్టుకోకుండానే నాన్న అడావుడిగా వెళ్ళిపోయారు. ఇదిగో మణి నా మెడలో కట్టుకొన్నాను

సులో (అడిరిపాటుగా) ఆఁ. ఆఁ. కట్టుకెళ్ళలేదా! (మణి తీసుకొని) అయినా ఫరవాలేదు బాబు నాన్నను ఎవరూ ఏం చెయ్యలేరు మీ తాతయ్య ఆదిశేషులు తప్ప నాన్నను జయించగలవారు లేరు. ఇప్పుడే సుఖంగా వస్తారు పడుకో.

పుల ఆయ నెవరో బాణం వదుల్తూంటే అచ్చుతోతమాదిరిగానే కనబడ్డారమ్మా.

సులో: (బుజ్జగిస్తూ పిల్లడికి నమ్మకం చెప్తూ) తెల్లవారగానే నాన్నతో సంగంచేసాం బాబూ నువ్వు చెప్పు?

పులస్త్యుడు చెయ్యరు.

సులో చూశావా మరి, పట్టి పీడకలకు జడుస్తావా! మరి ఇల్లా జడిస్తే యుద్ధానికేం వెళ్తావు?

పుల జడవనమ్మా, నేనూ యుద్ధాని కెళ్లి నాన్నమీద బాణం వేసినవాళ్ళను కత్తితో నరికేస్తా.

సులో అల్లాగేలే పడుకో బాబూ, ఇప్పుడే పడుకొంటే - ప్రొద్దున్నే నాన్నగారితో బయలుదేరి వెళ్ళొచ్చు. మరి పడుకో. జోల పాడనా, జో జో, (అని పాడుతుంది. పిల్లడు నిద్రపోతాడు (అనుర్ధాగా) అత్తయీ యుద్ధసమాచారాలు నీకు నిజంగా ఏమీ తెలియవా?

అత్తయి రావణులు స్త్రీల అంతఃపురం వద్ద యుద్ధవార్తలు తెలిపినవారిని నరికేస్తానని ఆజ్ఞ ఇచ్చారు. అశోకవనంలో మాత్రం ఎల్లాగో కొన్ని కబుర్లు తెలుస్తున్నాయి, కాని అవి నిజాలు ఔనో కాదో తెలియదు

సులో మావారి యుద్ధవిశేషాలు ఏమైనా తెలిసాయా?

అత్తయి నేను పూర్తిగా వినలేదు. త్రిజట ఏదో చెప్తోంది మేఘనాథులు తన రథంలో సీతను లాక్కుపోయి రామలక్ష్మణుల సైన్యాల ముందు రథం నిలిపి సీతను తల తెగవేశారట

సులో ఆఁ, ఆఁ, అంతపని వారు చేయరే, సీతాదేవిని వారు కన్నెత్తి అయినా చూడలేదే! అల్లాంటిది స్పృశించి అంతటి భీకరానికి ఒడిగడ్తారా? అత్తయీ, అబద్ధం అయివుంటుంది

అత్తయి ఏమో! ఆ సైన్యం అంతా హాహా కారాలతో ఏడుస్తూ చెదరిపోయారట రామలక్ష్మణులు మూర్ఛపోయారు. ఇంతలో మేఘనాథులు యజ్ఞవాటికకు వచ్చి నికుంభిలాయజ్ఞం ప్రారంభించారట.

సులో అబ్బాయి కలలో అల్లాగే అన్నాడే మడి గట్టుకొని కూర్చున్నారని మానికుంభిలా యజ్ఞమే! ఆ యజ్ఞానికి భంగం కలిగితే చాలా ప్రమాదకరమే! అంత తీవ్ర వృత్తికి నాథులు ఎందుకు దిగినారో! అత్తయీ! యజ్ఞభంగం కాలేదుగదా నిజం చెప్పు నాకు చాలా ఆత్రంగా ఉంది

అత్తయి కేవలం భంగం అనేందుకు వీల్లేదు యజ్ఞం అవుతూండగానే హనుమదాదివానరులు విభీషణుడూ వచ్చి, కవ్వించి ఆయన్ని యుద్ధానికి తరిమారట. ఆ దాటున మేఘనాథులు శత్రుశిబిరందాకా మారిమసగినట్లు శత్రువులను వేటాడుతూ చొచ్చుకుపోయారట, ఆ తర్వాత కబుర్లింకా ఏమీ తెలియలేదు. ఏమమ్మా ఇంత ధీరోదాత్తవు! ఇంత కేనా, కంటనీరు!

సులో (తేరుకుని నవ్వి విషాదంగా గాద్గదికంఠంతో) లేదు. అత్తయీ, మహావీరుల విషయంలో కన్నీరెందుకు!

అత్తయి కాదమ్మా ఏమీ కాలేదు. మేఘనాథులు సుఖంగా తిరిగిరాగలరు.

సులో రారు అత్తయీ రారు. అయినా ఫరవాలేదు నేనే వారివద్దకు వెళ్తున్నా అత్తయీ, అత్తగారు మండోదరి కూడా రేపో మాపో మళ్లీ మమ్మల్ని కలుసుకొనేవారే కదా. నీ అదృష్టాన నీవు ఇక్కడే ఉంటే ఈ బిడ్డ లిద్దరి నీ జాగ్రత్తగా కాపాడు.

అత్తయి. ఏమిటమ్మా ఈ అప్పగింతలు. ఎక్కడికి వెళ్తావు?

• సులో అత్తయీ నీకు తెలియదు. నాకు తెలుసును బిడ్డకు పులస్త్యుడికి కలలో తెలిసింది స్వర్గనాథులను గెలిచిన మేఘనాథులకు కూడా, దక్షిణదిగ్నాథుని దేశద్వారం నుంచి తప్ప స్వర్గానికి వెళ్లటం పడలేదు. నేనూ నా నాథుని అనుసరిస్తా

(మండోదరి ప్రవేశం)

అదుగో అత్తగారు. అత్తా నమస్కారం మీ కోడలికి సహగమనానికి అనుజ్ఞ యివ్వండి.

మండో (అశ్రుకంఠంతో) అమ్మా. నీకు తెలిసిందా ఈకబురు! నాకడుపునా, నీ గుండెల్లోనూ నాకొడుకు ఆరని చిచ్చు పెట్టి, ఏగిన కబురు! ఇంద్రజిత్తూ! ఇంద్రజిత్తూ! (ఏడుస్తుంది)

సులో ఆహా అనుమానం నిజమే నన్నమాట.

అత్తయి అమ్మా త్రైలోక్యమహారాజ్ఞీమణులు మీరుకూడా పామరులలాగా దుఃఖిస్తారా?

మండో సులోచనా! నీకు కబురే తెలియలేదా? అల్లా బయలుదేరుతున్నావెక్కడికి తల్లీ! నా సయందేహం రానీ.

సులో (దుఃఖంలో ఆశక్తివ అనుమానంతో) అత్తా! మీ అబ్బాయికి సామాన్యుల చేతిలో మృతిలేదు—మీకు ఈ వార్త తెలిసిన వివరం చెబుతారా?

మండో. అమ్మా— ఏమని చెప్పను

అబ్బాయియజ్ఞం భంగంచేసి, మరిదిగారూ అంగదాగులూ, ఉడుకుమాటలతో కవ్వించారు

సులో: సీత తల నరికారని వాళ్లంతా నిస్పృహులై కూలిపోయారట కాదా.

మండో: ఛీ. సీతకాదు. మాయాసీత

సులో: మాయేకదా. పోనీ ధన్యురాలను. నాథునికి ఆ పాపం చుట్టుకోలేదు.

మండో: ఇంద్రజిత్తు పాపవర్తి ఎల్లా అవుతాడమ్మా? యుద్ధంలో శత్రువుని నిర్వీర్యుని చెయ్యడానికి ఆ మాయ చేశాడు. మరిదిగారి కాకిటుకు తెలుసు. ఇది నికుంభిలాయజ్ఞం. నిర్విఘ్నంగా సాగటానికి చేసిన పన్నగడ అని తెలిసి, దానికి భంగం కల్గించారు. అంతతో యుద్ధంచేస్తూ వాళ్ళ శిబిరందాకా లక్ష్మణాదులను తరుముకొని వెళ్లాడు. లక్ష్మణుడు వెనుదిరిగి మహాస్త్రం సంధించి, నా కుమారుణ్ణి పడవేశాడు. ఇంద్రజిత్తూ! (సన్నగా విలపిస్తుంది.)

సులో: హా (మూర్ఛపోతుంది.)

అక్షయి: అమ్మా! అమ్మా! సులోచన మూర్ఛపోయింది. సులోచనా! సులోచనా!

మండో: సులోచనా! (మొగాన్న నీళ్లు చల్లుతారు)

సులో: (తేరుకొని దిగ్గున నిలిచి) అత్తా. నా నాథుని శరీరం ఇక ఇచ్చటికి తెప్పించండి.

మండో: అమ్మాయీ! శత్రుశిబిరంలో పహారాలో ఉంచారట కొడుకు దేహాన్ని. ప్రాణం పోయిందని నమ్మకం శత్రువులకే చిక్కటంలేదు. మీ మామగారు రేపు రవి అస్తమించేలోపుగా శత్రువులను పూర్తిగా నిర్మూలం చేసి, కొడుకుని బ్రతికించి తెస్తానన్నారు.

సులో: వద్దమ్మా రేపటిదాకా ఆగను. అయినా మామగారికి శత్రుదమనం ముఖ్యం. వారికి దారేషణలు పుత్రేషణలు లేవు వారిని మళ్లీ ఈ కశ్మలంలో దింపను నాకు నా నాథుని చూడటమే ముందు ముఖ్యం. వారు ప్రాణంతో ఉంటే నేనే తెచ్చుకుంటాను. లేకుంటే అక్కడే చితి అంటించుకొని సహగమనం చేస్తాను. సెలవీయండి.

మండో: అసు ... వెళ్ళకు ఆగు. పౌలస్త్యులు దీనిని ఇంతలో ...నియ్యరు.

సులో: అత్తా. జగద్రావణులైన రావణుల దృష్టి వేరు. మున దృష్టి వేరు. కుమారుని తెచ్చుకోటం వారికి ప్రతాపచిహ్నం. ఆ విషయాన్ని మనం రెచ్చగొట్టి వారిని బాధించవలసినవాళ్లం గాము. నా స్వవిషయం నాకు వదిలేయండి. సెలవీయండి

మండో: అమ్మాయీ నువ్విలా శత్రుశిబిరానికి వెళ్తే పౌలస్త్యులకు గౌరవభంగం కాదా?

సులో: అత్తా పతిప్రాణభిక్షుగాని, మరే భిక్షుగాని కోరినదాన్నై వెళ్తే, వారికవమానమే! కాని నే నల్లా వెళ్లటంలేదు. అయినా నే నిల్లా వెళ్లినట్లు వారి కెవరూ తెలియనీకండి. ఇదే నామీద ఆన. మీపాదపద్మాల కిదే నమస్కారం, సెలవు.

మండో: ఆగు అమ్మా పోనీ, అక్షయీ నువ్వైనా అమ్మాయికి తోడు వెళ్లు ఈ అర్ధరాత్రివేళ ఒంటరిగా అంతఃపురాంగన యుద్ధభూమికి పయనమా? హా హా! హతవిధీ!

సులో: వద్దు అత్తా ఎవరూ వద్దు. నాకు ఏ స్వల్పఅసౌఖ్యాలూ, కష్టాలూ, లేవు. నన్ను ఏకాకినిగానే వెళ్ళనీయండి. నా కదే సుఖం. (నిష్క్రమిస్తుంది)

మండో: సులోచనా! మహాసతీ!

౨-వ రంగము

(రాముని సైన్యాల శిబిరాలశ్రేణీముఖంలో వానరులు దూరాన పహరా ఇస్తూంటారు. అంగదుడు సుషేణుడు కూర్చుని ఉంటారు.)

అంగదుడు. అబ్బా! ఇంకా ఆ దేహాన్ని చూస్తే భయమే వేస్తూంది ఎంత యుద్ధం చేశాడు! ఎంత భీభత్సం జరిగిపోయింది, సుషేణా! ఇంకా ప్రాణాలున్నాయంటావా?

నీలు ఉండవచ్చును. ఈ రాక్షసనాథులకు ప్రాణాలు అసులకన్న అంతర్గతంగా ఉంటాయి. అదీ కాకుండా మృత్యువును స్వాధీనంచేసుకున్నవారు, ఈ తండ్రికొడుకులు. వాళ్లమేధస్సులో ఏ చిన్న సిరలో కదలిక ఉన్నా వాళ్లప్రాణం నిలబెట్టుకోగలరు.

అంగదుడు కాని లక్ష్మణుల అస్త్రానికి ఎదురు తిరిగి ప్రాణాలుఅంటూ ఉంటాయా? అబ్బ, ఎంత శబ్దంతో ఛేదించింది ఆ అస్త్రం, ఆ రాక్షసుని గుండెలను! వేయి పిడుగులు పడిన చప్పుడైంది. ఆ విద్యుద్ఘర్షణకు నా కళ్లు మిరుమిట్లుకొలిపాయి. కొండలాగ కూలిపోయాడు ఇంకా ప్రాణం ఎక్కడ ఉంటుంది? అబ్బా పడిపోయి మృతిపొందినా ఎంత భయంకరుడుగా ఉన్నాడో!

సుషే: విభీషణులు ఈ కళేబరాన్ని శత్రువులకు చిక్కకుండా నాలుగు రోజులవరకు కాపలా కాయమన్నారు

అంగ: ఆయనకు వట్టి భయం. అంతకన్న వేరేమీ లేదు. (దూరాన కలవరం - 'అమ్మా మీ రెవ్వరో ఇటు వెళ్ళడానికి వీల్లేదు.'—అంటూ సైనికులు—'నాయనా నే నేం అపకారం చెయ్యను. రామలక్ష్మణుల దగ్గరకు వెళ్ల నియ్యండి' అని సులోచన కంఠం)

సుషే: ఎవరు, ఎవరో ఒక స్త్రీమూర్తి కాపలావాళ్లను తొలగించుకొని వచ్చేస్తూంది.

అంగదుడు: అదేమిటి, ఆమెను చూసి నిశ్చేష్టులై అల్లా నిలచిపోతున్నారు. అరగె వచ్చేస్తోంది. మళ్లీ ఇదేం కామినీమాయయో. (గట్టిగా) రానీయకండి. ఆ స్త్రీని రానీయకండి. (అని అరుస్తాడు.)

(కాపరి పరుగెత్తుకొనివచ్చి) అయ్యా ఆమె ఎవరో మాకు తెలియటం లేదు రామలక్ష్మణుల వద్దకు పోనీమని మావంక ఒకసారి ఆ కన్నులు విప్పి చూసేటప్పటికి, మేము కాదనలేక నిశ్చేష్టుల మయిపోతున్నాం ఆమె కన్నెత్తి చూస్తే మీరూ అంతేనేమో మేమేం చేయలేము. మీరే కాచుకోండి

(సులోచన ప్రవేశం)

అంగదుడు (అడ్డు నిల్చుని) ఎవరమ్మా మీరు, ఈ నిశిరాత్రివేళ శత్రుశిబిరంలోకి ఇల్లా వస్తున్నారు? రాకూడదు వెళ్లండి

సులో: నాయనా నన్ను అడ్డకండి లోపలికి వెళ్లనీయండి నేను ఎవరికీ ఏమీ అపకారం చెయ్యను

కాపరి వెళ్లనీయకండి ఈమె ఎవరో కామినీభూతం అసలు కళ్లుమూసుకుని ముందు వెళ్లగొట్టండి. ఆమె కళ్లవంక చూస్తే నీరుకారిపోతారు.

సులో: నాయనా!

కాపరి అమ్మా నాకు తెలియదు నేను వెళ్లిపోతున్నాను మీరే వెళ్లి చూసుకోండి

సుషే: అమ్మా! నీకేసి చూడలేను. నా కళ్లు మూసుకుంటున్నాను, వెళ్లిపో అమ్మా వెళ్లిపో మేము స్త్రీతో యుద్ధం చేయాల్సిన అవసరం కల్పించకు. ఇక్కడిక రాకూడదు. త్వరగా వెళ్లిపో.

అంగదుడు (శాంతంగా) మాయాసీత

(38-వ పేజీ చూడుడు)

నేటిప్రపంచం

వింత బంధాలు *

ఈజిప్టులో రాజవంశానికి చెందినవారి వివాహబంధాల్ని గురించి వింతకథలున్నాయి. ఈజిప్టులోకెల్ల అపురూపసుందరి అనిపేరుపొందిన ఒక యువతిని రాజు ఫరూఖ్ పెళ్లిచేసుకోదలచి, ఆమె ప్రియుని అమెరికాలో ఉద్యోగమిచ్చి పంపివేశాడట. రాజుపట్ల గలభక్తితో ఆ యువకుడు, ఫౌద్ సాథిక్, ఉద్యోగం స్వీకరించి శాన్ ఫ్రాన్సిస్కో వెళ్లాడు. తరువాత రాజు చెల్లెలు ఫైఖ్ అమెరికా వెళ్ళడం తటస్థించింది. రాజుకి తెలియకుండా ఆమె సాధిక్‌ను ఈ మాసారంభంలో శాన్ ఫ్రాన్సిస్కోలో పెళ్లిచేసుకుంది. అతని మొదటి ప్రియురాలు ఈజిప్టులోనే ఉండిపోయింది. ఇప్పటివరకూ రాజు ఆమెను వివాహం చేసుకోలేదు. మరెవ్వరూ వివాహం చేసుకోడానికి సిద్ధపడ్డం లేదు.

ఆరబ్ రాజ్యాల మధ్య రాజకీయాలు కూడా దాదాపు ఈ పోలికనే ఉంటాయి.

అరబ్బీరాజ్యసమితి *

పశ్చిమాసియాలోని అరబ్బీరాజ్యాలు ఏడూ దేశరక్షణసహకారసంధి చేసుకోడానికి చాలరోజులుగా యత్నిస్తున్నాయి. ఏ రెండింటిమధ్యనూ వాస్తవమైత్రిలేని ఈ ఏడు రాజ్యాలూ అటువంటి సంధి చేసుకోగలగడమే గగనం. చేసుకున్నతరవాత ఎలా సహకరించగలవో ఊహించడం కష్టం.

తూర్పుఆసియాలో భారతదేశాన్ని చేర్చి ఇటువంటి దేశరక్షణసహకారం పేరుతో సైనికసంధి ఒకటి చెయ్యాలని అమెరికా ఎంత కృషిచేసినా పండిట్ నెహ్రూ అంగీకరించకపోవడంవల్ల అటువంటిది కుదరలేదు. ముస్లింరాజ్యసమాఖ్య పేరుతో పర్షియా, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, టర్కీలను చేర్చి సైనికసంధి చేయాలనే యత్నాలు విఫలమైనాయి. అరబ్బీ రాజ్యసమితిలో 'మొదటినుంచీ తగవులేర్పడినందువల్ల ఇంతవరకూ అటువంటిది సాధ్యపడలేదు. కాని వారి ఆర్థికవ్యవస్థ అంతా బ్రిటన్ అమెరికాలపైనే ఆధారపడి ఉన్నందువల్ల ఆ ప్రభుత్వాల ఒత్తిడిఫలితంగా సంధి చేసుకోవడం జరగవచ్చును కాని పరస్పరఅనుమానాలు ద్వేషాలతో నిత్యం కలహించే దేశాల మధ్య నిజంగానే ప్రమాదపరిస్థితి సంభవిస్తే సంధికి కట్టుబడే ఎన్నిదేశాలుంటాయో చెప్పడం కష్టం.

అదీకాకుండా ఇప్పుడీ సంధి, సాధ్యమవ



జోర్డన్ రాజు అబ్దుల్లా

డానికి మరొక హేతువుంది. పాలస్తీనాలో యూదురాజ్యం చీలిపోగా మిగిలిన ప్రాంత భవిష్యద్రాజ్యాంగవ్యవస్థ గురించీ, ఇరాక్ సిరియాల రాజకీయసమ్మేళన గురించీ ఈజిప్ట్ జోర్డన్ రాజ్యాల మధ్య తగవులు తంత్రాలూ పోటీలు నడుస్తున్నాయి. పాలస్తీనాలో అరబ్బీప్రాంతాన్ని తనరాజ్యంలో కలుపుకోవాలనీ, సిరియాను ఇరాక్‌లో కలపాలనీ జోర్డన్ రాజు అబ్దుల్లా (ఇరాక్ రాజు జోర్డన్ రాజుకు తమ్ముని కుమారుడు) ప్రయత్నిస్తున్నాడు.

అరబ్బీ పాలస్తీనా కలిసినట్లయితే జోర్డన్ రాజుకు సముద్రతీరం, రేవు దక్కుతాయి. అంటే మధ్యధరాప్రాంతంలో నౌకాబలం ఆర్జించి ఈజిప్ట్, టర్కీలతో సమానమైన ప్రతిపత్తిని ఆర్జించుకోవాలని అతని కోరిక. సిరియా ఇరాక్‌లు కలిసినట్లయితే దానిని ఎప్పటికైనా జోర్డన్ రాజ్యంతో కలపవచ్చును కనీసం ఇరాక్ సిరియాలు జోర్డన్ అదుపాజ్ఞల్లో ఉండగలవు. టర్కీ ఈజిప్టులకి పోటీగా జోర్డన్ రాజ్యాన్ని బలమైన రాజ్యంగా చెయ్యాలనే ఎత్తుతో అబ్దుల్లాకి బ్రిటిష్ రాజనీతిజ్ఞులే ఈ సలహాలిచ్చారు. ఇప్పటికే జోర్డన్ రాజు కేవలం బ్రిటిష్ ప్రభుత్వంచేతిలో కీలుబొమ్మ. జోర్డన్ రాజు తంత్రాల్ని ఈజిప్ట్ ప్రభుత్వం ఇంతవరకూ పడగొట్టగలిగింది. కాని పాలస్తీనాలో యూదులతో యుద్ధంసందర్భంలో ఆరబ్ రాజ్యసమితి నెదిరించి జోర్డన్ రాజు స్వతంత్రంగా ప్రవర్తించినందువల్ల కొంత అపకారం కలక్కపోలేదు. నెగెవ్ ఎడారిలో ఈజిప్ట్ సైన్యాలింకా యూదు సైన్యాలతో పోరాడుతున్న సమయంలో జోర్డన్ రాజు యూదులతో యుద్ధవిరామసంధి చేసుకున్నాడు. పాలస్తీనాలో యుద్ధంలో యూదుసైన్యాల్ని ఎదిరించి ఓడించాలనే ఉద్దేశంతో కాక, దక్షిణపాలస్తీనాను, సముద్రతీరప్రాంతాన్నీ ముందుగా ఆక్రమించుకోవాలనే ఆత్రంతో ఈజిప్ట్ సైన్యాలూ, జోర్డన్ సైన్యాలూ పోటీపడినందువల్లనే యూదులకు విజయం లభించింది. యుద్ధం పూర్తిగా విరమించబడినప్పటికీ తీరప్రాంతం, ఘాజా రేవు తప్పమిగతాప్రాంతం అంతా జోర్డన్ రాజు వశమయింది ఆ తీరప్రాంతం ఈజిప్ట్ సేనల వశమయింది. పాలస్తీనా విభజనకు బ్రిటిష్ వారు చేసిన ప్రతిపాదనలో కంటె వాస్తవంగా యూదులకు జెరూసలెంవద్ద 5 వేల కిలోమీటర్ల మేర అధికంగా దక్కింది.

(36-వ పేజీ చూడుడు)

కథానిక :

సంతృప్తి

శ్రీ నేరళ్ల లక్ష్మణరావు

మానవుని మనస్సు మళ్ళించటానికి ప్రయత్నం చెయ్యడం చాలా ప్రమాదం. మానవుని మనస్సు మళ్ళించటానికి తోటిమానవుని తరంకాదు. అట్టి స్థితిలో యీ రాజకీయవేత్తలు, సంస్కర్తలు మానవప్రవృత్తులను మార్చటానికి చేసే ప్రయత్నాలను చూస్తూవుంటే యెంతో ఆశ్చర్యం వేస్తూంది. ఒకరికి యే విషయంలోనైనా సలహా యివ్వాలంటే నాకెంతో చిన్నతనంగా వుంటుంది. అసలు మనం యే విధంగా నడచుకోవాల్సింది మనకే తెలియదే, 'ఫలానావిధంగా నడచుకోండి' అని యితరులని యెల్లా శాసించగలుగుతాం.

నామట్టుకి నాకు, నా విషయమే నాకు బాగా తెలియదు, యితరుల విషయాన్ని తెలుసుకోవటానికి వ్యర్థప్రయత్నమెందుకు? మన సామాజికుల మనోప్రవృత్తులను మనం కొంచంకొంచంగా వూహించగలం ప్రపంచంలో ప్రతిమానవుడు కర్మపాశంచేత బంధింపబడ్డవాడే. ఒక మానవుడు మరొక మానవునితో యేదో రూపేణా తన మనోప్రవృత్తులను తెలియచేస్తాడు. దాని అర్థం యితరులకు వేరుగా వుండవచ్చు. కాని మానవసమాజం అది ఎంతప్రయత్నం చేసినా అరికట్టలేదు. తానేదో గొప్పవాడని భ్రమిస్తాడు. అంతా వట్టిదే. వట్టిదని మనకి తెలుసు, మరి వాడికో...... .. అదే సృష్టి చమత్కారం.

మానవుడు జీవితంలో అనేకతప్పులని చేస్తాడు. 'తప్పులని దిద్దుకోవటానికి ప్రయత్నం చెయ్యడు. అసలు అతను చేసేది ప్రతిది వొప్పనే అతని నమ్మకం ఇది, కూడా సృష్టివైపరీత్యమే

అసలు యీ మాటలన్నీ చెప్పటానికి నేనెవరిని? మానవుని జీవితాన్ని ఋజుమార్గంలో నంచటానికి . మానవునికి సాధ్యమా? జీవితం కడు దుర్భరమైనది, చంచలస్వభావం కలది, అట్టి అసంతృప్తికరమైన, అప్రమేయమైన జీవితాన్ని సక్రమంగా నడపటం కూడా దుర్భరమైన వ్యాపారమే.

నా జీవితంలో నేనిప్పటికి సంపూర్ణ జీవిని కాలేదు. అట్టి స్థితిలో నా సోదరుని జీవితాన్ని నిర్ణయించటానికి నేనెవరిని? కాని, కొంతమంది తమ జీవితరంగప్రప్రథమంలోనే దెబ్బతింటారు. అట్టివారికి మనం సహాయం చేయక తప్పదు. నా మిత్రులు నన్ను, యీ జీవితంగడిపే మార్గం యెల్లాగని అడుగుతూ వుంటారు. నేను వారికిచ్చే సమాధానం యిల్లాగుంటుంది, "ప్రతి మానవుని జీవితం అతని కయోమయంగాన, అగమ్యగోచరంగానే వుంటుంది. ప్రతి మానవుడు విధికి కట్టుబడి వుండవలసిందే. విధినియామ కొన్ని దాటటానికి మన పూర్వులకే అసాధ్యమయింది, మన మనగా యెంత వాళ్లం," అని వాళ్లని సమాధానపరుస్తూ వుండేవాణ్ణి.

ఒక్క పర్యాయంమాత్రం నేనొకాయనకు అద్భుతమైన సలహా నిచ్చేను. నా జీవితంలో నేను చేసిన ఘనకార్యం అదే

అప్పటికి నేను చాలా చిన్నవాణ్ణి. అంటే షుమారు పాతికేళ్లుంటాయి. ఎప్పుడూ యేదో వ్రాస్తూనే వుండేవాణ్ణి. చిన్నప్పటి నుంచి మిస్టిసిజమంటే నాకెంతో యిష్టం. తదితరవిషయాల్లో కూడా కొద్దో గొప్పో పరిచయం వున్నవాణ్ణి. నా వాలుకుర్చీలో కూర్చుని యేవో ఆలోచిస్తున్నాను. వూహాపథంలో పెద్దవి, చిన్నవి, పాతవి, క్రొత్తవి ఆలోచనలెన్నో పరువు లెడుతున్నాయి ఇంతలో తలుపు చప్పుడయింది. దిగ్గున లేచి తలుపు తీసాను.

ఎవరో ఒక అపరిచిత వ్యక్తి నా వైపు తదేకదీక్షతో చూస్తూ ముందుకు వస్తున్నాడు. చేతిలో కర్రా, కళ్లకి జోడూ వున్నాయి సుమారు ముప్పది సంవత్సరాలుండవచ్చు. వెంటనే ఆ వ్యక్తి ఆగి, "క్షమించండి... తమ నెక్కడో చూచినట్లుంటే... ." అన్నాడు.

"ఫరవాలేదు మీరు నన్నీ వూళ్లోనే చూచివుండాలి. ఎందుచేతనంటే నే నీవూరు దాటి యెప్పుడూ యెక్కడికీ వెళ్లలేదు." అన్నాను.

"అవునవును.. యీ వూళ్ళోనే టౌన్‌హాల్లో తాము వుపన్యాసం చెబుతూ వుంటే." అన్నాడా వ్యక్తి. (చిన్న నవ్వుతో)

"మాస్తే చూచి వుండవొచ్చు...తాము వచ్చిన కార్యం?"

"అబ్బే యేముంది తమ దర్శనం ఒక్క పర్యాయం చేసిపోదామని వచ్చాను. తాము వ్రాసిన కొన్ని గ్రంథాలని చదివి అమితానందభరితుడి నయ్యాను. మీరు వ్రాసిన విషయాలలో కొన్ని అనుమానములు వచ్చి మిమ్మల్ల నడిగి సందేహనివారణ చేసుకుందామని వచ్చాను."

"అంతకన్నా యేముంది, తప్పక అడగవచ్చును. నాకు తెలిసినవిధంగా మీ అనుమానాలని తీర్చటానికి ప్రయత్నంచేస్తాను," అన్నాను.

"తాము స్పైయిజ్‌ను గురించి వొక గ్రంథం వ్రాసారు. ఆగ్రంథాన్ని చదువుతూ వుండగా నాకు కొన్ని అనుమానాలు వచ్చేయి."

"తప్పక అడగండి...మరోలా అనుకోవద్దు, ఆ పుస్తకంలో యేమయినా లోపాలుంటే సె. విప్పండి, తప్పక దిద్దుకుంటాను."

"అబ్బే! లోపాలు కనిపెట్టేటంత సమర్థుణ్ణి కాను లెండి—నే నొకచిన్న వైద్యుణ్ణి యీ దేశం వదిలి స్పైయిన్ వెళ్లదామనుకున్నాను. బాబూ! అక్కడ మనజాతి వాళ్లెవరేనా వుంటారా అండి? అసలు నాకు పరాయిదేశం వెళ్ళడమంటే చాలా భయం. చిన్నప్పటినుంచి ఒకేవూళ్ళో పుట్టి పెరిగిన వాణ్ణి. లోకజ్ఞానం కొంచం తక్కువ. నాకు చిన్నప్పుడే మావాళ్లు వివాహం

చేసారు. పిల్లలింకా మీ దయవల్ల లేరు లెండి. మామూలుగా వైద్యం చేస్తూ వుంటాను నాకిక్కడేమీ కిట్టుబాటు కావటంలేదండి. మీరు వ్రాసినదాన్ని బట్టి చూస్తే అక్కడేమయినా నాలుగు డబ్బులు దొరుకుతాయేమో నని. అయినా మీ వుద్దేశం యేమంటారు?"

అతని ధోరణి చూచి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. "ప్రపంచంలో యిల్లాంటివాళ్లుకూడా వుంటారు కాబోలు", అనుకున్నా. అతడు చాలా పొట్టివాడు. కొంచం నల్లగా వుంటాడు, దట్టంగా గడ్డాలు మీసాలు వున్నాయి చాలా చలాకీ యైన మనిషి కొంచంసేపు సైకాలజీ స్టడ చేసి, యిల్లా ప్రారంభించాను.

"తప్పక మీరు స్పెయిన్ వెళ్లవలసిందే మీకు అభివృద్ధి సూచనలున్నాయి ," అన్నాను

"అసలు వైద్యవృత్తి అంటేనే, ప్లీడరు వృత్తివంటిది వస్తే బోలెడు వస్తుంది లేక పోతే మొదటికే మోసం వస్తుంది అంచు కనే మనవాళ్లు, వైద్యుడికి చెయ్యి, ప్లీడరుకి నోరు మంచిది కావాలంటారు."

"నిజమే. అల్లాగ నని మన ప్రయత్నం మానేస్తా మంటారా? మన ప్రయత్నం మనం చేస్తే మిగతాది భగవంతుడు పూర్తి చేస్తాడు అయినా మీలాంటి పెద్దలకి నేను చెప్పవలసినవాణ్ణి కాననుకోండి" అన్నాను.

"నా పెద్దరికం చట్టు బండలయినట్లే వుంది. బుద్ధిమంతు లయితే చాలు చిన్నా పెద్ద యెవ్వరూ చూడరు."

"మీరు, నామీద వున్న ప్రేమచేత అ వింగా మాట్లాడుతున్నారుగాని, అసలు నాలో యేమీ గొప్పతనంలేదు. అసలు మీ రొచ్చిన పని మరచిపోయారు. మీరు స్పెయిన్ వెళ్లటం మీ భార్య కిష్టమేనా?

"నా భార్య కిష్టమే"

"అవుతే చాలా కష్టమే!'

"అవును ఆ సంగతి నాకు తెలుసు. మీ రెల్లా చెబుతే అల్లా చెయ్యటానికి సిద్ధంగు వున్నాను ఉండమంటే వుంటాను వెళ్లమంటే అక్కడికే వెళ్లుతాను."

"ఇది మీ జీవితానికి సంబంధించిన సమస్య, దీన్ని మీరే యథోచితంగా పరిష్కరించుకోవటం చాలా మంచిది. మీ విషయంలో నాకేమీ అట్టే తెలియదు. అయినా మీ రంతిగా అడుగుతున్నారు గనుక ఒక్క విషయంమాత్రం చెప్పగలను మీకు ధనాశవుంటే అక్కడకి వెళ్లటం అన వసరం. ధనాశ లేక,యేదో జీవితం సుఖంగా గడచిపోతే చాలనుకుంటే, స్పెయినంత స్వర్గం మరోటి లేదు ఈ రెండింటిలో మీ సమ్మతం యేమిటో ఆలోచించుకోండి వున్న విషయాన్ని చెప్పాను."

"చాలా సంతోషం, మీరు నాకు గొప్ప వుపకారం చేసారు. ధన్యుణ్ణి వెళ్లి వస్తాను," అని ఆ వ్యక్తి వెళ్లిపోయాడు

ఆ యుదంతం రెండు మూడు రోజుల వరకు జ్ఞాపకం వుంది తరువాత పూర్తిగా మరచిపోయాను.

౨

పదిహేన సంవత్సరాలు అవలీలగా గడచిపోయాయి. ఒక పర్యాయం నేను స్పెయిన్ వెళ్లవలసివచ్చింది అక్కడ సెవిల్లీ నగరంలో ఒక హోటల్లో బస చేసాను ఆసమయంలో నాకు కాస్త సుస్తీ చేసింది. ఆ హోటలుకుర్రాడిని పిలిచి, "అబ్బాయీ! యీ వూళ్లో యెవ్వరయినా యింగ్లీషు వైద్యుడున్నాడా? అని అడిగాను ఆ కుర్రాడు, "యిక్కడికి షుమారు మూడుమైళ్ల దూరంలో ఒక వైద్యుడున్నాడండి," అన్నాడు

"సరే టాక్సీ తీసుకురా అక్కడికి వెళ్దాం," అన్నాను.

ఆ కుర్రాడు టాక్సీ తీసుకొచ్చాడు. యిద్దరం కలసి అక్కడికి వెళ్లాం.

ఆ వైద్యుడు నేను వెళ్ళడం తోటే తన సీటు మీదనుంచి లేచి నన్నొక వున్నతా సనం మీద కూర్చోపెట్టాడు. అతడు నాకు చేసే పరిచర్యలను చూచి నాకెంతో ఆశ్చర్యంవేసింది ఏదో చిరకాలపు మిత్రుడ్ని కలుసుకుంటే పడే ఆనందాన్ని' అతడను భవిస్తున్నాడు. నా కద్దంతా అయోమయంగా వుంది.

"క్షమించండి.. తమ రెవరో నా కర్థం కావటం లేదు నాకోసం తమరు చాలా కష్టపడుతున్నారు", అన్నా.

"నన్ను మీరు మరచిపోయి వుంటారు. కాని నేనుమాత్రం మిమ్మల్ని మరచిపోలేదు. ఇదంతా మీరు పెట్టిన భిక్షే నాలో అద్భుత మయిన మార్పును తెచ్చారు యిప్పటికైనా గుర్తు తెచ్చుకొన్నారా? అన్నాడా వైద్యుడు.

ఒక్క పర్యాయం, పదిహేను సంవత్సరాల క్రితం జరిగిన యీ యుదంతం కోసం నా స్మృతిగ్రంథాన్ని తిరిగేసాను మళ్లా, అంతా కళ్లకి కట్టినట్లవుపించింది.

"అవును గుర్తొచ్చింది మిమ్మల్ని మరచి నందుకు క్షమించండి," అన్నాను.

తర్వాత నే నొచ్చిన పనిని చెప్పాను అతడెంతో ఆప్యాయంగా నాకు మందిచ్చి నన్ను చాలా గౌరవించాడు. నావద్దనుంచి ఒక్కదమ్మిడీ అయినా తీసుకోలేదు. తన గృహాన్ని చూపించాడు. తన భార్యకి స్పెయిన్ వాతావరణం నచ్చకపోవడం వల్ల తన స్వదేశానికి ఆవిడ వెళ్లిపోయింది ఈ వైద్యుడు మరొక స్పేనిష్‌యువతిని వివాహం చేసుకొని సుఖంగా జీవితం గడుపుతున్నాడు

"మీరు నాకు గురువులు. మీరు చెప్పిన మాటలు అక్షరాలా నిజమయ్యాయి. నాకె మాత్రం ధనాశ లేదు. జీవితం సుఖంగా గడచి పోతే చాలు. పెద్ద మేడలుమిద్దెలు కట్టనక్కర్లేదు. జీవితంలో యెన్నివున్నా సంతృప్తి లేకపోతే ఆ మానవుని జీవితం దుఃఖమయిష్టమే నేను మహారాజుకంటే యెక్కువ ఆనందాన్ననుభవిస్తున్నా నని చెప్పటానికి గర్వపడుతున్నాను కనుక మానవునికి సంతృప్తి అత్యావశ్యకం.

* (కథాంజలి, సోమర్‌సెట్ మాఘం నుండి).

కృతజ్ఞత

(గల్పిక)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

"ఏప్రిలు 6 న పెట్టిన మీ దరఖాస్తు మే 2 న ఉదయం పదిగంటలకు మా ఆఫీసుకు వచ్చి మా జనరలు మేనేజరును కలవండి"

రమణయ్య ఈ ఉత్తరాన్ని అదివరకే అనేక డజన్ల సార్లు చదివి కంఠస్థం చేసుకున్నాడు. అయినా వేళంకాని వేళంలో, దారిద్ర్యం అట్టుడుకు చూస్తున్న రమణయ్య చాలా జాగ్రత్తలు పడవలసి ఉంది. ఆ ఉత్తరాన్ని జేబుదొంగలు కాజెయ్యవచ్చు. లేదా జేబులో కనపడని చిల్లి ఉండి అందులోనుంచి అది జారిపడిపోవచ్చు. ఏ గారడీగాని జరిగి ఆ ఉత్తరం బదులు జేబులో మరొక ఉత్తరం ఉండవచ్చు. లేదా, ఆ ఉత్తరంలో తాను చదివిన అక్షరాలు తారుమారైపోయి, "మీకు మా ఆఫీసులో ఉద్యోగాలు లేవు ఇంకెక్కడన్నా చూసుకోండి" అన్న ముక్కలు అందులో ప్రత్యక్షం కావచ్చు. అందుకని ఆ ఉత్తరాన్ని రెండు నిమిషాల కొకసారి వేళ్లతో తడివి చూసుకోవటమూ, అయిదునిమిషాల కొకసారి పైకితీసి విప్పి చూసుకోవటమూ రమణయ్య ప్రాణానికి అత్యవసరం.

ఈ ఉత్తరం రాసిన కంపెనీ ఇదేనా? ఇదే! ఇవాళ రెండేనా? ఆహా! సంవత్సరం గాని మారలేదు గద? లేదు! ఇంకా పది గంటలు కాలేదా? ఎదురుగా ఉన్న గడియారాన్ని బట్టి కాలేదనే అనుకోవాలి అది ఆగిపోలేదు గద? పొరపాటున పదిన్నరో పదకొండో అయిందనుకో, ఇంత ఆలస్యంగా వచ్చావేమని వీళ్ళ జనరలు మేనేజరు కర్ర ఎత్తితే?

రమణయ్యను కూర్చోమని కుర్చీ చూపి పోయిన సిపాయికుర్రాడు మళ్ళీ ఐపు లేడు పదిగంటలు కొట్టేసరికి జనరలు మేనేజరు వస్తారని చెప్పాడు. వాడికి రమణయ్య తన జేబులో ఉన్న ఉత్తరం చూపాడు కూడానూ

టకటకా బూట్లచప్పుడు వినిపించింది ఎవరో ఒక పొట్టిమనిషి వచ్చాడు. ఎందుకైనా మంచిదని రమణయ్య అనుమానిస్తూ నిలబడ్డాడు. ఆయన రమణయ్యకేసి చూడకుండా పక్కగా వెళ్లిపోయినాడు రమణయ్య మళ్లా కూచోబోతుండగా ఆయన వెనక్కు తిరిగి, తెలుగులో - చక్కని గుంటూరుజిల్లా భాషలో! - "రమణయ్య గారు కాదూ?" అంటూ వెనక్కు వచ్చాడు.

రమణయ్య హృదయం మిఠాయి చూసిన పిల్లాడల్లే గంతులు వెయ్యసాగింది.

"మీరెవరో—" అన్నాడు రమణయ్య విశాలంగా నవ్వుతూ

"నన్ను మీరు మరిచి ఉంటారు మీవల్ల మహోపకారం పొందినవాణ్ణి కనక నేను మిమ్మల్ని జన్మలో మరవలేను నేనిప్పుడు ఈ కంపెనీకి జనరలు మేనేజరుగా ఉంటున్నాను మా ఆఫీసుకు పోదాం రండి!"

రమణయ్య ఎన్నడూ తాగినవాడు కాడు. కాని ఆక్షణంలో ఆయన బాగా తాగినవాడల్లేనే ఉన్నాడు. అయితే అసంగతి ఆయనకు తెలీదు

జనరలు మేనేజరు ఆఫీసుగది స్వర్గం మాదిరిగా కనిపించింది. రమణయ్యకు గదిలోకి రాగానే చల్లగా ఉన్నది. అద్దాలు పరిచిన బల్లా, తళతళా మెరిసే కుర్చీలూ, అందమైన పేపరు వెయిటులూ—వర్ణనాతీతంగా ఉంది

"నా పేరు సోమయాజులు మీరు నా పేరు ఎరగరు నేను అతి దౌర్భాగ్యస్థితిలో ఉండగా మీరు నాకు—నేనెవరో తెలీకుండానే, నేను తిరిగి ఇస్తానన్న నమ్మకం లేకుండానే రెండురూపాయలు ఇచ్చారు ఆ రెండు రూపాయలూ నా జాతకం మార్చివేశాయి. ఇందులో ఏమీ అతిశయోక్తిలేదు నేనివాళ ఈ కుర్చీలో కూర్చుని పన్నెండు వందలు సంపాదిస్తున్నానంటే అది మీ చలవే!"

రమణయ్య నవ్వటం తప్ప ఇంకేమీ అనలేకపోయినాడు

"మీరు పెట్టిన దరఖాస్తు చూశాను. కాని మీరే అని అనుమానం రాలేదు. ఎంతమంది రమణయ్యలుంటారు! మీరు ఇంటర్వ్యూకోసం వచ్చి ఉంటారు. నాకు ఇంత మహోపకారం చేసినవాడికి నేనీ పాడు ఉద్యోగం ఇవ్వలేను, ఇవ్వను. అది తలాపెట్టరాదు. ఇంతకంటె మంచి ఉద్యోగం చూడండి"

సోమయాజులు మౌనం వహించడం చూసి రమణయ్య ఆయన చెప్పబోయే శుభవార్తకోసం నిరీక్షించసాగాడు

అయిదు నిమిషాలయింది

"నా సంగతి—" అన్నాడు రమణయ్య

"మంచిది మీరు వెళ్లిరండి ఉద్యోగం దొరికినసంగతి నాకు ఫోను చెయ్యండి"

రమణయ్య తన చెవులను నమ్మలేకపోయినాడు. ఆయన మొహాన రక్తం లేకుండా పోయింది.

"అన్నట్టు, ఇదిగో మీ రెండురూపాయలు! ఎవరు చూశారు? ఈ రెండు రూపాయలు మీకు ఎంత అదృష్టమైనా తీసుకు రావచ్చు."

బయటికి నడిచేటప్పుడు రమణయ్య కాళ్లు లాడీలలాగా ఉన్నాయి.

రాష్ట్రకాంగ్రెసు - ప్రభుత్వము

శ్రీ సహజానందం

ఈమధ్య కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టుల దౌర్జన్యం హెచ్చింది. వెంటనే (మార్చి 29) ఢిల్లీనుంచి రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడు రంగా ఒక ప్రకటన చేశాడు. కమ్యూనిస్టులదాడులు స్థానికసంఘర్షణలు కావని, ప్రభుత్వంమీదే యుద్ధం ఆరంభించారని, కమ్యూనిస్టుల ఉద్యమం గెరిల్లా యుద్ధంతో సమానంగా ఉందని, ప్రజలు భయాక్రాంతులైరని, కేంద్రప్రభుత్వం ప్రజలను రక్షించాలని అన్నాడు. గ్రామస్థులు కమ్యూనిస్టుల చేతుల్లో హతులౌతున్నారని, గాయపడుతున్నారని, లక్షలకొద్దీ ఆస్తిని కమ్యూనిస్టులు దోపిడీచేస్తున్నారని ప్రకటించాడు. పరిస్థితు లెరుగని కొత్తవారా ప్రకటనను చదివితే, కమ్యూనిస్టులు రేపో మాపో తెలుగుదేశాన్నంతా తుడముట్టించేట్టున్నారని తోస్తుంది. ఇటువంటి ప్రకటనలవల్ల ప్రజల్లో ధైర్యస్థైర్యాలు ఉన్నవికూడా పోయి, కమ్యూనిస్టుల దౌర్జన్యానికి మరింత తోడ్పాటు లభిస్తుంది. ఇది "దాసోహ" మంటారు. కమ్యూనిస్టులకు మంచి ఉషార్.

ఇలా ప్రజలకు మరింత పిరికిపాటు పోయటమేకాక, ఈ ప్రకటన రాష్ట్రప్రభుత్వాన్నికూడా దెబ్బకొట్టింది. ప్రజలను రాష్ట్రప్రభుత్వం రక్షించలేకపోతోంది కాబట్టి, కేంద్రప్రభుత్వం రక్షించాలని అంతరార్థం. ప్రభుత్వాన్నిస్థాపించింది కాంగ్రెస్‌పార్టీ. ఈ ప్రకటన చేసింది కాంగ్రెసుఅధ్యక్షుడు. ఒకేసంస్థయొక్క ప్రతినిధులే ఇలా అవిశ్వాసాన్ని బహిరంగంగా ప్రకటిస్తుంటే, ఇంక సంస్థ అన్నా, ఆ సంస్థ నడిపే ప్రభుత్వ మన్నా ప్రజలకు గౌరవాభిమానాలు ఏముండగలవు? శ్రద్ధాభక్తులు ఏముండగలవు? ఇందుమూలంగా ప్రభుత్వమంటే ప్రజలకు కలిగే అవినయ, అగౌరవాలు కమ్యూనిస్టులకు అదునుకావా? తమకుతామై అరాచకశక్తులను ప్రతిఘటించలేకుండా ఉన్న ప్రజలు ప్రభుత్వాన్ని హీనంగా చూసేట్టుచేస్తే, అరాచకాన్ని ఎలా ఆపటం? ఎవ్వరు ఆపుతారు?

ఢిల్లీనుంచి రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుని ప్రకటనతర్వాత, రాష్ట్రకాంగ్రెసు కార్యసంఘం సమావేశమై కమ్యూనిస్టుల అత్యాచారాలగురించి చర్చచేసింది. చివరకు సారాంశమేమంటే పై ప్రకటననే ఒక తీర్మానంగా విశదంచేసి ప్రకటించారు. అధ్యక్షునికంటె ఇంకా రెండడుగులు ముందుకు వేసి, రాష్ట్రప్రభుత్వాన్ని దుయ్యబట్టుకున్నారు (ఏప్రిలు-2). కమ్యూనిస్టుల దౌర్జన్యాన్ని నిర్మూలించటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని, కాబట్టి రాష్ట్రపోలీసుశాఖను కేంద్ర ప్రభుత్వం తన ఆధ్వర్యం క్రిందకు తీసుకొని, ప్రజలను రక్షించాలని తీర్మానించారు.

కమ్యూనిస్టులు దౌర్జన్యంతో శాంతి భద్రతలను భగ్నంచేస్తుంటే, రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుని ప్రకటన, కార్యవర్గతీర్మానం ఆ దౌర్జన్యానికి దోహద మిచ్చేట్టుగా ప్రజల ధైర్యస్థైర్యాలను, ప్రభుత్వంపై విశ్వాస గౌరవాలను నీరసపరుస్తున్నయ్. ఈ ప్రకటనవల్ల, తీర్మానంవల్ల ప్రజల నేవో ఉద్ధరించామనుకుంటే, అది భ్రాంతి

ఒక పక్కన ప్రధానమంత్రి ఆంధ్ర ప్రాంతాల్లో ప్రజలకు ధైర్యోత్సాహాలు కలిగించేందుకుగాను పర్యటనం చేస్తున్నాడు. ఈ సందర్భంలో ప్రధానమంత్రితో కలసి, రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడుకూడా పర్యటనం చేసి, ప్రజలకు కాంగ్రెసులో ఐక్యతను ప్రదర్శించి, వారిలో కమ్యూనిస్టువ్యతిరేకఉద్యమాన్ని నడిపే శక్తిని ఉద్ధృతం చేయటానికిబదులు, ఈ ప్రభుత్వం మీద ప్రజలాధారపడితే లాభం లేదు, కేంద్రప్రభుత్వం పోలీసు పరిపాలన సాగించాలి అంటే, ఇంతకంటే అనాలోచన ఇంకేముంటుంది?

ప్రభుత్వం రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడిని, శాసనసభలోని ఇతరప్రముఖప్రతినిధులను, ప్రతికూలపక్షనాయకులను పర్యటనకు ఆహ్వానించి ఉండవలసింది. ప్రజాస్వామ్యంలో ఇతరప్రజాస్వామికపక్షాల సహకారం, సహాయం అర్థించటం ధర్మం. కర్తవ్యం. అప్పుడే ప్రజల్లో ఇంకెక్కువ ఐక్యత సిద్ధిస్తుంది. ఇలా చేయకపోవటం ప్రభుత్వం వైపు లోపం. శాసనసభలో మనదే ఆధిక్యత గదా అని విర్రవీగకూడదు. ఇతరపక్షాలవారి సంపూర్ణసహకారం అత్యవసరం ఇప్పటి పరిస్థితి ఇది. శాంతిభద్రతల విషయం వచ్చేటప్పటికి ప్రతికూలపక్ష సభ్యులు, ఇతర కాంగ్రెసుప్రతినిధులు పోలీసుల అత్యాచారాల గురించి ప్రభుత్వాన్ని హెచ్చరించటం మటుకే జరుగుతోంది. (ఈ హెచ్చరిక అవసరం.) అంతేకాని కమ్యూనిస్టులను ఎదుర్కోటంలో వీరి చేయూత ప్రభుత్వానికి లభించటంలేదు. ఈ లోపాన్ని ప్రభుత్వం దిద్దుకోవాలి.

చివరకు ప్రధానమంత్రి, రాష్ట్రకాంగ్రెసుఅధ్యక్షుడు ఒకేసంస్థకు సంబంధించికూడా కలసి పర్యటన చేయలేకపోయారు. గౌరవలాంఛనాలకోసం అలిగే సమయం కాదిది. ప్రభుత్వం ఆహ్వానించకపోయినా, ఆ లోపాన్ని దిద్దగలిగిన అవకాశం, దిద్దవలసిన కర్తవ్యం రాష్ట్రకాంగ్రెసు కున్నయ్

ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుగెరిల్లా యుద్ధం ఆరంభమైందని అంటూ రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడు వెంటనే ఢిల్లీ చేరుకున్నాడు. ఇటువంటి పరిస్థితిలో ఢిల్లీ ముఖ్యమా? లేక ఆంధ్రప్రజలా? ప్రభుత్వం అసమర్థంగా ఉందనటం సులభమే. కాని మనం ఏం చేస్తున్నాం? చేయగలుగుతున్నాం? గెరిల్లాయుద్ధం సాగుతున్న ప్రాంతాన్ని విడిచి, ఎక్కడి

(31 వ పేజీ చూడుడు)



యుక్తికి పై యుక్తి

అనగనగా ఒక పట్టణంలో ఒక మంగలి వుండేవాడు. అతడు చాలా అందంగా క్రాపింగులు చేయుట, గడ్డములు, మీసములు మొదలగునవి సరిదిద్దుట, మొదలగునవి చేయగలవాడగుటచే, ఆపట్టణములో మిక్కిలి ప్రఖ్యాతి గాంచెను. అందరును వానివద్దకే వచ్చుచుండుటచే, అతడు చాలా ధనవంతుడయ్యెను. ధనముతోపాటు గర్వము గూడా హెచ్చెను, అప్పుడతడు, ధనవంతులగు షాహుకార్లకు, పెద్ద వుద్యోగస్థులకు, జమీందార్లకు, మాత్రమే పని చేయుచుండెను. బీదలను ఎల్లప్పుడు వేళాకోళ మాడుచుండెడివాడు.

ఇట్లుండ ఒకనాడు ఒక కట్టెలమ్మువాడు, కావిడితో పుల్లలు తీసుకువచ్చెను. అప్పుడు మంగలి కట్టెలకావిడి ఎంత కిచ్చెదవని యడుగగా, రూపాయి కని కట్టెలమ్మువాడు సమాధానము చెప్పెను. వెంటనే మంగలివాడు, రూపాయి, యిచ్చి కట్టెలనే గాక, కావిడినిగూడా లాగుకొనెను. కట్టెలమ్మువాడు వెంటనే, న్యాయస్థానమునకు పోయి ఫిర్యాదు చేసెను. న్యాయాధిపతి మంగలిని ఏల కావిడి లాగుకొంటివని యడుగగా, మంగలి, నేను మొదట కావిడియంతయును, బేరముచేసితినే గాని, పుల్లలను మాత్రమే బేరమాడలేదని సమాధానము చెప్పెను. న్యాయాధిపతి నిజమేనా యని కట్టెలవాని నడుగగా, మంగలి కావిడి ఎంత

రచన :

యం. హెచ్. పి. కుటుంబం

యని బేరముచేసినమాట నిజమేననియు, అయినను కావిడి యనగా కావిటిలోని పుల్లలు మాత్రమే యనుకొంటిని, గాని కావిడిగూడా యని అనుకొనలేదని, జవాబిచ్చెను. న్యాయాధిపతి మంగలిదే న్యాయమని తీర్పుచెప్పెను. కట్టెలమ్మువాడు విచారించుచు, ఇంటికి పోయి, తనకు జరిగిన పరాభవమంతయు, తన మిత్రుడగు చాకలివాని కొకనికి చెప్పెను.

కొన్నిరోజులైనతరువాత చాకలివాడు మంచి విలువగల దుస్తులు ధరించి, తన గాడిదను వీధిలోనుంచి. మంగలి దుకాణములోనికి పోయెను. మంగలి యీతడెవరో ధనికుడని తలచి, మర్యాదచేయగా, చాకలి తనకును, తన స్నేహితునకును, క్షవరము చేయుటకు ఎంతడబ్బు పుచ్చుకొందువని యడిగెను. మంగలి రెండురూపాయలని జవాబిచ్చెను. సరేనని చాకలి క్షవరము చేయించుకొనెను. మీ స్నేహితుని



పిల్చుకురమ్మని మంగలి కోరగా, వెంటనే, వీధిలో నుంచిన గాడిదను తీసుకవచ్చి, యితడే నా స్నేహితుడని చెప్పి, గాడిదకు క్షవరము చేయమని కోరెను. అందుకు మంగలి కోపించి దెబ్బలతోను, తిట్లతోను, చాకలిని దుకాణమునుంచి గెంటివైచెను.

చాకలి వెంటనే న్యాయస్థానమునకు పోయి, మంగలిపై ఫిర్యాదుచేసెను. న్యాయాధిపతి

బాలగేయం :

"తల్లిప్రేమ"

శ్రీ రావికొండలరావు

ఒకప్పు డోరాజ్యాన్ని పాలించేవా డోరాజు-
ఏం అన్యాయం చేసేడో ఎవరికి తెలుసు?-
రాజ్యంలో మశూచికం-
నిరంకుశంగా తాండవించింది!

పిన్నల్ని, పెద్దల్ని, ముగాళ్ని, ఆడాళ్ని,
పశువుల్ని, శిశువుల్ని-
ఒక్కలా పొట్టపెట్టుకుంటూంది!
డాక్టర్లు మందు లిచ్చినా -
దేవుళ్ళకి పసందు లిచ్చినా- తగ్గలేదు!

ప్రజలంతా గోలపెడుతూ- ఛర్రున గుళ్లో దూరేరు-
అమ్మవారి విగ్రహం నిశ్చింతగా వుంది!
"అనుగ్రహించవో విగ్రహమా!" అన్నారు!
టక్కున పూజా రొచ్చాడు- ఏదో ఆలోచించేడు-
"రాజుకి ప్రియమయిన వ్యక్తిని-
తల్లికి బలి ఇస్తే- వ్యాధిళ్లే
మాయ మవుతుం"దన్నాడు-

రాజు నడిగితే 'నా ముద్దుబిడ్డే నాకు ప్రియం' అన్నాడు
కలకలలాడే పసిబిడ్డని- రివ్వునీ ఎత్తుకుపోయారు-
బిడ్డవెంట రాణీ- రాణివెంట రాజూ
రోదిస్తూ ఖేదిస్తూనే పోయారు!
బలిపూజ లయినాయి- బిడ్డను దైవంముందు పెట్టేరు!
'అమ్మవారికి జై' అని పూజా రెత్తేడు కత్తిని-
"నన్నూ-నా బిడ్డ నొద్దు' అంటూ తల్లిప్రాణం దూకింది!
రాణీ ను వ్వొద్దు- నువ్వంటే ఈ బిడ్డ పోతే మరోబిడ్డ-
ను వ్వొద్దు రాణీ!" అంటూ రాజూ వొచ్చేడు!
పూజారివెంటనే పోల్చేడు- రాజుకి ప్రియమయిన వ్యక్తి
రాణియే నన్నారూ-దైవంఎదుట రాణినే బలి ఇచ్చారు!
"తన ప్రాణం పోయినా బిడ్డప్రాణం వుంచింది"
మాతృప్రేమ- ఒహో" లన్నారు!
"తన ప్రియవ్యక్తిని తను చెప్పకపోయినా
దైవం చెప్పిం" దంటూ-
ప్రజలంతా ఘోసించేరు!!

['టెనిసన్' ఆధారంగా]

మంగలిని రప్పించి, సంగతి ఏమని ప్రశ్నింపగా, చాకలి తనకును, తన స్నేహితునకును, క్షవరము చేయమని, చెప్పినమాట నిజమే నని మంగలి ఒప్పుకొనెను, కాని స్నేహితుడు అనిన, మనషి యనుకొంటెనిగాని, గాడిద యని అనుకొనలేదని చెప్పెను.

ఇదివరలో, కట్టెలమ్మువానిని మంగలి, ఎట్లు మోసగించెనో న్యాయాధిపతికి జ్ఞాపక ముండెను. అందుచేత చాకలిస్నేహితునకు క్షవరము చేయుటకు, ఒప్పుకొనినావని నీవే అంటివి, కాని, చాకలిమనుష్య స్నేహితునకుమాత్రమే చేసెద నని ఒప్పుకొనలేదు. చాకలివానికి, వానిగాడిదకంటె దగ్గర స్నేహితుడు ఎవరుండును? అందుచేత నీవు తప్పక గాడిదకు క్షవరము చేయవలె నని ఆజ్ఞాపించెను.

ప్రఖ్యాతిచెందిన మంగలి గాడిదకు క్షవరము చేయుచున్నాడని, ప్రజలందరు గుమిగూడిరి. వారందరును చూచుటకు వీలుగా, న్యాయాధిపతి గాడిదను నడివీధిలో క్షవరము చేయవలె నని ఆజ్ఞాపించిరి. మంగలి తాను కట్టెలువానికి చేసిన, మోసమునకు తగినశిక్ష అయినది గదా! యని దుఃఖించుచు క్షవరము చేసెను. చాకలి నా కెట్లు సబ్బు రాచి క్షవరము చేసితివో, నా స్నేహితునకుగూడా అట్లే చేయవలె నని పట్టుబట్టెను. దానిచూచు ప్రజలందరు కడుపుబ్బ నవ్వసాగిరి.

ఆ మంగలిప్రఖ్యాతి యంతయు పోయినది. గాడిదమంగలి యని ఆ వూరివారందరును అతని పిలువసాగిరి.

"పరులను చెరప జూచువాడు తాను చెడిపోవును"

(అరేబియన్ నైట్సుకు అనుకరణ.)

బాలానందం:

"ధైర్యశాలి"

(ఒక గ్రీకు కథ ననుసరించి)

"శ్రీ పతి"

పూర్వకాలంలో "కోరింత్" అనబడు "ఈఫిరీ" నగరము నొకప్పుడు "గ్లాకస్" అను రాజేలుచుండెను. అతనికి "బెలరోఫన్" అను చక్కని కుమారుడు కలడు. "బెలరోఫన్" చిన్నతనంలో దురదృష్టవశమున తన సోదరుని బ్రమాదవశమున మృత్యువు నాపాదించెను. అంతుచేత "గ్లాకస్" రాజాతనిని తన సామంత రాజగు "ప్రోయ్‌టస్" వద్దకు పంపివైచెను. "బెలరోఫన్"ను "ప్రోయ్‌టస్" మిగుల గౌరవించెను. తన కొడుకువలె చూచుకొనుచుండెను. సుగుణరాశి యగు "బెలరోఫన్" ప్రోయ్‌టస్‌ను తండ్రిగా తలంచి అత్యంతభక్తివినయములతో మెలగుచుండెను.

"ప్రోయ్‌టస్" మిగుల వృద్ధుడు. "ఏస్టియా" అను చక్కని భార్య కలదు. అమె తన యందమునకు తానే గర్వపడుచుండును. "బెలరోఫన్" సౌందర్యము ఆ "ఏస్టియా" రాణి నాకర్షించెను. కాని "బెలరోఫన్" యెప్పుడును, ఆమెను తల్లివలె భావించి మెలగుచుండెడివాడు. ముసలిభర్త యనిన ఆరాణికి కొంచెమైనను గౌరవము లేదు. ఆమెకు సిగ్గు అనిన, ఏమియో కూడ తెలియదు. ఆమె తన కోర్కెను "బెలరోఫన్" కు స్పష్టపరచెను. పాపం' బెలరోఫన్ ఇటువంటిది జరుగునని కలలోనైన తలచలేదు. ఆమె తనకు పెంపుడు తల్లి. ఎంత ద్రోహము. "ప్రొయ్‌టస్" రాజు తనను కన్నకుమారునివలె చూచుకొనుచున్నాడు. ఆ రాజుకి అంత ద్రోహము చేయుటకు అతనిమనసొప్పలేదు. వినయముతో చేతులు జోడించి ఏస్టియారాణి ముందు మోకరిల్లి "ఓతల్లీ! నన్ను కన్న కుమారునివలె జూచి కాపాడిన నీవే యిట్టిపనికి సాహసించెదవా? ఈ విపరీతకార్యము మాను" మని యెంతో బ్రతిమిలాడెను. కాని ఏస్టియా రాణికి కోప మధిక మయ్యెను. "ఓరీ! పిరికిపందా! నా కోర్కెను తీర్చవుగా? అయితే కాచుకో. ఈ "ఆర్గాస్" నగరంలో నీవెంత కాల మిట్లుండగలవో మూస్తానుగా" అని యింకను ఎన్నియో తిట్టి వెడలిపోయెను.

ఆమె తిన్నగా రాజువద్ద కేగి 'బెలరోఫన్' తనను తల్లి యనియైనను తలచక మిగుల యవమానించె నని కొండెములు చెప్పి రాజును నమ్మించెను. చెప్పుడు మాటలు విననివారెవరు. "ప్రొయ్‌టస్" 'బెలరోఫన్' ఇట్టి పనిని చేయునా? పరసతులను తల్లులవలె భావించెడి యీ సుగుణశీలి యిట్టి పని చేయుట కెట్లు తలంచెనో? ఇంతకాలము పెంచి పెద్దచేసిన వానిని మాతృద్రోహనేర మారోపించి చంపుటకు నా మనస్సెంతమాత్ర మొప్పదు. ఇది గాక 'బెలరోఫన్' తండ్రి 'గ్లాకస్' మిగుల బలవంతుడు. నే నతనికుమారుని చంపితి ననువార్త వినినయంతనే ఆతడు నన్ను బ్రతుకనిచ్చునా" యని పరిపరివిధముల తలంచుచుండెను.

ఇంతలో "బెలరోఫన్" కూడ వచ్చెను. "ప్రోయ్‌టస్" మిగుల యాదరముతో "నాయనా! నీవు దేశయాత్రలు చేయుట కనుజ్ఞయిమ్మని ఎన్నినాళ్ళనుండియో నన్నడుగుచుంటివి. మనధనాగారమున కావలసినంత ధనము తీసుకొని నీ యిష్టప్రకారము దేశయాత్రలు గావించి రమ్మ" అనెను.

బెలరోఫన్ మిగులసంతసముతో "లంతకంటేనా? తండ్రికి దూరమైన నన్ను తండ్రివలె ప్రేమించి ఇంతవానిగా చేసిన మీ యాజ్ఞ జవదాటుదునా?" యనెను.

ఆ కాలమున "లీషియాదేశమును "ఇయాబిటిస్" రాజేలుచుండెను. ఆతడు "ప్రొయ్‌టస్" కు మేనమామ, అందుచేత 'ప్రోయ్‌టస్' లీషియారాజున కొక యుత్తరము వ్రాసి బెలరోఫన్ చేతి కిచ్చి పంపెను.

బెలరోఫన్ త్వరితకాలములోనే లీషియాదేశము చేరి "ఇయాబిటిస్" రాజును కలిసికొనెను. 'ఇయాబిటిస్' 'బెలరోఫన్' నెంతయో గౌర

వించెను. పెద్ద విందు చేసెను. అన్నియు అయినవెనుక 'బెలరోఫన్' తనవద్ద నున్న జాబు నా రాజున కందించెను. 'ఇయాబిటిస్' జాబు చించి అందు వ్రాసియున్న విషయముల కాత డచ్చెరువందెను. 'ఈ బెలరోఫన్ మిగుల తప్పొనరించుటచే యీతనినెట్లయిన జంపింప గోరి మీ యొద్దకు బంపితిని' యని ఆ జాబుయందు వ్రాసి యుండెను. ఇయాబిటిస్ తన మేనల్లుని కోర్కె నెట్లయినను నెరవేర్చవలె నని తలంచెను.

ఆ కాలమున 'లీషియా' దేశపు ప్రజలు 'ఛామిరా' యను బ్రహ్మ రాక్షసివలన బాధపడుచుండిరి. ఆ రాక్షసిరూపము మిగుల వింత యైనది. దానితల సింహపుతల. గొఱ్ఱె శరీరమువలె దాని శరీర మంతయు వెంట్రుకలతో నిండి యుండును. అది పాములవంటి కాళ్ళను గలిగి యుండి చూచువారికి భయము గొల్పుచుండును. దానినోటినుండియు, ముక్కురంధ్రముల నుండియు ఎల్లప్పుడును నిప్పులు వెలిగ్రక్కుచుండును. రాజా రాక్షసిని చంప 'బెలరోఫన్'ను నియమించెను. 'బెలరోఫన్' 'ఛామిరా'ను చంపుట కెంతయు తహతహలాడెను. చివర కాతడు రెండు సీసపు బల్లెములను, మొలలో ఖడ్గమును ధరించెను. తనకై సిద్ధపరచిన శకటము నెక్కి బయలుదేరెను. అంత చిన్న ఆయుధములతో 'ఛామిరా'ను చంపుటకు పోవుచున్న యీ గ్రీకుయోధుని సాహసమునకు ప్రజలెంతయు మెచ్చుకొనిరి. ఎందరినో గ్రీకుయోధులను పొట్టను బెట్టుకొన్న యీ బ్రహ్మరాక్షసి నీ చిన్నవాడు చంప గలుగునా యని సంశయించిరి. బెలరోఫన్ చిట్టచివరకు 'ఛామిరా' నివశించు ప్రదేశము చేరునప్పటికి రాత్రి యయ్యెను. అత డా రాక్షసి గుహను సమీపించి గుహద్వారమునకు ప్రక్కనున్న రాతిబండ చాటున దాగియుండెను. రాత్రి భాగమం దా రాక్షసి యా గుహ లోనే యుండును.

కొంతసేపటికి తెల్లవారుచుండెను. గుహాద్వారమునుండి వెలుతురా ఛామిరాపై పడెను. అంత నది మేల్కాంచి గుహనుండి బయటకు వచ్చెను. 'బెలరోఫన్' తరుణము కొరకు చూచుచుండెను. రాతిబండ ప్రక్క నాతడు బోరగిల్ల పండుకొని యా రాక్షసిని పరీక్షించుచుండెను.

అంత నా రాక్షసి శిలపై నెక్కి నాల్గు దిక్కుల చూచి నోరావులించి నిప్పులు గ్రక్కుచుండెను. రాజకుమారు డదియే మంచి యదనుకొని గుభాలున లేచి సీసపుబల్లెముల నా రాక్షసినోటిలో గ్రుచ్చి తక్షణమే దగ్గరగా నున్న కొండమీది కెక్కిపోయెను. 'ఛామిరా' యాతనిపై పడ దలచెను. కాని సాధ్యము కాలేదు. అప్పుడు 'ఛామిరా' మిగులకోపముతో తనతోకతో నచ్చట రాళ్ళ నన్నిటిని బండిగా చేసివైచెను. నోటినుండి అదేపనిగా నిప్పులు గ్రక్కెను. అది నిప్పులు గ్రక్కుకొలది నోటిలో గ్రుచ్చబడిన సీసపుబల్లెములు కరంగి దాని కడుపులో ప్రవేశించుటచే ఆ రాక్షసి మిగులబాధతో అర్చుచు కొంత సేపటికి క్రింద పడిపోయెను. తక్షణమే 'బెలరోఫన్' కొండ దిగి రాక్షసిని సమీపించి మొలలోని బాకుచేత దానిని ముక్కలుగ ఖండించివైచెను.



వెంటనే యాత డా రాక్షసి మృతకళేబరము నొక బండిపై వైచుకొని 'లీషియా'కు బయలుదేరెను. లీషియారాజును, ప్రజలును ఆ రాజకుమారుడు కావించిన ఘనకార్యమునకు వేనోళ్ళ పొగడిరి. లీషియారాజు బెలరోఫన్ యొక్క సాహసమునకు అతనిని స్తోత్రము చేసి తన కుమార్తెనొసగి

కూపర్ కళాశాల
ఉచితసాంకేతికవిద్యాప్రదానసంస్థ

(గతసంచిక తరువాయి)

BS

3

కూపర్ సంస్థలో ప్రవేశానికి సాంఘిక విపక్షతలు ఏవీ అభ్యంతరాలు కావని వివరించాము. కానీ అన్నిటికన్న ముఖ్యమైన గీటురాయి ఒకటి ఉంది. ఇక్కడ విద్యార్థిని చేర్చుకోటానికి, "విద్యార్థికి ఆ విద్యలో ఉన్న సహజఉత్సాహ మెంత?" అనేది గీటురాయి. ఈ పరీక్షమాత్రము మహా నిష్కర్షగా జరుగుతుంది ప్రతివేసగిలోనూ కళాశాలలో విద్యార్థులను చేర్చుకోటానికి ప్రవేశపరీక్షలు జరుగుతాయి. కళాశాలలో మూడేళ్ల చదువు ఒకటి, నాలుగేళ్ల చదువు ఒకటి, ఆరేళ్ల చదువు ఒకటి, మూడు తరహాలుగా ఇంజనీరింగ్, చిత్రలేఖనాది వివిధ విషయాలలో ఆయా ప్రత్యేకపట్టాలకోసం విద్యాబోధన జరుగుతుంది. ఈ ప్రవేశపరీక్షలో నూటికి అరుగురు, ఏడుగురు మాత్రమే పరీక్ష నెగ్గి ప్రవేశం అందుకోగలుతారు. 1946 లో ఇంజనీరింగ్ శాఖలో చేరటానికి 1966 గురు దరఖాస్తులు పెట్టుకొన్నారు. 111 గురు మాత్రం ప్రవేశపరీక్షలో నెగ్గి కాలేజీలో ప్రవేశించగల్గారు. లలితకళల శాఖలోనూ అంతే 1464 మంది దరఖాస్తులు పెట్టుకోగా 90 మంది విజయులై ప్రవేశం తెచ్చుకొన్నారు. వ్రాత పరీక్షకూడా, ప్రవేశానికి మొదటిమెట్టుమాత్రమే. వ్రాత పరీక్ష అయాక, విద్యార్థియొక్క సాధారణ విజ్ఞానాన్ని, తెలివితేటల అంతరాన్ని, మనఃపరిపక్వతను, అతని అభిరుచులను, అతనితో పరిచయంలో నిగ్గు తీర్చి తెలుసుకొంటారు. అతను లలితకళలు, ఇంజనీరింగ్ అభ్యసించటంకన్నా ఏ వ్యాపారాల్లోనైనా ప్రవేశిస్తే, ఇంతకన్నా అతని తత్వాన్ని బట్టి అతనికి క్షేమకరమౌతుందేమో అని ముందువెనుకలన్నీ ఆలోచించి, విద్యార్థి విద్యలో ప్రవేశిస్తే స్వతహాగా అభివృద్ధిలోకి రాగలడని నమ్మకం చిక్కితేనే ఆ విద్యలో విద్యార్థిగా చేర్చుకొంటారు. ఏ ఇతరవిధమైన పక్షపాతాలూ కూడా విద్యార్థుల ప్రవేశపరీక్షలలో ప్రవేశం కల్పించుకోవు.

ఇంజనీరింగ్ విద్యార్థులను ప్రశ్నించే విధానాలిలా ఉంటాయి. "పెద్ద కర్మాగారములో, నీ భుజశక్తి ఉపయోగించి పని చేయటం నీకు సరదాగా ఉంటుందా? లెక్కలంటే ఇష్టమా? తలనెప్పి వస్తుందా? వృత్తివిద్య పుస్తకాలనుంచికన్నా స్వయంగా నేర్చుకోవాలని ఉంటుందా?" ఔనని విద్యార్థి చెపితే, ఈ సంస్థలో కాదు స్వయంగా కర్మాగారాల్లో పని నేర్చుకోపొమ్మంటారు. పూర్వపు చదువును మాత్రమే జీర్ణం చేసుకోగలిగి ఎవరో వేసి యిచ్చిన ప్లానుప్రకారం, యాంత్రిక కాలం తెలివి చూపించగలవారికి, ఈ కళాశాలలో కాక, తక్కిన మామూలు ప్రభుత్వ కళాశాలలోనే ప్రవేశం తెప్పించచూస్తారు. సృజనాశక్తికూడా విద్యార్థిలో కనబడి, స్వతహాగాకూడా ఆలోచించగల శక్తి విద్యార్థిలో సూచితమైనప్పుడే ఈ కళాశాలలో ప్రవేశం దొరుకుతుంది. తను తెలిసికొన్నది ఇతరులకు చెప్పగల ప్రజ్ఞ, గణిత, భౌతిక, రసాయనికశాస్త్రాదులలోకూడా అభిరుచీ ఇన్నీ కూడా విద్యార్థిలో ఉన్నాయా లేవో కూడా చూస్తారు.

చిత్రలేఖనశాఖలో ప్రవేశం కోరే విద్యార్థికి తెల్ల కాగితం ఇచ్చి, "షేడింగులు లేకుండా కేవలం గీతలలో, ఒక జంతువు బొమ్మో, లేక మరే మామూలువస్తువు బొమ్మో," గీయ మంటారు. లేదా పరీక్షపత్రంలోనే కొన్ని గీతలు ఇచ్చి, "ఈ గీతలకు మరికొన్ని గీతలు కలిపితే, ఒక యిల్లు బొమ్మ వస్తుంది. నీ యిష్టంవచ్చిన గీతలు కలిపి, ఈ గీతలతో, మరో నాలుగురకాల రూపాలను సృష్టించ"మంటారు. లేదా కాగితంమీద ఒక చెట్టు బొమ్మ గీసి, "ఈ చెట్టును ముట్టుకోకుండా, ప్రక్కనే మరో బొమ్మ గీసి చెట్టు చిన్నదిగా అగుపడేట్టు చెయ్య మంటారు" విద్యార్థియొక్క సహజసామర్థ్యాలు వెలువడుతాయి.

శిల్పకళ అభ్యసించవచ్చినవారు మట్టితో బొమ్మలు తయారుచేయవలసిన పరీక్ష ఉంటుంది. ఈ పరీక్ష లన్నీ కేవలం, విద్యార్థి మునుపేం నేర్చుకొన్నాడో తెలుసుకొనేందుకు ఎంతమాత్రమూ ఉద్దేశించబడినవి కావు. సహజంగా విద్యార్థిసామర్థ్యమెంతో పరీక్షచేయుటానికే ఉద్దేశించబడ్డాయి.

పగలు.వృత్తులలో ఉంటూ, రాత్రుల్లు చదువుకోదలచిన యువతీయువకులకు కూడా శిక్షణతరగతు లున్నాయి. కాని వాట్లల్లో ప్రవేశం మరికొంత ఉదారంగా ఉంటుంది. కాలేజీనైటుస్కూలులో చేరేందుకు విద్యార్థి హైస్కూలు సర్టిఫికేట్లు లేవీ తెచ్చుకో నక్కరలేదు. అయితే పగటివిద్యార్థులకు నాలుగేళ్లలో పూర్తిఅయే ఇంజనీరింగ్ చదువు రాత్రివిద్యార్థికి ఆరేళ్లచదువుగాను, మూడేళ్ళల్లో పూర్తిఅయే చిత్రలేఖనం చదువు, నాల్గేళ్లచదువుగానూ మార్చు చేయబడుతుంది. రాత్రివిద్యార్థులకు, తాము నేర్చుకొంటూన్న విద్యకు సంబంధకములైన వృత్తులలోనే పగటిఉద్యోగాలుకూడా దొరికేందుకు, కళాశాల అధికారులే ప్రయత్నిస్తారు. ఆ యా కర్మాగారఅధికారులు

మహావైభవముగ వివాహము గావించెను. మరియు తనరాజ్యమునం దర్థభాగమాతని కొసగెను. 'ప్రోయిటస్' కుకొన్నాళ్ళకు నిజము తెలిసెను. తన పెంపుడుకుమారునకు తా నొనరించిన యపరాధమున కెంతయు జింతించెను.

కూడా, కేవలం యూనివర్సిటీనుంచి వచ్చిన ప్రాక్టికల్ అనుభవంలేని గ్రాడ్యుయేట్లను తమ ఉద్యోగాల్లో చేర్చుకోడంకంటే విద్యతోపాటు ప్రత్యక్ష అనుభవం కూడా కల్పించుకొన్న ఈ రాత్రివిద్యార్థులని కార్మికఉద్యోగాల్లో తీసుకోనేందుకు ఉత్సాహపడతారు.

తక్కిన అమెరికన్ యూనివర్సిటీచదువులలోవలె ఈ కళాశాలలో, ఆటలకుక్లబ్బులకు అవకాశం ఉండదేమోనని అనిపిస్తుంది కాని యౌవనానికి సహజమైన ఆటలు పాటలూ, ఉన్న కాస్తకాలంలోనే విద్యార్థులు కల్పించుకోగలరు. ఈ కళాశాలావిద్యార్థులలోనూ మంచిఆటలజట్టులు, క్లబ్బులు, విద్యార్థిసంఘాలు, అవే, మంచి అభివృద్ధిలో ఉన్నవే ఉన్నాయి.

౪

కూపర్ కళాశాలభవన నిర్మాణం అంతా పీటర్ కూపరే స్వయంగా ఊహించాడు. 1860 నాటికి ఇంత అధునాతనమైన భవనం లేదు. అందులో ఇనుపదూలాలన్నీ పీటర్ కూపర్ స్వంతకర్మాగారాలలోనే తయారయాయి. ఈ భవన నిర్మాణం కథ ఒకటి ఉంది. ఈ ఇనుపదూలాలన్నీ నిర్మాణానికి ముందుస్థలంలో చేర్చాడు కూపర్. అప్పుడు యూనియన్ స్క్వేర్‌లో ఉన్న హార్పర్ బ్రదర్స్, అను ప్రచురణకర్తల భవనం నిప్పంటుకొని పూర్తిగా తగలడిపోయింది. వాళ్లు వీధిలో నిలవవలసి వచ్చింది. పీటరు, తన ఇనుపదూలాలను వాళ్లకుఇచ్చి, వెంటనే భవనం కట్టుకోమన్నాడు. హార్పర్ కంపెనీవారు ఆ దూలాలకోసం తర్వాత ఇచ్చిన ధనంతో అనుకొన్నదానికన్నా కూడా శ్రేష్ఠమయిన భవనం, కొత్త ఇంజనీరింగ్ పద్ధతులలో నిర్మించగలిగాడు. కాని ఈ భవనం సంస్థలో సగభాగమే.

1940లో ఈ స్థలానికి 45 మైళ్ల దూరంలో ఉన్న న్యూజెర్సీకొండల్లో వెయ్యి ఎకరాల మేర ఖనిజసంపత్కరమైన భూమిని కళాశాలకు సమకూర్చుకోగలిగారు. కూపర్ అల్లుడు హ్యూయిట్ ఈ స్థలం ముందు కొన్నాడు ఇక్కడ ఖనిజాలు తవ్వి తీసి ఉక్కుదూలాలు తయారుచేసేందుకు కొత్తవిధానం కనిపెట్టి కొత్తకర్మాగారాలు నిర్మించాడు. అవన్నీ, కూపర్ యూనియన్‌విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణకేంద్రంగా ఉండేందుకు, ఈ భూమిని, కర్మాగారాలను అన్నిటినీ కూపర్ యూనియన్‌కిచ్చేశాడు.

ఇప్పటి డైరెక్టరుఅయిన బర్డెల్, ఇంత స్థలం ఉన్నందుకు ఇతరత్రా కూడా ప్రయోజనాలు కల్పించాడు. ఇక్కడ విద్యార్థులకు ప్రకృతివాతావరణంలో . ఆటవిడుపుగా మెలగి జ్ఞానం అభ్యసించగలందుకు, ఆరామస్థలాలు, ఆటలస్థలాలూ కల్పించాడు. ప్రతి విద్యార్థీ, ఎక్కువకాలం ఇక్కడ గడపటం శిక్షణలో నిర్బంధవిధానం చేశాడు. చిత్రకారులకు ఈప్రకృతిమధ్యంలో, ప్రకృతిచిత్రణ నేర్చుకొనేందుకు అనంతమైన అవకాశం ఉంది. ప్రతికొత్త విద్యార్థి ముందు నాలుగునాళ్లపాటు ఇక్కడ గడపటంతో, విద్యాశిక్షణలోని తీవ్రతను మర్చిపోయి సహజంగా వికాసం పొందే స్థితిలోకి వస్తాడు.

౫

కూపర్ సంస్థ, ఏ చిక్కులూ లేకుండా తనంత తనే వృద్ధిపొందుతూ వచ్చిందనుకోకూడదు. మొదటి ఉధృతం గడిచేటప్పటికి, ఇక్కడి చదువుకూడా రోకంటిపాటగా తయారయ్యే ప్రమాదం కల్గింది. విద్యార్థులు కేవలం శాస్త్రాలు, ఫార్ములాలుబట్టీలుపట్టూ, స్లైడ్‌రూల్సు పెట్టుకొని రాత్రింబగళ్లు సతమతమౌతూ, ప్రకృతినీ పరిసరాలను మర్చిపోయి భట్టీయజ్ఞానం స్థితిలో పడుతూ వచ్చారు. 1935 లో 'డన్' అనే ఆయన బోర్డుఅధ్యక్షుడయ్యాడు. విద్యార్థులను కృతకంగా కేవలం ఆ ఒక్కశాస్త్రం తప్ప లోకజ్ఞానం లేని వాళ్లనుగా తయారు చేస్తున్నామని గ్రహించాడు. 1938 లో బర్డెల్‌ను కళాశాలకు పెద్దను చేశాడు. ఆయన వేదాంతం, సాహిత్యం, మొదలైనవి కూడా బోధనలో భాగాలు చేశాడు.

కాని విద్యార్థులు ఎదురుతిరిగారు. జీవితంలో ఒక్కక్షణమైనా వ్యయంచేసుకోకుండా, స్వయం కృషివల్ల, తమ వృత్తులలో ప్రజ్ఞ గడింప దలచుకొన్నవారు, మిట్ట వేదాంతాలతోనూ, భావకవిత్వా తోనూ కాలం వృథపుచ్చలేమని మొరాయించారు.


కాని బర్డెల్ అంతకన్నా మొండి. "మీ యిష్టం, చదివితే చదవండి, మాని తే మానండి, కాని అవి రానివాళ్లకు నేను యింజనీరింగ్ పట్టం ఇచ్చేది లేదు" అన్నాడు

ఒక ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థికి అందరికన్నా కోపంవచ్చింది. నిజంగా అందరికన్నా చాలా తెలివైనవాడు అతను. సరాసరి డైరక్టరు గదిలోకి వెళ్ళాడు. (డైరెక్టరును కలిసికొనేందుకూ ఏవిద్యార్థికీ, ఏ కాలంలోనూ ఎట్టి నిరోధమూ లేదు) డైరెక్టరుముందు బల్లగుద్ది గట్టిగా వాదించాడు డైరెక్టరు బర్డెలు శాంతంగా చిరునవ్వుతోనే తానూ మొరాయించాడు. నాలుగేళ్ళల్లో ఇంజనీరింగ్ పట్టం పుచ్చుకొన్నాక ఆ విద్యార్థి, వార్షికోత్సవదిన ఉపన్యాసంలో, ప్లేటో, థామస్ మూర్ ల, సంఘనిర్మాణప్రణాళికలు, ఇంజనీర్లు యంత్రాలు తయారుచేసేందుకు ముందువేసే బ్లూప్రింట్లతో పోల్చి చెప్పాడు. కాగితం మీద, ఆదర్శనీయంగా కనబడ్డది, ప్రత్యక్షంగా తయారు చెయ్యవచ్చేటప్పటికి, ఎంత మార్పుతో తయారవుతాయో, ప్రత్యక్ష రూపం ఎల్లా ఉంటుందో, ఇంజనీరింగ్ లోనూ సాంఘికసమస్యలవిషయంలోనూ కూడా, పూర్తిగా అవగాహనఅయి సంఘంలో తన ధర్మమేదో తెలిసివచ్చిందన్నాడు.


ఇంకోసారి, అడ్వర్టైజిమెంటులకు డ్రాయింగ్ నేర్చుకోదలచిన విద్యార్థి, పూర్వవిద్యార్థుల చిత్రాలు చూస్తున్నాడు. ఒక అతివాస్తవికచిత్రం మరీ "అద్వైతం" గానూ, అయోమయంగానూ అర్థహీనంగానూ కనబడింది. "నేను వ్యాపారస్థులకు యదార్థచిత్రాలు గీసి డబ్బు సంపాయించగలగాలని వచ్చాను గాని, ఇల్లాంటి చెత్త గియ్యటానికి కాదని" కోపంతో అన్నాడు. "అబ్బాయీ! ఆ చిత్రం చాలాఏళ్ళ క్రిందే ఒక అమ్మాయి గీసింది. ఆ అమ్మాయికూడా నీలానే అడ్వర్టైజ్‌మెంటుఆర్టు నేర్చుకోటానికే వచ్చింది. ఇక్కడికివచ్చి ఈచిత్రం గీయగల్గింది. ఇప్పుడు ఒక అడ్వర్టైజ్‌మెంటుఏజన్సీవారు ఆమెకు సాలుకు

(35-వ పేజీ చూడుడు)

★ కాంచీపుర పల్లవశిల్పాలు ★



వీరవిహారమూర్తి - కైలాసనాథుడు




కైలాసనాథ దేవాలయ గాలిగోపురము

కాంచీపురం

(కైలాసనాథ దేవాలయంలోని నృత్యభంగిమములు మరి

ఈ దేవాలయ శిల్పాలలో కొన్ని



సింహకుడ్యాలు



ప్రళయ

ల్లవ శిల్పాలు

కైలాసేశ్వర దేవతా విగ్రహాలలో అవతారవిశేషాలు)


గతవారం ప్రకటించాము.



డవము



నృసింహ [illegible]



కాళింగమర్దన



కైలాసనాథుడు

“మా రోజుల్లో–...”

‘ఎస్సార్’

★

రోజుల్తోపాటే అన్నీ మారిపోతున్నాయి.

అదేమిటో మరి. మేడలమెట్లు మరీ నిటారుగా కట్టిస్తున్నారీ రోజుల్లో. ఇదివరలో చాలా వీలుగా ఉండేవి. రెండేసి మెట్లు ఒక్కొక్క అంగలో ఎక్కేసేవాణ్ణి. ఇప్పుడలా వీల్లేకుండా ఉంది. పత్రికలు చూస్తున్నాను. రోజురోజుకీ చిన్న చిన్న అక్షరాలు అచ్చువేస్తున్నారు. పత్రికలు కంటికి దూర మౌతున్నాయి. మెల్లకన్ను పెట్టి చదవ్వలసి వస్తోంది. ఈ మధ్య పంచాంగం చూడవలసి వచ్చింది. చేతులు చాచి పట్టు వీని మూచేసరికి చేతులు నొప్పిపుట్టాయి. కళ్ళ పొదుపులు బంగారం గాను అంత చిన్న అక్షరాలేమిటి మరీనూ నాకు చత్వారం రాలేదు. నా యీడుకి సులోచనా లవసరం అంటే ఎవరైనా నవ్విపోతారు.

ఈ బాధెందుకని ఎవరైనా చదవమంటాను. కాని ఈ రోజుల్లో అందరికీ నాజూకు ఎక్కువయింది. మెల్లిగా సన్నని గొంతుతో చదువుతారు సరిగా వినిపించదు.

అన్నీ మారిపోతున్నాయి. ఇంటిదగ్గర్నుంచి దుకాణానికి దూరం ఎక్కువౌతోంది రైల్వేస్టేషన్‌కి దూరం రెట్టింపైనట్లుంది అంతే కాదు. ఇదివర కిప్పుడూ నేను చూడనే లేదు. ఏదో ఒక కొండకూడా అక్కడ అడ్డున్నట్లు కనిపిస్తుంది. రోడ్డు పాడయింది. పొడుగునా గోతులు గతుకులు ఉన్నాయిప్పుడు. అక్కడక్కడ జారుడుగా కూడా ఉంది రైళ్లు మరీ పెందలాడే వచ్చిపోతున్నాయి పరుగెత్తినా ప్రయోజనంలేదని ఊరుకుంటున్నాను. ఎందువల్లనంటే పరుగుప్రారంభించిన క్షణం చూసి రైలు ముందే పారిపోతుంది.

ఈమధ్య సరుకుల నాణ్యంకూడా తరిగిపోయింది. వర్తకులమోసం చెప్పడానికి అలవికాదు దర్జీలమాట చెప్పనే అక్కర్లేదు కుట్టించుకున్న కొద్దిరోజుల్లోనే చొక్కాలు కోట్లు పొట్టివై బిగువౌతున్నాయి. నడుముదగ్గర ఇట్టే బిగుతౌతున్నాయి. ఇదివరలో రెండుగజాల గుడ్డ చొక్కాకి చాలగా ఎక్కువుండేది. ఇప్పుడు మూడున్నరగజాలకూడా చాలదంటారు. కాలిబూట్లతాళ్లు ముడివేద్దామంటే ముందుకి వంగడం కష్టమైపోతోంది

అసలు గాలిలోనే ఉందిలెండి మార్పు. చాలా వుంది. కాలమహత్యం గడిచిన శీతాకాలం మరీ గడ్డైపోయింది అదివరలో ఇంతచలి నే నెన్నడూ అనుభవించలేదు. ఇంక వేసవిమాట చెప్పనే అక్కర్లేదు. ఈ యేడు ఇంకా వేసవి రానేలేదు. ఇప్పుడే నిప్పులు చెరిగేస్తోంది. కొంపలతీరు కూడా తగ్గట్టుగానే ఉంది. నెత్తిమీద కూడా సిమెంటు, కాంక్రీటు ఏమిటి? ఎండలు ముదిరినకొద్దీ ఇంట్లోఉంటే ఉక్కబోసి ఊరగాయ కావడం. విసనకర్ర తీసి విసురుకోలేక చేతులు పడిపోవడం సాయంకాలం అయిదుగంటలైనా వీధిలోకి అడుగెట్టడానికి శక్యం గాదు. గాడ్పులు ఈ చెవినుంచి దూసి ఆ చెవికి కొడుతున్నాయి. కిటికీలు మూసివేస్తే ఉక్క, తెరిచిఉంచితే గాడుపుగాలి.

శరీరసత్తువలో కూడా మార్పే కనిపిస్తుంది. నా చిన్నతనంలో నేను పంచికట్టి లాల్చీ తొడిగి కండువా వేసుకుని తిరిగేవాణ్ణి. ఆ యీడులో ఉన్నవాళ్లే ఇప్పుడు లాగులూ చొక్కాలూ తొడిగి తిరుగుతున్నారు. ఆ యీడుకి మాకంటె కుర్రవాళ్లులా కనపడుతున్నారు

నే చదివిన కాలేజీలో ఏదో ఉత్సవం చేస్తున్నారని ఈ మధ్య నొకసారి వెళ్లాను. అక్కడ చూస్తును గదా బి. యే. చదువుతున్నవాళ్లు మరీ పచ్చికుర్రాళ్లు. మేం బి. య్యే చదివేరోజుల్లో మా క్లాసులోవాళ్లందరూ బిడ్డలతండ్రులే ఇప్పుడు పెళ్లైనవాడే అపురూపం. పెళ్లైనవాడిని క్లాసులో చూస్తే ఈ రోజుల్లో హేళనట. కాకపోయినా మరీ అంత బొడ్డూడని కుంకల్ని (వాళ్లు ఎంత పొట్టిపచ్చిమిరపకాయలైనా) కాలేజీవాళ్లు చేర్చుకోడం వింతగా ఉంది. మరొకటుంది ఇప్పుడు చదువుకునే కుర్రాళ్లకి వ్యాపకా లెక్కువైనాయి మా రోజుల్లోనూ ఫుట్‌బాల్ హాకీ టెన్నిస్ ఆడేవాళ్లం. టూర్నమెంట్స్‌కి వెళ్ళేవాళ్ళం కాని ఇప్పటివాళ్ళ వ్యాపకాలు వేరు. టీచర్స్‌తో తగువులు, రాజకీయాలూ అధికం.

అయితే ఒక్క సుగుణం. నన్ను మర్యాదగానే ఆదరించారు పాపం కన్ను ఆట్టే కనిపించదు కాబోలు, ఇంటివరకూ చెయ్యిపట్టుకు తీసుకువస్తా, నన్నా డొకడు. నేనే అక్కర్లేదన్నాను.

నా యీడువాళ్ళలో చాలామందికి అకాలంలో వార్ధక్యం వచ్చింది. నిజానికి మాది మధ్యవయసు. అంటే పాతికేళ్లకీ నూరేళ్లకీ మధ్య అనుకోండి నాతో చదువుకున్నవాళ్లలో ఇప్పటికి తెలిసినంతవరకూ ఆరుగురు అప్పుడే గంగాయాత్ర చేశారు. మిగిలినవాళ్లలో అజఉన్నవాళ్లు నలుగురైదుగు రుంటారేమో. వాళ్ల పని నాకంటె అన్యాయంగా ఉంది. ఇద్దరు మంచం దిగడంలేదు. ఇద్దరికి కాళ్లుచేతులు ఆట్టే స్వాధీనం లేవు

మొన్న సాయంకాలం అల్లా కాలవగట్టుకి షికారు వెళ్లినప్పుడు వెంకట్రామయ్య కనిపించాడు. వాడూ నేనూ స్కూల్లోనూ

(36–వ పేజీ చూడుడు)


P-24

చిత్రసమీక్ష

షావుకారు

కథ, మాటలు - చక్రపాణి. నిర్వహణ - నాగిరెడ్డి, చక్రపాణి. డైరెక్షన్ - ప్రసాద్ - సంగీతం ఘంటసాల వెంకటేశ్వరరావు. పాటలు - సముద్రాల - స్టూడియో వాహిని.

తారాగణం: డా॥ సుబ్బారావు, శ్రీ వత్సవ, శివరాం, యన్. టి. రామారావు, యస్. వి. రంగారావు, వంగర, సుబ్బారావు, రేలంగి జానకి, కనకం, శాంతకుమారి మొదలైనవారు.



చెంగయ్య- శ్రీ గోవిందరాజుల సుబ్బారావు.

తెలుగుమాటలోని తియ్యదనం, తెలుగువారి పల్లెజీవనంలోని వెలుగునీడలు విజయావారి "షావుకారు" చిత్రంలో హృద్యంగా నిరూపితమైనాయి.

చిత్రం దాదాపు మూడుగంటల సేపు నడిచినా (15,900 అడుగులు) ప్రేక్షకులకి హాయిగా ఉంటుంది.

వెర్రిమొర్రి నాట్యాలు, కల్లబొల్లి కథలు, అతకని సన్నివేశాలు లేకుండా, వాస్తవ జీవనంలోని రసవత్తరఘట్టాల్నే తీసుకుని చిత్రాన్ని చాలమటుకు చిత్రించగలిగారని చెప్పవచ్చు. పల్లెజీవనంలోని వెలుగునీడల్ని, కష్టసుఖాల్ని చిత్రించి మన పల్లెజీవనం సారవంతమైనదే నని చూపారు.

ఈ చిత్రంలోని కథాంశం ఇరుగుపొరుగున నివసించే రెండు కుటుంబాలవారికి సంబంధించినది. చెంగయ్య షావుకారు (డా॥ సుబ్బారావు) పొరుగున స్నేహితుడు రామయ్య, (శ్రీవత్స) కూతురు సుబ్బులు (జానకి) అంటే చెంగయ్యకి ప్రాణం. చెంగయ్య తన తండ్రి కట్టించిన సత్రాన్ని ఒక కోమటికి అద్దెకిస్తాడు. కాని సత్రంలో తల దాచుకున్నవారిని వెళ్ళగొట్టడంలో కోమటి దుకాణం వీథిన పడి పోలీసులకు ఫిర్యాదు వెడుతుంది. సత్రంపైన అధికారం నిర్ణయించడంలో యదార్థవాది పోతుంది. రామయ్య సాక్ష్యంతో ఇరుగుపొరుగువారి మధ్య తగవులు చెలరేగుతాయి. మునుపు చెంగయ్యవద్ద రామయ్య చేసిన బదులు నుంచున్న పాటున పది హేనువందలూ చెల్లించమనడం, ముందు వసూలుకట్టిన వెయ్యి రూపాయిలూ జమకట్టక తిరిగి వసూలు చెయ్యడం, అలా చెల్లించినా పాడవని రామయ్య స్థితిని పాడు చెయ్యడంకోసం చెంగయ్యకి బంటైన రంగడు (రంగారావు) పొలంలో కుప్ప తగలబెట్టడానికి ప్రయత్నించడం, రామయ్య కొడుకు నారాయణ (శివరామ్) రంగణ్ణి కొట్టడం, దాంతో నారాయణపైన అబద్ధపుకేసు బనాయించడం జరుగుతాయి. పట్నంలో చదువుతున్న చెంగయ్య కొడుకు సత్యం (రామారావు) కూడా యాదృచ్ఛికంగా ఇల్లాగే బనాయించబడిన మరో కేసులోచిక్కి నారాయణతో సమానంగా అదే ఖైదులో చేరతాడు.

ఖైదులో పడి తండ్రి అన్యాయానికి ప్రతీకారంగా అప్పీలు చెయ్యడానికి కొడుకు నిరాకరించడంతో చెంగయ్యస్థితి మారి రంగణ్ని వొదిలించుకుంటాడు. రంగడు చెంగయ్యఇంట్లో దొంగతనం చెయ్యడానికి యత్నిస్తాడు. దొంగతనం గురించి ముందే చాకలిరామిసుబ్బుల్ని హెచ్చరించినందువల్ల రామయ్య, గ్రామస్థులు దొంగల్ని పట్టుకుంటారు. ఆపైన తిరిగీ ఇరుగుపొరుగుల మధ్య సఖ్యత ఏర్పడుతుంది. సుబ్బుల్ని సత్యానికిచ్చి పెళ్ళి చేస్తారు.

చాకలిరామిపాత్ర ధరించిన కనకం, రౌడీపాత్ర ధరించిన రంగారావు చిత్రంలో ఉత్తమంగా నటించారు. కొత్తగా తెరకెక్కిన జానకి కూడా ప్రతిభతో అభినయించింది. డా॥ గోవిందరాజుల సుబ్బారావు, శ్రీవత్సవ, శివరాం, శాంతకుమారి, యన్.టి. రామారావు మొదలైనవారు పాత్రల నర్థం చేసుకుని, తదనుగుణంగా అవసరమైన మోతాదులో అభినయించారు.

చిత్రంలో పాత్రపోషణ సంభాషణలు చక్కనిస్థాయిలో నడిచాయి. గ్రామీణుల జీవనాన్ని చక్కగా చిత్రించిన ఈ చిత్రం సాంఘికప్రయోజనం గలవానిలో ఒకటి అని చెప్పవచ్చును.

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౨౬-౧

శ్రీ రుద్రదేవమహారాజులు పట్టాభిషిక్తులై రెండునెల లైనది. మార్గశీర్షమాసమ్ము సగపడుచున్నది. ఆ మహారాజు యావ రాజ్యమునకు పట్టాభిషిక్తు డగునప్పటికి రాజ్యమంతయు నల్లకల్లోలముగా నున్నది గదా! కళింగసేనలు ఎంతవరకు వచ్చినవి? కొప్పెరుంజింగ డెవరు? జటావర్మసుందరపాండ్యు డెవరు? వారి సేన లెంతవరకు సాగినవి? చోళు లేమి చేయుచున్నారు? మనుమ గండగోపాలు డే మయ్యెను? గొంటూరు నాగదేవుని యలజడి ఎట్లున్నది? బల్లాలరాజ్యపాలకు లేమి చేయుచున్నారు? దేవగిరి యాదవ రాజ్యపరిస్థితు లేమి?

జన్నిగదేవుడును త్రిపురాంతకుడును ప్రతిజ్ఞలు చేసి వెడలిరి గదా! వారేమి చేసిరి? కొలని రుద్రుడు సేనలతో వెడలెను గదా! అత డేమి చేసెను?

ఆంధ్రభాష మాటాడువారి దేశము పవిత్రస్వరూపము నొకమారు స్మరింతము! పూర్వము శ్రీ రుద్రదేవులయు, తరువాత నాతని తమ్మునికుమారుడగు గణపతిదేవులయు, నేడు శ్రీ రుద్రదేవమహారాజులయు దృష్టి ఈ విశాలాంధ్రభూభాగముననే ప్రధానముగా ప్రసరించెను. వారు ఆంధ్రోర్వీశులు! వారలకు ఇతరుల భూభాగము లాక్రమింపవలె నను దురాశ లేదు. కాని యీ యంధ్రభూభాగము నితరు లేమాత్ర మాక్రమింప యత్నించినను దానిని వారు సైరింపకుండిరి.

ఈ తెలుగుభూమికి నడిబొడ్డు శ్రీశైలము! ఆ యమ్మ తూర్పుముఖముగా కూర్చుండి ఉదయభానునికై ఎల్లప్పుడు తన దీర్ఘబాహువులు రెండును చాచి యుంచును. ప్రాచీసముద్రతీరభూమి నంటియున్న యా కరినము లగు పర్వతశ్రేణులే యామె దీర్ఘబాహువులు. ఆమె దక్షిణబాహువు తిరుమల దాటి పాలారునదివరకు ప్రసరించును వామబాహువు సింహగిరి దాటి మహానది నొరయుచున్నది. ఆమె పృష్ఠభాగమున మంగళాసనమై కళ్యాణకటక మున్నది.

హొయిసలులును యాదవులును కాకతీయరాజ్యమున ప్రస్తుత మెట్టి యాక్రమణమును చేయలేదు. అందుచే కొంతవిశ్రాంతిగా రుద్రమ కూర్చుండగలిగినది.

ఇక దక్షిణదేశమున పరిస్థితు లిట్లున్నవి. చోళసింహాసనమును రాజరాజనరేంద్రుని కుమారు డగు రాజేంద్రదేవు డధిష్ఠించి కులోత్తుంగచోళచక్రవర్తినామము ధరించి ఆంధ్రచోళపాండ్యకేరళదేశములనే గాక సింహళము శ్రీవిషయము మలయము ఇత్యాదిదేశములను గూడ మహావైభవముతో పాలించియుండెను. కాని యా సమర్థత యతనితోడనే అంతరించెను. నేడు చోళసామ్రాజ్యసింహాసన మధిష్ఠించిన మూడవ రాజేంద్రచోళుడు అసమర్థుడు. అందుచే నాతని సామంతులు పలువురు స్వతంత్రులై యతనితోడను తమలో తామును బోరుచు వచ్చిరి. అట్టివారిలో కాకతీయరాజ్యముతోడను ఆంధ్రదేశముతోడను జోక్యము కలిగించుకొన్నవా రిద్దరు మాత్రమే. వారు జటావర్మ సుందరపాండ్యుడును, కొప్పెరుంజింగడును!

కొప్పెరుంజింగ డనునది ద్రావిడపదము. దానికి పెద్దరాజు సింగడు అని యర్థము చెప్పవచ్చును. అతని సంస్కృతశాసనములతో నదియే మహారాజసింహు డని రూపము పొందుచు వచ్చినది అతడు చేదిమండలము నేలుచుండిన కాడవవంశజు డగు పల్లవరాజు. ఇతని తండ్రిపేరు కూడ కొప్పెరుంజింగదేవుడే. ఆతనికాలముననే చోళసామ్రాజ్యము బలహీనము కాగా, నాతడు చోళరాజుపై నెదురుతిరిగి నిర్జించి యాతని బంధితుని జేసియుండెను. కాని శీఘ్రముగా చోళరాజునకు మిత్రుడగు కర్ణాటనరసింహరాజు ఆ కొప్పెరుంజింగదేవుని జయించి చోళరాజును బంధవిముక్తుని గావించెను. కాని యా తండ్రి కొప్పెరుంజింగనితో మన చరిత్రకు సంబంధము లేదు.

ఆంధ్రదేశముతో సంబంధ మున్న యాతనికుమారు డగు కొప్పెరుంజింగడు చిదంబరేశ్వరునికి భక్తుడు. అందుచే నాతడు తాను 'కనకసభాపతి సర్వకార్యసర్వకాలనిర్వాహకుడ' నని బిరుదనామము సగర్వముగా వహించెను. మరియు 'ఖడ్గమల్ల, నిశ్శంకమల్ల, పాల్ బలప్పెరుమాళ్', మొదలగు ప్రతాపనామము లాతని పరాక్రమము తెలుపును అతడు వీరు డగుటయే కాక భరతశాస్త్రమును సాహిత్యమును చక్కగా నభ్యసించి, 'భరతమల్ల, సాహిత్యరత్నాకర', ఇత్యాదిగా అన్వర్థబిరుదములు కూడ పొందెను. ఇతడు ముందు కాంచీపురమున ప్రతిష్ఠితుడై యున్న మనుమగండగోపాలనామాంకితు డగు మనుమసిద్దిని అటనుండి నెల్లూరుకు పారద్రోలి, కంచిలో తా నభిషిక్తు డయ్యెను. కాని యాతనిని గణపతిదేవచక్రవర్తి నిర్జించి తన సామంతునిగా నొనర్చుకొని యుండెను. అది జరిగి యిప్పటికి తొమ్మిది పది సంవత్సరము లైనది.

* ఇప్పటి ఉత్తరార్కాటుమండలమునకు సరిపోవును.

గణపతిదేవునిచే పరాభూతు డైనపిమ్మట ఈ తొమ్మిదిపది సంవత్సరములును అత డూరకుండలేదు. అతడు నెమ్మదినెమ్మదిగా బలము చేకూర్చుకొనుచు స్వాతంత్ర్యము నవలంబించుచుండెను. ఆతని విజృంభణ మరికట్టుటకు వృద్ధు డైన గణపతిదేవునకు సాధ్యము కాకుండెను కాని యంతలో కొప్పెరుంజింగని కొక యుపద్రవము సంభవించినది. ఇప్పటికి రెండేండ్లక్రిందట మధుర ప్రభువగు జటావర్మసుందరపాండ్యుడు తన ప్రభువగు మూడవ రాజేంద్రచోళుని ధిక్కరించి యుత్తరముగా దండెత్తి వచ్చి, కంచిని ముట్టడించి, కొప్పెరుంజింగని జయించి, యాతనివలన హేమరాసులను అనేకమత్తగజములను హయరత్నములను గొని పుష్కలముగా ధాన్యము పండు విశాలరాజ్యమును హరించెను. కొంతకాల మింకను పెనగులాడుటకు కొప్పెరుంజింగనికి శక్తి కలదు కాని యాతడు జటావర్మసుందరపాండ్యునితో సంధి చేసికొనుటయే నీతిగా దలచెను అందుచే వారికి సంధి యయ్యెను. దాన కొప్పెరుంజింగనికి పోయిన తన రాజ్యమును హేమరాసులును గజాశ్వాదులును తిరిగి సంప్రాప్త మయ్యెను. ఆ సంధితోపాటు ఆంధ్రరాజ్యమునకు మహోపద్రవమే సంభవ మయ్యెను ఆ సంధివలన ఆ పల్లవపాండ్య ప్రభువు లిరువురు నేకీభవించి ముందు ప్రాచ్యాంధ్రసముద్రతీర భూమి నాక్రమింప నిశ్చయించిరి

అది సాధించుటకు వారిరువురకు కావలసినంత భూసైన్య మున్నది కాని దానికి తోడుగా విస్తార మగు నౌకాబల మున్నగాని వారి ప్రయత్నము సిద్ధింప నేరదు. అట్టి నౌకాబలము వారికి లేదు అది లేనందున కాకతీయుల ప్రచండనౌకాబలము వారి కెన్ని యేనియు నిక్కట్లు కలిగింపగలదు. ముందుకు తమ సేనలు సాగి పోవుచున్న యెడ ఆ బలముల వెనుకనుండి కాకతీయసేనానులు దారు లరికట్టవచ్చును అట్టి విషయమున తమసేనలకు సహాయము అందుట కష్టసాధ్య మగును ఆ కారణమున వారు ముందు తాము కూడ కొంత నౌకాసైన్యము శ్రద్ధగా కూర్చుకొన నారంభించిరి. ఆ ప్రయత్నము వారి కంత కష్టము లేకుండనే సాధ్య మయ్యెను

చోళసామ్రాజ్యబలము క్షీణించుచున్నప్పటినుండియు తూర్పు సముద్రతీరమున సముద్రదస్యులు బలసిపోయిరి. విదేశములనుండి వచ్చు నావలను ఈ ఓడదొంగలు పట్టుకొని వారి ద్రవ్యమును సరకులను దోచుకొనసాగిరి ఇక ఒడ్డుపట్టినట్టియు తుపానుచే దెబ్బ తిన్నట్టియు నావలలోని సరకులకు దిక్కుదివాణమే లేకుండెను ఇట్లు అల్లకల్లోలముగా నున్న సమయమున గణపతిదేవచక్రవర్తి తూర్పుసముద్రతీరమును జయించియుండెను. అప్పు డార్తరక్షణు డగు నా మహారాజు దస్యుల నందర దరిమితరిమి, వారి రహస్య స్థానము లెల్ల గాలించి యాక్రమించి, వారి నెల్ల నేమించి యుండెను. అంతట నాతడు ముఖ్యములగు రేవుపట్టణములలో తన జలసుంకాధికారుల నిలిపి పరిపాలనము చక్కజేసెను క్రమముగా నాతడు కూపశుల్క మొక్కటి తక్క మిగిలిన శుల్కము లన్నియు తీసివేసి, సరిగా సుంకము చెల్లునట్లు కట్టడి చేసియుండెను ఈ శాసనములు పరిపాలించి దస్యుబాధ నరికట్టుటకు ఆతడు రాజ నౌకాబలము నయ్యెయెడల నిలిపి తీరభూమిని రక్షించుచుండ నియమించెను. ఉత్తరమున కోరంగినుండి గోదావరీముఖద్వారములం దల్లెడల గణపతినావలు ప్రత్యేకముగా నొక నావధ్యక్షుని క్రింద నుండి సముద్రయానము చేయువారిని సంరక్షించుచుండెను మరల మోసులపట్టణము మొదలు కృష్ణానదీముఖద్వారములం దల్లెడల దిరుగుచు గణపతినావలు కొన్ని మరియొక నావధ్యక్షుని వశమున నుండెను. మరియు నొక నావధ్యక్షుడు మోటుపల్లివాడరేవు మొదలు కొని కొత్తపట్టణము రామపట్టణములమీదుగా నెల్లూరుసమీపమందలి కృష్ణాపట్టణమువరకు గల తీరభూమిని రక్షించుచుండెను. ఈ నావధ్యక్షుని ముఖ్యస్థానము మోటుపల్లి మోటుపల్లిలో నుండు నావధ్యక్షుడు సిద్ధయదేవచోడుడు !

ఇట్లు తీరభూమి సరిచేసి రేవుపట్టణములం దల్లెడ విదేశవర్తకులకు తన యభయశాసనములు శిలాస్తంభములపై గణపతిదేవుడు చెక్కింప జేసెను అందుచే దూరమున నున్న మలయము సువర్ణద్వీపము యవద్వీపము సింహళద్వీపము తోడనేగాక అరబ్బుదేశము ఐగుప్తు దేశములతోడను వెనిసు జెనీవాలతోడ గూడ మోటుపల్లిలో వ్యాపారము సాగుచుండెను. ఈ శిక్షణచే సముద్రదస్యుల యాటలు కట్టువడి పోయెను అది యీ ఓడదొంగల కిష్ట మగునా ?

ఆ దొంగలలో లొంగినవారు లొంగగా మిగిలినవారు చోళ చక్రవర్తి బలహీనత కనిపెట్టి చోరసముద్రతీరమునకు చేరి యా మండలమునకు బహుకాలమునుండి కలనామము సార్థకము చేయ జొచ్చిరి వా రట్లు పులికాటుసరస్సునుండి నాగపట్టణమురేవువరకు స్వేచ్ఛావిహారములు చేయసాగిరి ఆ చోరులును సామాన్యులా ? ఒక్కొక్కడు ఒక్కొక్క ప్రభువే !

ఆ సముద్రచోరప్రభువులతో జటావర్మసుందరపాండ్యునికిని కొప్పెరుంజింగనికిని ఇప్పుడు పని కలిగినది వా రాచోరుల రావించి మంతనము లొనర్చి వారి సాయముతో నౌకాబలము కొంత సమకూర్చుకొనిరి. ఆంధ్రసముద్రతీరమున పాడిపంటలు సమృద్ధముగా గల భూభాగ మున్నది ఆ ప్రదేశములకు విలువగల సరకులు గొని విదేశములనుండి నౌకలు రాకపోకలు తరచుగా సలుపుచుండెను. ఆ భూభాగములను ఆ నౌకలను కొల్లగొట్టుకొను నవకాశము వారు వృథ గావింతురా ?

ఇట్లొకవైపున నా పాండ్యపల్లవులు చోరనావికులతో రాయబారములు సాగించుచు తూర్పుసముద్రతీరమండలముల గల మండలాధిపతులతో గూడ రాయబారములు సాగించిరి. పూర్వము రాజరాజనరేంద్రుని కుమారు డగు రాజేంద్రదేవుడు వేంగీమండలముతో పాటు చోళరాజ్యమునకు చక్రవర్తియై కులోత్తుంగచోడ నామము ధరించి చోళులలో నొకడైనప్పటినుండియు, చోళనామధారు లగు పలువురు తెలుగు మాండలికులు ఆంధ్రతీరభూమికి యేలకులుగా నుండిరి వీరిని తెలుగుచోడు లనియు వ్యవహరించుట కద్దు వీరికి చోళచక్రవర్తులతో సంబంధములు తెగియు తెగకుండినవి కాకతీయుల మహాసైన్యములు వచ్చినప్పుడు వా రా ప్రభువుల దాసు లగుదురు ఆ సైన్యము లటుపోయిన పిదప దక్షిణమునుండి మహాబలశాలు లెవరైన వచ్చిన వారికి మరల లొంగిపోదురు ఎవరి యొత్తిడియు లేకున్నతరి మేమే స్వతంత్రులమందురు మధ్యమధ్య వీలయినచో చొరవ చేసికొని దక్షిణమున కాంచీమండలమును తొండమండలమును నాక్రమింతురు ఈ తెలుగుచోడులలో ప్రముఖులు నెల్లూరు ప్రభువులు అందులో మనుమసిద్ధి తండ్రియగు తిక్కరాజును గూర్చి తిక్కనామాత్యు డిట్లు వర్ణించియుండెను

"గంభురాజాదిప్రశస్తారిమండలికము జేర్చి యేలడె కంచిపురము
జేదిమండలము గాసిగజేసి కాళవపతి నియ్యకొలుపడే పలచమునకు
రాయగండగోపాలు నరాతిభయద
రాయపెండారబిరుదాఫిరాము సుభను

రాయగండాంకు ఖండియరాయు దిక్క-
ధరణివిభు బోల రాజుల కరిది కాదె

"కమలాప్తప్రతిమానమూర్తి యగు నా కర్ణాటసోమేశు దు
ర్దమదోర్గర్వము రూపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిన్ జోళుని భూమిపై నిలిప చోళస్థాపనాచార్యనా
మము దక్కంగొని తిక్కభూవిభుడు సామర్థ్యంబు చెల్లింపడే!"

ఈ పద్యములలో తిక్కనామాత్యుడు వర్ణించినది ఈ కొప్పెరుంజింగని తండ్రి యగు పూర్వోక్తుడగు కొప్పెరుంజింగని కాలమున జరిగిన చోళరాజ్యకల్లోలమే ఆ కొప్పెరుంజింగడే ఇందు వర్ణించిన కాడవపతి! తిక్కభూపతి పిమ్మట అతని కుమారుడగు మనుమసిద్ధి నెల్లూరుపాలకు డయ్యెను అతడు చిన్నతనముననే పరాక్రమము చూపినాడు.

"ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌర్యం బొప్ప గర్ణాటద
ర్పవిఘాతంబు నొనర్చి వైరిమనుజేంద్రశ్రేణికిన్ గొంగ నా
నవనిం బేర్కొని యున్న యట్టి విజయలక్ష్మీధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళనమన్మసిద్ధి యని బ్రాయేటం బ్రగాఢోద్ధతిన్."

మరియు పొత్తపినాడు, కొణిదెన, మోటుపల్లి, కందుకూరు వెలనాడులో ఎక్కువభాగము ఇట్టి తెలుగుచోడుల పాలనముననే కలదు.

ఈ స్థితిలో పల్లవపాండ్యు లిద్దరు ముందు మనుమసిద్ధితో రాయబారములు సాగించిరి అతి డటు రాజేంద్రచోళరాజును సమర్థింపవలెనో, ఇటు గణపతిదేవులమైత్రి యర్థింపవలెనో నిశ్చయింపలేని స్థితిలో నప్పు డుండెను ఎటు చేయుటకును పాలుపోక మౌనము వహించి యత డుండగా అది కనిపెట్టి పల్లవపాండ్యసేనలు ఒక్కుమ్మడిగా వచ్చి నెల్లూరు ముట్టడించెను. మనుమసిద్ధి తాను స్వయముగా నా సైన్యములను ప్రతిఘటింప శక్తుడు కాడు అతని కా యాపత్సమయమున నేమి చేయను దోపలేదు ముందు గణపతిదేవుల సహాయ మర్థింప నాతడు నిశ్చయించెను; అందుకై తిక్కనసోమయాజుల సాహాయ్యము వేడెను అప్పుడు సోమయాజులు అమాత్యవ్యవహారములు మానుట చాలించుకొని యనుదినము పినాకినీనదీస్నానము చేయుచు హరిహరనాథుని సమక్షమున మహాభారతరచన సాగించుచుండెను. ఆ మహానుభావునికి రాజ్యతంత్రములలో నిప్పుడు సంబంధము కలిగించుకొను నిచ్ఛ లేదు. అయినను మనుమసిద్ధిపై గల వాత్సల్యముచే కాదనలేక నూరుగురు కరణములను దీసికొని అతడు ఓరుగల్లుకు ప్రయాణ మయ్యెను. త్రేతాగ్నులు వెంటగొని సోమయాజి బ్రాహ్మణబృందముతో పురి వెడలిపోవుచుండ ముట్టడించిన యా సైన్యములు నిరోధింపలేదు. యుద్ధసమయముల నట్లు నైదికనిష్ఠ గల బ్రాహ్మణులు ప్రశాంతప్రదేశములకు వెడలిపోవుటయు, వారి నిరుపక్షముల వారును బాధింపకుండుటయు యుద్ధధర్మమున పరిపాటిగా నా కాలమున నుండెను. అందును కొప్పెరుంజింగడు పండితపక్షపాతి.

సోమయాజుల నిట్లు మోమోట పెట్టి ఓరుగల్లుకు పంపియుండెను గాని అచటనుండి వెంటనే సహాయము తనకు వచ్చునను నాశ మనుమసిద్ధికి లేదు ఓరుగల్లుప్రభువులకు కొంతకాలముగా శక్తి క్షీణించినది రాజధానిలోననే అలజడులు చెలరేగవచ్చునని జనశ్రుతి ప్రాకియుండెను. ఒకనా డాకస్మికముగా మనుమసిద్ధి హృదయమున భయ మావేశించెను వెంటనే యాతడు కోట విడిచి రహస్యమార్గమున ఎక్కడికో వెడలిపోయెను ఈ వార్తయు నెల్లూరు మండలము దాటిపోయిన కొలది దినములకే సోమయాజులకు చేరెను అయినను సోమయాజులు తన ప్రయాణము ఆపలేదు

మనుమసిద్ధి కోట విడిచి పోయినంతనే అక్కడి సేనలు పల్లవపాండ్యసేనలకు లొంగిపోయెను. కొప్పెరుంజింగడును జటావర్మసుందరపాండ్యుడును నెల్లూరు ఆక్రమించి దోచుకొని తమ సైనికులకును నావికులకును ధనము పంచిపెట్టిరి. ఆ పిమ్మట కొంతకాలము వరకు తమ సేనలకు సంపన్నమగు నెల్లూరుపరిసరములు కొల్లగొట్టుటకు వా రనుజ్ఞ యిచ్చిరి అట్లు దోపిడి పూర్తియైన పిమ్మట వారు క్రమపరిపాలన మారంభించిరి

నెల్లూరుమండలముతో వారి యాశ తీరలేదు తూర్పుసముద్రప్రాంతమందలి మాండలికు లందరలో వారు శీఘ్రముగా సంబంధము లేర్పరచుకొనిరి గొంటూరు నాగదేవుడు వారి కనుకూలుడయ్యెను. కందుకూరు, పొత్తపినాడు, కొణిదెన, మోటుపల్లి, వెలనాడులలోని చోళులు వారికి సహాయులు కాక వంగీకరించిరి అందులో మోటుపల్లితో నాపధ్యక్షు డగు సిద్ధయదేవచోడుడు స్వతంత్రుడైనట్లు ప్రకటించి యక్కడి సుంకము లెక్కన చేసి కప్పము రాజకోశమున కంపుటే చాలించెను.

మేళకర్తలు: కర్ణాటక-ఔత్తరాహికవిధానములు

(గత సంచిక తరువాయి)

శ్రీమతి జె. కమలాదేవి

ఈ దశమేళములు (థట్టేలు) ను వాటికి కర్ణాటకగానసాంప్రదాయమున గల నామములతో నీక్రింద నుదహరింపబడును.

హిందూస్థానియందలి నామములు	(కర్ణాటకగానమందలి నామములు)	(సంఖ్య)
1 కల్యాణి (లేక) యమన్ ...	(మేచ) కల్యాణి	(65)
2 బిలావల్ (లేక) విలావలి	(ధీర) శంకరాభరణము	(29)
3 కమాజ్	(హరి) కాంభోజి	(28)
4 భైరవ .	(మాయా) మాళవగౌళ	(15)
5 పూర్వి ...	కామవర్ధని	(51)
6 మార్వ .	గమనశ్రమ	(53)
7 కాఫి ...	ఖరహరప్రియ	(22)
8 అసావేరి ...	(నట) భైరవి	(20)
9 భైరవి . .	(హనుమ) తోడి	(8)
10 తోడి .	(ధావి) వరాళి	(39)

ఈ పదింటినికూడను ఇంకను క్లుప్తపరచుట కవకాశము గలదు. వీటిని 6 ఆరింటికి తగ్గించ వీలు అగుచున్నది. ఈవిధానమును "ప్రొఫెసర్ భట్ఖండే యను నతడు తన "లక్ష్యసంగీత"మను (ఔత్తరాహికసంగీత) గ్రంథమున చక్కగా వివరించియున్నాడు. (76వ పేజీలో చూడుడు.) 13. అదెటులనన శుద్ధస్వరములగు స. రి. గ. మ. ప. ద. అనునవి యారున్నూ షడ్జభావసంబంధముగలవియై యున్నవి. అనగా నొక్కొక్క దానిని షడ్జముగా నొనర్చి ప్రస్తరించుమా రాగా వరుసగా (6) ఆరు రాగములు లభ్యమగును. (అనగా ఈ విధానము కర్ణాటగానసాంప్రదాయమందలి "గ్రహస్వర భేదక్రమవిధానము (Model Shift of Tonic) అయివున్నది. ఆ వివరము క్రింద చూపబడును

పై ఆరింటినిమాత్రమే హిందూస్థానీ గానమందుపయోగమునకు సరిపోవునని చెప్పిరి

14. మనము గమనింపదగు విషయమేమనగా నీ 72 మేళకర్తల విధానము కేవలఅభ్యాసవిధానమునకు మాత్రమేగాక సంగీతశాస్త్ర (Science) చర్చావిధానములో (Theory) నెక్కువ విలువకలిగినదానినిగా పరిగణింప దగియున్నది కొన్ని కొన్ని శృతులమధ్యనుండు విరామము (Interval) సుమారుగా నొక శృతిమాత్రమే వుండును గనుక నట్టి స్వల్ప భేదమును అంతగా పరిగణింప నవసరము లేదని వారి యభిప్రాయమై యున్నది హిందూస్థానీ గానపద్ధతియందుగల ఆ యా రాగముల నుద్భవింపజేయుగల ముఖ్యములగు 10 దశమేళకర్తలను (థట్టేలు) మాత్రమే గ్రహించి మిగిలిన వాటితో నా గానవిధానమం దుపయోగము లేదని అప్పటివారు విడిచియుండిరి. ∴ కాని యథార్థమునకు ఆ విధానమందు పాడుచుండెడి గొప్పగొప్ప గాయకుల అభిప్రాయానుసారమే ఈ పైన చెప్పబడిన 10 (దశమేళములు), థట్టలవలన అవసరమగు ననేకరాగములను, చెప్పుటకు, పాడుటకును అవకాశము లేదని యే యభిప్రాయపడుచున్నారు ఎట్లనగా ఉదాహరణమునకు "కేదార్" మొదలగు కొన్నిటియందు ఆ గానవిధానములో (కోమల - తీవ్ర) రెండు మధ్యమముల నుపయోగించుట యవసరమగును ఇట్టి అననుకూలములు చాల గలవు. ఇటీవలివారగు హిందూస్థానీగాయకులు వారి పూర్వవిధానమునకు కొంత వ్యతిరేకమే అయిననుకూడ శుద్ధ, కోమల, మొదలగు స్వరభేదములను గమనించి పాడుచున్నారు. వారి గానవిధానమందలి అన్ని రాగములున్నూ ఈ పది మేళకర్తలవలననే పాడుటకు వీలగునా కాదా యను విమర్శ యెటులుండినను, శాస్త్రదృష్టిలో పూర్వులగువారు చెప్పిన శాస్త్రవిధానమును కాదనుట కవకాశము లేదు హైందవవిజ్ఞానమున నిట్టి యమోఘమగు సంగీతశాస్త్ర అభివృద్ధిని గలిగించి ఎంతయో విస్తరింపజేసియుండిరి. ఇట్టి హైందవసంగీతశాస్త్ర జ్ఞానము అసమానమును, అద్వితీయ మనియు చెప్పదగియున్నది ఇందువల్లనే ప్రపంచమందంతటను కూడను హిందూదేశసంగీతము (Indian Music) నకెక్కువ ప్రాముఖ్యతయు

శుద్ధస్వరములు :—

1. <u>స</u> రి గ మ ప ధ ని స సా (శంకరాభరణము)
   ఆధారషడ్జముతో గ్రహమొనర్చిన బిలావల్. (1) వచ్చును.
2. స <u>రి</u> గ మ ప ధ ని స రి / స రి గ ప ధ ని స — రిషభమును గ్రహమొనర్చి ప్రస్తరించగా (ఖరహరప్రియ) ఇదియే "కాఫి" (2) లభ్యమగును.
3. స రి <u>గ</u> మ ప ధ ని స రి గ / స రి గ మ ప ధ ని స — గాంధారమును షడ్జమొనర్చి ప్రస్తరించగా. (తోడి)—భైరవి (3) లభ్యమగును.
4. స రి గ <u>మ</u> ప ద ని స రి గ మ / స రి గ మ ప ధ ని స — మధ్యమమును షడ్జమొనర్చి ప్రస్తరించగా (కల్యాణి) యమన్ (4) లభ్యమగును.
5. స రి గ మ <u>ప</u> ధ ని స రి గ మ ప / స రి గ మ ప ధ ని స — పంచమమును షడ్జమొనర్చి ప్రస్తరించగా. (కాంభోజి) కమాజ్ (5) లభ్యమగును.
6. స రి గ మ ప <u>ధ</u> ని స రి గ మ ప ధ / స రి గ మ ప ధ ని స — దైవతమును షడ్జమొనర్చి ప్రస్తరించగా. (నటభైరవి) అసావేరి (6) వచ్చును.

ప్రఖ్యాతియును కలిగియున్నది (ఈ సందర్భములో హిందూ యూనివర్సిటీ బెనారెస్‌కు చెందిన) డాక్టరు మిస్ పి. సి. ధర్మ, ఎం. ఎ యల్. టి. డి. లిట్, అను నామె హిందూ పత్రికయందు (25-12-49) వ్రాసిన వ్యాసభాగమును చూడనగును. అందు ఈ విషయములను బహుచక్కగా విమర్శించి యున్నారు.)

15. మరియును ఈ విషయమునే విమర్శించుచూ శ్రీ పండిట్ రతన్‌జంకర్ (లక్నో విశ్వవిద్యాలయ సంబంధసంగీతకళాశాలాధ్యక్షుడు) అనువారు మద్రాసు సంగీతపరిషత్తులో (*Music acadamy*) నుపన్యసించుచు నీ క్రింది విధముగా చెప్పియుండిరి "మనలో ఇప్పటి దక్షిణాత్యగాయకులుగాని, ఔత్తరాహికగాయకులుగాని భరతనాట్యశాస్త్రము; బృహద్దేశి; రత్నాకరాదిగ్రంథములయందు చెప్పబడినట్టి విధానము మాదియే నని చెప్పుటకు వీలులేకున్నను; రెండును కూడ పూర్వగ్రంథకర్తలయొక్క నియమానుసారముగ నభివృద్ధి పొందినట్టివియే యని చెప్పవలసియుండును. సంగీతమనగా నభ్యసించదగినట్టి యొక చక్కని లలితకళ యగును. అది ఆ యా కాలములయందు ఆ యా ప్రాంతములయందలి ప్రజాభిరుచుల ననుసరించి యభివృద్ధి నొందియుండెను. పూర్వమున గల గ్రామమూర్ఛనజాతి, రాగాంగ, ఉపాంగ, భాషాంగ, విధానమునూ, ఔత్తరాహికుల రాగ-రాగిణీ పుత్రముల విధానమున్ను, దక్షిణ భారతవిధానమందలి జనక-జన్యరాగవిధానములున్నూ గమనించదగినవి. హిందూస్తానీ గానపద్ధతిని నిర్ణయించియుండిన "భట్ ఖండే"యొక్క కృషికి యెంతయును ఔత్తరాహికులు కృతజ్ఞులే యగుదురు వీ రేర్పరచియుండిన 10 (థట్సు) మేళకర్తల విధానము ననుసరించియే ఇటీవల ఔత్తరాహికులు కర్ణాటకగానవిధానమందలి 72 మేళకర్తల పథకమునుకూడ (సంపూర్ణముగ) స్వీకరించియుండి రనియు, ఇంకను వీరు చెప్పుటలో "భట్ ఖండే" యనునత డేర్పరచిన (10) దశ మేళవిధాన మంత తృప్తికరముగా లేదనియు; అది యిప్పటి ఔత్తరాహిక గానవిధానమునకు కొంత భిన్నముగనే ఉన్నదనియును, సంపూర్ణ మేళ-జన్యవిధానమే (72 మేళపథకవిధానము)సర్వాంగీకృతముగ నున్నదనియును ప్రస్తుతఔత్తరాహికసంగీత పరిజ్ఞానముకలనను, ఇంకను పూర్వఔత్తరాహికసంగీతగ్రంథము లగు "రాగతరంగిణి" (ఇది లోచనకవికృతము), "హృదయకౌతకము" మొదలయిన గ్రంథాధారముల ననుసరించియును, అతడు నిర్ధారణ మొనర్చియున్నాడు. ఈ 72 మేళకర్తల విధాన మంతయును పూర్వగ్రంథములయందు చెప్పబడియుండినను, తరువాత వారగు మిక్కిలి కీర్తిని ప్రతిష్టింపజేసినట్టి "సంగీత త్రిమూర్తులు" అగు త్యాగరాజు, ముద్దుస్వామి దీక్షితర్, శ్యామశాస్త్రి; అను మువ్వురున్నూ చాలా ప్రసిద్ధిలోనికి తెచ్చి బాగుగా ప్రచార మొనరించి యుండిరి." అనియును ఇతడు చెప్పెను. ఇంకను నితడు రెండు సంగీతవిధానములను విమర్శించుచూ; "ఉభయవిధానములయందును గల (*Gamet* గ్రామములో గల) ద్వాదశశ్రుతివిధాన మొక్కటియే యనియు, ఆలాపనావిధానము కూడ నొక్కటియే యనియును ఇతడు చెప్పియున్నాడు. మరియు రెండింటిని పోల్చి చెప్పుచు ఔత్తరాహికులు "ధ్రువము" అనునది దక్షిణదేశపద్ధతిలో "పల్లవి" అనున దనియు, ఔత్తరాహులు "ధ్రుపద్"లు అనునవి దాక్షిణాత్యవిధానమందు "కీర్తనలు" అనునట్టివియే ననియు, వీటన్నిటికినీ కూడను పూర్వప్రబంధములయందు చెప్పబడిన విధాన మొక్కటియే యనియును, ఇంకను దాక్షిణాత్యులు "జావళీలు"అని చెప్పువాటిని ఔత్తరాహికులు పాడెడి "టుమ్రీలు" అందు రనియు, అటువలెనే తిల్లాన, తారణ, స్వరావర్త, సరళి లేక స్వరావళి" యననవి కూడను అట్టివియే నని చెప్పెను. మరియును, కర్ణాటకగానమందు గల రాగలక్షణగీతములను వానిని కొన్నింటిని "భట్ ఖండే" యను వారు ఔత్తరాహికగానవిధానమున ప్రవేశపెట్టి రనియు, తరువాత వీరి ననుసరించి మరి కొందరు ఔత్తరాహికులు ఇటీవల కొన్ని లక్షణగీతములను వ్రాసియుండి రనియు, ఈ "భట్ ఖండే" యను నాతడే కర్ణాటకగానపద్ధతిలోని హంసధ్వని, సావేరి, శ్రీరంజని; మొదలగు కొన్ని రాగములను ఔత్తరాహికగానవిధానమందు ప్రవేశపెట్టి రనియు, పూర్వమునుండియు ఇట్టి స్వల్పమాత్రభేదములు కొన్ని కొన్ని ఉంటూఉండినను యథార్థమునకు రెండునుకూడ నొక్కే ప్రాతిపదిక (*Basis*) మీదనే ఆధారపడి వృద్ధి పొందిన వనియును,కొన్ని కొన్ని భేదములను విమర్శించవలె ననిన అందుకు గల ముఖ్యకారణము ఔత్తరాహికులగు కొందరు తురుష్కులు (*Muslims*) "అమీర్ ఖుస్రూ," మొదలగువారివల్ల కొన్ని భేదములు కలుగజేయబడె ననియు, ముఖ్యముగా నతడు పర్షియన్ దేశపు వాద్యవిధానమందలి కొన్ని విషయములను ఇందు ప్రవేశపెట్టుటయే యనియు చెప్పెను. "సితార్" అను ఔత్తరాహికుల వాద్యము కర్ణాటకుల "వీణను" కొంత మార్పొనరించి తేలికపరచి యేర్పాటు చేసినదే యగును. మన విధానములో "భజన్" అని చెప్పునట్టిదియే పర్షియన్ నామము గు "ఖావాలీ"అనియును, ఇట్లు అనేకములగు తురుష్కనామములే మన రాగములకు పెట్టబడిన వనియును చక్కగా విమర్శించియుండెను. ఈ విమర్శయంతయును యదార్థముగను సహేతుకమే యగును. వీరి కృషి చాల మెచ్చతగినది. ఔత్తరాహికవిధానమును రూపొందించిన "భట్ ఖండే" తరువాత వీరు (రత్నజంకరు) అద్భుత మగు కృషి నొనర్చియుండిరి. (వీరి యుపన్యాసభాగమును 29-12-49 తేదీగల హిందూ పత్రికయందు 12 పేజీలో చూడదగును.)

16 మరియును మద్రాసులోని తమిళ ఇసాయిసంఘమువారి యాజమాన్యమున జరిగిన సభయందు పూర్వతమిళసంగీతమును గురించి ఉపన్యసించుచూ, ఈ విషయమును గూడ వారి ఉపన్యాసభాగమున కొంత చెప్పియుండిరి. (ప్రొఫెసర్ పి. సాంబమూర్తి (B. A. B. L) (మద్రాసు గవర్నమెంటు సంగీతకళాశాలాధ్యక్షులు) అను వారు ఇట్లు చెప్పియుండిరి. "కర్ణాటకగానము యథార్థముగా చాలా పురాతనకాలమునుండియు హిందూదేశమునందు ప్రచారములో నుండియున్నది. కర్ణాటకగానమందు చెప్పబడెడి "తేవారములు" పాడెడి కాలమునకు కర్ణాటకగానపద్ధతి యనియు, హిందూస్తానీగానపద్ధతి యనియును విభేదములు లేవు. తరువాతకాలమున క్రమేపి పర్షియన్, అరబిక్, సంగీతసాంకర్యములమూలముగా హిందూస్థానీ సంగీతవిధానము, (ఔత్తరాహిక) వేరుగా నభివృద్ధి పొందినది. దక్షిణభారతసంగీతవిధానము (కర్ణాటకము) మాత్రమే తన పవిత్రతను ఎంతమాత్రమును పోగొట్టుకొనక చాల పరిశుద్ధముగ నిప్పటికినీ అభివృద్ధిని పొందుచు నిలువగలిగినది. హిందూదేశపు సంగీతనిపుణులు జావా, కంబోడియా, సయామ్, దేశములకు వెళ్లి అచ్చటివారి వారి సంగీతవిధానములను శ్రద్ధతో గమనించి

(35-వ పేజీ చూడుడు)

మట్లవారిమీఁది చాటువులు

(గత సంచిక తరువాయి)

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

మట్ల అనంతరాజు

మట్ల అనంతరాజు వేదార్థ రత్నాకర ప్రియుడు. మధురవాణీవిలాస మనెడి ప్రబంధమును రచించిన చింతలపల్లి వీర రాఘవకవికి పూర్వుడు — సనాముడు వీర రాఘవకవి మట్ల అనంతరాజుకడ వేదపరీక్ష లిచ్చి వేయి చక్రముల బహుమతిగా బడసె నట, మధురవాణీవిలాసములో నిట్లున్నది

వ అం దగ్రజుం డగు మహానుభావ చరిత్రుండు (వీరరాఘవుండు – ఈ పేరిటి గ్రంథకర్తకు పూర్వుడు)

ఎవడు వేదపరీక్ష లిచ్చి మట్ల యనంత
రాజుచే గొనియె జక్రములు వేయు
నెవని కవిత్వంబు వివరించి పూలరం
గపతిరా జిచ్చె గ్రామపతి గాగ
నెవ్వాడు రాణువ నేలి కైకొనె రాజు
వారి చెంగట దళవాయితనము
నెవ్వాడు బహుకాల మేలె నెన్నేని గ్రా
మంబులు రాణువ సంబరముగ
నట్టి సకలజనోద్గీర్ణ డభినుతింప
దగడె దీక్షాటవీనాథ తతకటాక్ష
లబ్ధనైజప్రభానైకలాఘవుండు
రాఘవవిధేయు డగు వీరరాఘవుండు

మట్ల తిరువెంగళనాథరాజు

ఇతడు మట్ల అనంతభూపాలుని కుమారుడు గొప్ప పరాక్రమవంతుడు మానధనుడు శ్రీ వీరవెంకటపతిరాయలవారు ఇతని పరాక్రమమునకు మెచ్చి కనకతప్పెట్లు, సైన్యానకు శత్రుచైలను ఆక్రమించి తెచ్చిన మీనటెక్కెము, రాయలు ఎక్కు నశ్వము, ఏనుగు, అశ్వానకు ముత్యాల కుచ్చులు, ఏనుగునకు పసపుబావడలు మొదలైనవి దయచేసి యిచ్చిరి ఆ యీ విషయము క్రింది పద్యములవలన దెలియుచున్నది.

సురమాయి బిరుదు భాసురలీల నీకిచ్చె
రాయలు నీ పరాక్రమము మెచ్చి
కనకతప్పెట వేయ్చు గనుక నీకిచ్చెను
గట్టభద్రుడు ధవళ్ఛత్రము బొగడి
మలహరి వైరిసీమలు హరించితి వంచు
నెలవిచ్చి నీకిచ్చె విలసితముగ
మీనాంక మఖిలభూమీనాంక మిది నీవు
గెలిచి వచ్చిననాడె కృప నొసంగె
మఱియు దా నెక్కు తేజీల మత్తకరుల
నిచ్చి కట్టాణిముత్యాల కుచ్చులొసగె
బసపు బావడ కర్ణాటపతి యొసంగె
లక్ష్మణోపేంద్ర! తిరువెంగళక్షితీంద్ర!

ప్రకటించి వెంకటపతిదేవరాయలు
ఘనత మించిన రాజ వనుచు బొగడి
మదపు టేనుంగులు మంచి తేజీలును
బొందైన నవరత్న భూషణములు
సింహాడాలు బసపుజిగి మించు పావళ్లు
కనక తప్పెట్లు బంగారు నేజ
మత్స్యటెక్కెము వీరమలహరి మొదలైన
బిరుదులు నీకిచ్చి పెంపు సేయ
నతడు తగు బద్దపోల్ పట్టణాభిధాన
మాతృనామైక లక్ష్మమాంబాతటాక
వేంకటేశప్రతిష్ఠాది వివిధసుకృత
శాలి తిరువెంగళక్షమాపాలమౌళి,

తిరువెంగళనాథరాజు మీఁది మఱి రెండు చాటువు లివి యతని భట్రాజులు చెప్పినవి

బిరుదుశత్రులు మీన బెట్టు సొమ్ముల కాని
పెట్టరు నీ యొద్దిభట్టువారు
హెచ్చు వీరుల దోచి తెచ్చుకోవలె గాని
కట్టరు నీ యొద్ది కటికవారు
ప్రత్యర్థి యర్థియై విద్య యిచ్చిన గాని
యందరు నీ యొద్ది యడపవారు
మదవైరి చర్మంబు పొగుడు చేకొని కాని
పట్టరు నీయొద్ది పంజువారు
అవుర! నీయంత ఘనుని దిగంతరముల
గొలిచి బ్రతుకని మన్నీలు కూళలహహా!
సమరనిశ్శంక! మట్టిలికాసనాంక!
లలితగుణసాంద్ర! తిరువెంగళక్షితీంద్ర!
ఇభరామమదసామజేంద్రుల గడి దాట
రానీదు నీగు వీరధ్వజంబు.
ఉదయాద్రి తురగాద్రి మొదలైన గిరులను

తురగా—సుగ్రముకొండ

వేటాడు నీడాలు విక్రమమున
సింహాసనం బెక్కి వెలిగి రాయలచేత
గన్నది పూర్వ నీ కులపతాక
కొలువని పాటేల గూడేల దొరలకు
మేలుగా మేయు నీ కేతనంబు
విజయసింహంబు గనుక నీ భుజబలంబు
రాయమన్నీలు సన్నుతుల్ సేయువారు
మట్లకులభోజ! బాపురె! మగలరాజ
లక్ష్మణోపేంద్ర! తిరువెంగళక్షితీంద్ర!

ఈ తిరువెంగళనాథరాజుకున్ను, కందనూరి సీమప్రభుత్వం చేస్తూవున్న రాయలవారి సన్నిహితులయిన గోపాలరాజు గారికిన్ని చంద్రగిరిలో వీర వెంకటపతి రాయలవారి సన్నిధానమందు సమక్షము అయివుండగా ప్రసంగవశమున గోపాలరాజు గారు మట్ల తిరువెంగళనాథరాజు గారితో పలికిన వార్త యేమంటే మీ అయ్యగారు, మీ తాతగారు బహుశూరులున్ను, పరాక్రమవంతులున్ను మీరుమట్టుకు యేతావతు విశేషకార్యములు చూచినవారు కారు బాల్యము వకటి అది గక్కున పటి పోకిళ్ళ గోతే విహితముగా వుండదు సమయోచితానుసారముగా కాలం గడపవలసినది పూర్జితము అని మందలించగా ఆ మాట తిరువెంగళనాథరాజు గారికి ఆ మూసము తోచి తిరుగా కందనూరి గోపాలరాజు గారిని వుద్దేశించి మమ్మును బాల్యములుగా మీరు యెంత గ్రహించి వున్నప్పటికిని మీవంటివారి ప్రత్యర్థులయొక్క వుపద్రవం కూడినవేళకు మావంటివారినంచే మీయొక్క సంరక్షణ కావలసినది కాని యితఃపరం లేదు. అని చెప్పిరి అటు పిమ్మట గోపాలరాజు గారు కందనూరికి లేచి పోయిరి

శా. శ ౧౫౪౧ సిద్ధార్థిలో యదల్ ఖానుడు, బాబాశాపు—ముగ్గురు సరదారులతో ఫౌంజును వెంటదీసికొని వచ్చి కందనూరి దుర్గానికి ముట్టడి వేసిరి కందనూరి దుర్గములో వున్న గోపాలరాజు గారు మట్ల

తిరువెంగళనాథరాజుగారి సహాయము కోరుకొనిరి. అన్యులు సహాయంనిమిత్తం కోరుకున్నప్పుడు పోవలెన్నది రాజధర్మంగనుక మట్ల తిరువెంగళనాథదేవచోడమహారాజులుగారు తమ కొమాళ్లు అయిన కొమార అనంతరాజదేవచోడమహారాజులగారియందు రాజ్యభారముంచి తమయొక్క సైన్యముతో కూడ పోయి కందనవోలి దగ్గర దిగివుండి తురుష్కుల సైన్యముతో కూడ యుద్ధసన్నద్ధులైరి.

* మా తాతతండ్రులు తరతరాన శత్రువులవల్ల తిరిగి విరిగి యెరగరు. పదార్థములు, శరీరములు భూమియందు అనిత్యములు. అయినప్పటికిని సత్యము, ప్రతాపము, కీర్తి నిలుచును. రాజశ్రేష్ఠునకున్నూ, సూరునకున్నూ శత్రువులవల్ల విరుగుట ప్రార్జితం కాదు. గోపాళరాజుగారితో తొల్లి మీరు పలికిన వాక్యము నెరవేర్పడానకు యుక్తమయిన కర్యము సంభవించినది.

సాహసంచేతను తొంటిరాజులు పరమోపకారులయి వన్నెకెక్కి స్థిరకాలజీవులయిరి. పూర్వము శాలివాహనునిచేత యుద్ధములో శస్త్రనిహతుడై విక్రమార్కుడు బాగడొందెను. తాను పట్టభద్రుడైనందున రాజనిమిత్తి విచారించి మగ్గురుపాగుశాహాలుమొన యయినప్పుడు తాను నన్ను యియ్యక రామరాజయ్య యుద్ధమంగు శస్త్రనిహతుడై కీర్తి పొందెను. వెన్ను యియ్యడము మన్న రాజులకు నిందగాని వేరే లేదు. ప్రాణానికి అపేక్షించి బ్రతుకమూచుట రాజధర్మము గాదు అని పలికి తిరువెంగళనాథరాజుగారు తనవెంట వచ్చిన దగినవారి నందరిని పిలుచుకుని యుద్ధమునకు పోయిరి.

(లోకలు రికార్డ్సు)

కందనోలికడ తురుష్కసైన్యములకు, తిరువెంగళనాథరాజుగారి సైన్యములకు గొప్ప సంగ్రామము జరిగినది. అప్పుడు సన్నిధానవస్తులయిన భట్రాజులు తిరువెంగళనాథరాజుగారి పరాక్రమమును, రణరంగమును వర్ణించిన పద్యములు-

† వండియు మట్లరాజు తిరు
వెంగళనాథుడు కందనోలికా
ఖండనభూమిలో దురక
బారులపైబడి సంహరింపగా
గండెలు కొండలయ్యె నెము
కల్ ధరణీజములయ్యె నెత్తురుల్
గందపుటేరులయ్యె దల
కాయలు తారకలయ్యె జాడగన్.

మఱియొక చాటువు—

హరిపాదాంబుజ భృంగ! మట్ల తిరువెం
గా! యింత గొప్పేలరా?
యరిమేనం బలిగాయముల్ దలచగా
హా! పోయమామిళ్ల సం
గరసన్నద్ధపతి నిన్న గదరా
కల్లూరి యల్లా(?) సం
హారప్రౌఢలు మాదనూరి సమరో
ద్యద్వైరిసన్నాహముల్.

ఈ యుద్ధములో సిద్ధార్థినామసంవత్సర మాఘ బహుళ ౧౧ యేకాదశిదివసమందు తిరువెంగళనాథరాజు, ఆయన యనుజన్ముడు తిమ్మరాజు శస్త్రనిహతులై వీరస్వర్గము నలంకరించిరి.

మట్ల అనంతరాజు

ఇతడు మట్ల తిరువెంగళనాథరాజు కుమారుడు. ఇతని తల్లి చెన్నమాంబ. ‡ కుముద్వతీపరిణయ మనెడి దివ్యప్రబంధమునకు కర్త. ప్రఖ్యాతకవీశ్వరుడు. కవిచౌడప్ప యితని యాస్థానమునం దుండినవాడు. మహామండలేశ్వరుడని యితనికి బిరుదము కలదు. ఇతడు అన్నపానాదులు సహా వేళకు మణువుపత్తు కలిగిన పదార్థములు భోజనము చేయుచుండెనట! అందువలన నతనిని "మణువు భోజనం కుమార అనంతరాజుగారని వాడకొనుచుండిరి. ఇతడు తన తండ్రియగు తిరువెంగళనాథరాజు తరువాత సింహాసనము నధిష్ఠించి సుమారు పండ్రెండుసంవత్సరములకాలము సీమాపరిపాలనము గావించినాడు. మట్లరాజులలో నితడు గావించినన్ని ధర్మకార్యములు, ప్రజాహితకృత్యములు నింకెవ్వరును గావించినట్లు కానరాదు. * తిరుమలపయి శ్రీ వేంకటేశ్వరస్వామివారి కైంకర్యముకొరకును, నింక నితరస్థలముల దేవాయతనములయందును నితడు వేయించిన శిలాశాసనము లనేకములు.

ఇతడు తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామివారి దేవాలయమునకు పెద్ద ద్వారగోపురమును కట్టించినాడు. అలిపిరి (అడిపడి?) యందు కొత్తగోపురమని పిలువబడు పెద్దగోపురమును, తొలిపర్వతము దాటినతరువాత మొగలో నున్న గాలిగోపురమును గట్టించినవాడు కూడ నితడే. అందు దక్షిణకుడ్యముపై లోపలివైపున కుమార అనంతరాజుయొక్కయు, నతని ముగ్గురు రాణులయొక్కయు విగ్రహములు చెక్కింపబడియున్నవి. దీని కెదుటివైపున నున్న కుడ్యముపై శ్రీ వేంకటేశ్వరస్వామివారి కిరుప్రక్కల రాజదంపతు లిరువురు నమస్కారముద్రతో నిలుచుండియుండునటుల చెక్కబడియున్నది.

దానికి దిగువ నొక శాసనముకూడ గలదు. దానివలన వారిరువురు మట్ల తిరువెంగళనాథరాజును, నతని భార్యయగు చెన్నమాంబయు నని తెలియుచున్నది. ఇట్లే అలిపిరియందున్న కొత్త గోపురమునందును పూర్వదిగ్భిత్తిపై లోపలివైపున మట్ల తిరువెంగళనాథరాజును, నతని భార్యయగు చెన్నమాంబయు శ్రీ వేంకటేశ్వరస్వామివారి కిరుపార్శ్వముల నిలుచుండి నమస్కరించుచుండినటుల నాయా విగ్రహనామములతో కూడ చెక్కబడియున్నది. వారికి ప్రక్కనే మఱియొక రాజవిగ్రహముకూడ శ్రీ వేంకటేశ్వరస్వామికి నమస్కరించుచున్నటుల చెక్కబడియున్నది. దానికి దిగువమాత్రము అది యెవరి విగ్రహశిల్పమో పేర్కొనబడి యుండలేదు. ఈ రాజవిగ్రహమునకు మీదను, శ్రీ స్వామివారి విగ్రహమునకు దక్షిణమునను తెలుగులోను, తమిళములోను నా గోపురనిర్మాణమును గూర్చిన శాసనములు చెక్కబడి యున్నవి. బహుశః ఆ రాజవిగ్రహము ఆ గోపురనిర్మాణము గావించిన మట్ల కుమారఅనంతరాజు

---

* ఈ వాక్యములు మొదట సీసమాలికలో తమ తాతతండ్రులు తరతరంబుల నరి మొదలుగాగల చరణముల బట్టి వచనముగా వ్రాయబడినవి

† ఈపద్యము చాటుపద్యమణిమంజరి ప్రథమభాగమునందు ప్రకటింపబడినది

‡ కుముద్వతీపరిణయము అడయారు లైబ్రరిలో నతిశిథిలావస్థయం దున్నదని, యందలి యనేకారికి చారిత్రకముగా మిక్కిలి విలువగలిగినదగుటచే వెంటనే ముద్రింపబడగలదని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు చెప్పిరి.

* కుమార అనంతరాజుగారు శ్రీ వేంకటేశ్వరస్వామి కైంకర్యముకయి తిరుమలమీదను నింక నితరస్థలములను గావించిన దానాదికములను గూర్చిన వివరములు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన దేవస్థానశాసనసంపుటముల నివేదికనుండి గ్రహింపబడినది.

గారిదయియుండు నని యూహించుటలో దోషము లేదు. అలిపిరిలో కుమార అనంతరాజు క్రొత్త గోపురమునకు దక్షిణముగా గొన్ని గజములదూరమున నొక పాడుపడిన గోపుర మొకటి నేటికిని కలదు. పిడుగు పడి యా గోపురము మధ్యకు రెండుగా జీలియు నేటికి నొకటిగానే నిలిచియున్నది. పిడుగు పడి యీ గోపురము పాడటచే రాకపోకలకు నాటంకముగా నుండుటచేతనే కుమార అనంతరాజు నేటి క్రొత్త గోపురమును, దాని చుట్టును రాతిచట్టును గట్టించియుండు నని యది క్రొత్తగా కట్టించిన గోపుర మగుటచే నతడు గట్టించిన యా గోపురము నాటినుండి క్రొత్త గోపుర మని పిలువబడుచుండవచ్చు నని మన మూహింపవచ్చును.

ఈ గోపురములను మాత్రమే కాక కుమార అనంతరాజుగారు శా. శ ౧౫౪౦ లో నీ పాడుపడినగోపురము నంటియున్న యొక గొప్ప మండపమును నిర్మించినాడు ఆ మండపములో ప్రాక్పశ్చిమదిగ్భిత్తులపై లోనైపున నొక * సీసమాలిక తెలుగుపిల్లిలోను, గ్రంథలిపిలోను చెక్కింపబడి యున్నది. అందు కుమారఅనంతుని దానాదికములు, పరాక్రమాదికములు పేర్కొనబడియున్నవి. అందలి విషయసంగ్రహము—

కుమార అనంతరాజు దేవచోడవంశస్థుడు. సూర్యవంశకలశాంబుధిచంద్రుడు. అహోబల శేషాచలపర్వతమధ్యప్రదేశ మాతని యేలుకడిలో నుండినది. పాలగిరి, అనిమల, పీలేరు, పప్పల్లి, వేముపలి మొదలగు స్థలముల నతడు చర్దివలె మహాభయంకరముగా బోరాడెను కొట్టాల, పాలకొండ, గుండ్లూరు, ముష్టూరు, కుటూళ్ళ కొల్వలయొద్ద శత్రువుల జించి చెండాడెను. ఉదయాచలాధీశ్వరస్వామి (ఉదయగిరి శ్రీరంగనాయకస్వామి) యితనికి నొక సామజధ్వజమును, డమాయిని నను గ్రహించి యొసగెను ఉదయాచలాధీశ్వరుని కితడొక యాఖేటమండపము, సుందరోద్యానమును నిర్మించెను తిరువళ్ళూరి.

శ్రీ వీరరాఘవస్వామి కొక వసంతమంటపమును నిర్మించెను. వెంకటాచలపతికి ఒక

* ఈ సీసమాలిక నేడు ముద్రితములయియున్న దేవస్థానశాసనసంపుటములయందు బ్రకటింపబడలేదు. కుమార అనంతరాజుగారి ప్రజాహితకార్యముల పేర్కొను నీ సీసమాలిక శీఘ్రముగా బ్రకటింపబడవలసియున్నది.

స్వర్ణాశ్వమును, గంధసింధురమును, సమరభూపాలవాహనమును, పద్మపీఠమును, రత్నాఢ్యముకుటమును, నైవేద్య భాజనమును బహూకరించెను మఱియు నితడు శ్రీ వేంకటేశ్వరస్వామి కొక యున్నత కేళీమండపమును, సోపానమార్గమును, నగ్రగోపురమును (దీనికే గాలిగోపుర మని పేరు,) నింకను ననేకనిర్మాణములను నిర్మించెను. తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామివారి కితడొక గజవాహనమును, తురగవాహనమును చేయించెను. తిరుపతినుండి తిరుమలకు బోవు సోపానమార్గములలో నొక చోట నితడు శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహమును ప్రతిష్ఠించెను. కడపమండలములోని నలందలూరి (నేడది నందలూరు) యందలి దేవాలయమునకు జుట్టువార నాలుగువైపులను నాలుగు గోపురములను, నొక నీరాళి మండపమును, నొక సుందరపుష్పోద్యానమును నిర్మింపజేసెను. ఒంటిమిట్ట రఘునాథస్వామి దేవాలయప్రాకారముల నంటి కొన్ని మండపములను, నా దేవాలయమున కుత్తరమునను, దక్షిణమునను రెండు పెద్ద గోపురములను నిర్మించుటయే గాక దేవాలయాంతర్భాగమున నొక క్రీడామండపమును గూడ నిర్మింపజేసినాడు. అచట నిత్యదీపార్చనా నైవేద్యాదికములకై చక్కని యేర్పాటుల గావించినాడు. తన తల్లి పేర చెన్నమాంబాపురము, చెన్నమాంబాసముద్రము నను రెండు గ్రామములను బ్రాహ్మణులకు సర్వాగ్రహారములుగా నొసగినాడు. సిద్ధవటములో జెన్నకేశవప్రతిష్ఠ గావించి, యా దేవాలయమునకు బ్రాకారగోపురాదుల నిర్మించి, యా దేవునికి నమూల్యస్వర్ణాభరణముల జేయించి కైంకర్యము చేసికొనినాడు. సిద్ధవటేశ్వరస్వామికి ఒక హాటకవృషభవాహనమును జేయించెను చంద్రగిరిలోని కపర్దీశ్వరస్వామిదేవాలయమునకు బ్రాకారము నిర్మించెను. పుష్పగిరిలోని ప్రసవాచలాధీశ్వలస్వామిదేవాలయము చుట్టువార ప్రాకారమును, గోపురమును నిర్మించి యందు ప్రతిసంవత్సరమును బ్రహ్మోత్సవములు జరగునటుల నేర్పాటులు గావించెను కడప (దేవునికడప) లోని వేంకటేశ్వరస్వామి దేవాలయమున కితడు ప్రాకారగోపురముల నిర్మించెను రాచవీడు (కడపమండలములోని రాయచోటి) వీరభద్రస్వామిదేవాలయమునకు రెండు గోపురముల గట్టించెను. తిరుపతిలో కపిలతీర్థమునందును, శేషాచలకురువ, సిద్ధవటము, ఒంటిమిట్ట, పుష్పగిరి, ఒళ్ళరపాడు, దువ్వూరు, గుండ్లూరు, పోరుమామిళుగ నెలవనూరు, ఉర్మిళ్ళ, అనంతరాజుపురము మొదలగు స్థలములయందును, నా సేతుశీతాచలము యాత్రార్థ మరుగు యాత్రికపథికుల కొఱకై యన్నసత్రరువుల గట్టించెను. బ్రాహ్మణుల కితడు రజత, సువర్ణ, తుల, మహీ, గోదానాది దశదానములను, వేలకొలది కన్యకాదానములను గావించి వారిని బరితృప్తుల గావించెను. వారును నీ దానాదికములచే నైశ్వర్యవంతులై యధ్వరాదికముల యథావిధిగా నిర్వర్తించుచుండిరి అనంతరాజపురములో నితడొక గోపురమును గట్టించెను. దాని రాజధానిగా జేసికొని యితడు సీమాపరిపాలనము గావించుచు, కటకపురీమారకారదిరుదవిభ్రాజితుడై ప్రతిసంవత్సరము వారణాసినుండి కొనితేబడుచున్న గంగానదీతోయములయందు స్నాన మాడుచుండెను చెయ్యేరుకడ నితడొక గొప్ప చెఱువును త్రవించెను మట్ల తిరువెంగళనాథరాజ, చెన్నమాంబాగర్భశుక్తిముక్తాఫల మనదగు నీ కుమారజఅనంతిరాజు శేషాచలపర్వతమునం దొక శ్రీపదమండపమును నిర్మించి యందు ఈశ్వరుని, బ్రహ్మదేవుని, సనకసనందనాదిమహర్షులను. దేవతలను నెలకొలిపి యాచంద్రతారార్కము సుప్రతిష్ఠితకీర్తివిభ్రాజితు డయ్యెను.—

కుమార అనంతరాజుగారు తమయెత్తు ద్రవ్యము తూచి యా ద్రవ్యమును బ్రాహ్మణులకు దానము చేసిరి. ఈ తులాభారదాన ప్రశంస వీరిమీది చాటువులలో జెక్కుచోట్ల గానవచ్చుచున్నది. వీరు శత్రువుల బలాయనము గావించి సీమ పరిపాలనము సేయుచుండగా వీరి సన్నిధానవర్తు లయిన కవీశ్వరులు వీరి నిట్లు శ్లాఘించిరి

*మాయురె! సద్గుణాభరణ!
మట్ల కుమార యనంత! శౌర్యధౌ
రేయుని నిన్ను నాజి నెది
రింపను శక్తులు గాక కైదువుల్
వేయని రాజులున్ శరణు
వేఁడని మన్నె కొమాళ్లు కానుకల్
సేయని శూర్లు మ్రొక్కని వ
జీరులు లేరు వసుంధరాస్థలిన్
మట్లవారిసీమకు జుట్టుపట్టుల నుండు

* ఈ పద్యము చాటుపద్యమణిమంజరి ప్రథమభాగములో బ్రకటింపబడినది. చూడుడు—65 పు,

యాంకరి బోయపాళేగాండ్రు కృత్రిమము చేసి సీమపెతూకి చేయవలయు నని యేకస్థై కలగడ, గుండ్లూరు, వేంపల్లి, అనిమెల, పాలగిరి, తంగేడుపల్లి, చెప్పల్లి, పిగిలేరు, కుమార్లకాల్వ, శెట్టిపల్లి, యీ స్థలముల యందు పాళెలు గూడి కుమార అనంత రాజు గారి తమ్ము లయిన యెల్లమరాజు గారిని 'వశీలా' చేసికొని కుమార అనంతరాజు గారి ప్రభుత్వానకు భంగము చేసి సీమ యరాచకము చేయవలయు నని యత్నము చేసిరి. అంతట నీ యర్థము కుమార అనంత రాజు గారికి తెలిసినందున ననుజన్ము లయిన యెల్లమరాజు గారిని పట్టి సిద్దవటములో ఖయిదు చేసి సైన్యమును తీసికొని లడాయి చేసి కలకడ తీసికొనిరి

ఇట్లు వీరు సిద్ధవటస్థాయిగా రాజ్య మేలుచున్న సమయమునందు ఖైదులో నున్న యీయన యనుజన్ములు యెల్లమరాజు గారు అన్నగారైన కుమార అనంతరాజు గారిపై కృతిగా నొక పద్యము చెప్పిరి.

కాంతిఁ మద్గుణదోషసంఘముల నెం త్రిం
చం బోకు కారుణ్య సం
క్రాంతస్వాంతమునఁ శుభాన్వితుని గా
గావించి పోషించు ధీ
మంతా! మట్ల కుమారనంత! నృపస
మ్యగ్వాక్ప్రసూనామణీ (పళీ?)
కాంతంబై తగు * నీయుదాహరణముఁ
గల్పించి పూరించితిఁ

ఈ ప్రకారము పద్యము చప్పభట్రాజు చేతి కిచ్చి తమ యన్నగారికి వినిపించ మనగా నా భట్రాజు కుమార అనంతరాజు గారికి ఈ కృతి వినిపించినంతట నాయన సంతోషించి, తమ్మునియందు వాత్సల్య ముదయించి, యెల్లమరాజు గారిని తమ సమ ఖానకు బిలిపించుకొని, యాదరించి వారికి మైలంపల్లె, పొందలూరు, గుండ్లూరు, ఓలం పాడు, రాయవరం—ఈ యయిదు గ్రామ ములను నమరముగా నొసంగిరి. యెల్లమ రాజు గారు ఆ యయిదు గ్రామములను తమ ఖుష్బ్రయములకుగాను ననుభవించుచుండిరి.

* మట్ల యెల్లమరాజు (కుమార అనంత రాజుతమ్ముడు) తన యగ్రసోదరునిపై నొక యుదాహరణమును రచించిన ట్లిం దున్నది. అందే పద్యము అంకితాంకపద్య మేమో! లేక యీయొక్క పద్యమునే యాతడు ఉదాహరణము (ప్రశంసాపద్యము) అని పేర్కొనెనా?

కుమార అనంతరాజు గారు తిరుమలస్థలమందు గోపురములు కట్టించిరి. అపుడు కవీశ్వరులు వారిని శ్లాఘన చేసెన పద్యములు—

వెంకటాచలమున వెలయ గోపురములు
పూని కట్టించిన పుణ్యు డితఁడు
వితతతులాభారవిత్తంబు ద్విజాలకు
దనరంగ నిచ్చిన ధన్యు డితడు
ప్రత్యర్థు లర్పించు బహుళారకటకముల్
భటకవీంద్రుల కిచ్చు భవ్యు డితడు
దొరమన్నె రాజులు పరదునేదార్లెంచ
రాయపట్టము నిల్పు రా జితండు
రాజదేవేంద్ర! విక్రమరాఘవేంద్రు
డనగ జను లెంచ మించితౌ నఖిలవిశల
వినుతగుణవంత! రిపుఖమ (?) విజయకుంత
మహితమహికాంత! మట్ల కుమారనంత!

కలకడపట్టణాక్రమదక్షణాశిల!
గుండ్లూరుసంగ్రహోకుంఠనిభవ!
వేముపల్లీపురవిజయధాటీదుర్వ!
అనిమెలపాల్గిరియరివిదార!
చెప్పలిశాత్రవసేనావిభంజన!
తంగేడుపల్లెసాధనసమగ్ర!
నైలేటికాటివోభవనగ్రజముపై?
అతులమామిళ్లకాల్వార్తివిజయ!
మాధవరవప్రసంహార! మహిమతేజ!
సెట్టివెలిసాలసాధన సిద్ధ శౌర్య!
ఉదయగిరిదుర్గనృపభయవిదళనేంద్ర!
మహితమహికాంత! మట్ల కుమారనంత!

మించి యుద్ధత గబళించెగా మత్తారి
వీరుల మెదడు గుండ్లూరియొద్ద
గమకించి తుమురుగా నమిలెగా శత్రుభూ
పతుల యెమ్ములను వేంపల్లెకడను
కృపలేక జుర్రెగా రిపురక్తము లని
మెలపాలగిరుల సమీపభూమి
కని బోక మెసవెగా గర్వితాహితమాంస
ఖండంబులు కుమార్లకాల్వచెంత
నీ కరణి గొన్నిక్రీడల గాక యిపుడు
తలప నటువంటి వేడ్కల దనివి బొంద
నేరదట! పెద్దదయ్యమా! నీ కరారి?
ఘోరజయవంత! మట్ల కుమారనంత?

ఇతని పరాక్రమాదికములను, దానాదిక ములను బెర్కొను మరికొన్ని చాటువు లివి-

నేత్రయుగ్మము మూలి నిర్జీవు లైనట్లు
యుర్వి సాగిలబడి యున్నవారు
యన్నంటి పడిసిన వికృతాననములచే
వెఱచి మ్రొక్కుచు బూరి గఱచువారు
దోపిచ్చి కుళ్లారి త్రోవలు గానక
దెసమొలచే జెడి తిరుగువారు
తలక్రొవ్వి దామర్ల ధర్మ్మండు తనయిడ్డ
ఒట్టార్చు నని తెగి తిట్టువారు
పట్టువడువారు, గాయాల బడినవారు
మెరలు బడువారు, ప్రాణముల్ విడుచువారు
నైరి వైరులు మట్లకుమారనంత
విభుని యెలగోలు మూకచే విఱిగినపుడు.

సాధించితివి మహాశ్చర్యంబుగాను సం
గ్రామదుర్జయశత్రుభూము లెల్ల
జేసితి దానముల్ భూసురప్రతతుల
కారూఢి దారిద్ర్యహతము గాగ
సమకూర్చితివి శేషశైలభర్తకు మహా
కైంకర్యవిధులు లోకములు బొగడ
బ్రబలించితివి దేవభవనభూముల ఘన
ప్రాకారగోపురోపవనసమితి
జెలగి పక్కవిదరు లెల్ల సీమదొరల
కెంత గలిగిన జెప్పదు రంతచేసి
నిజము వర్ణింప శక్యమె నీప్రతాప
మహిమధర్మంబు మట్ల కుమారనంత!

ఏ రాజు ముత్తాత ధారుణి గైకొనె
ధీరుడై తన కరారిమొనను
నే రాజుతాత దుర్వారదోర్బలశక్తి
వసుధలో రావిళ్లవారి గెలిచె
నే రాజునన్నయ్య శూరుడై నడచెను
ధాకుణీస్థలి దునేదార్ల మీఁద
నే రాజు తనకెందు నెదురులే కేలెను
గువలయంబున లోచకులము నెల్ల
నహుచు నీ భట్లు దిక్కుల వినుతి సేయ
నున్న మన్నీలు రాజులు నిన్ను గొలువ
నీకు శరణని ప్రాణముల్ నిలుపుకొనిరి
మట్ల తిరువేంగళేంద్ర కుమారనంత!

పదరి కుమారనంత! రణ
భార్గవ! నిన్నెదిరించుమాత్రకఁ
జెదరి తలుక్కునఁ జికిలి
చేసిన తావకఖడ్గరాజముఁ
గదనములోన దర్పణము
గా దలపోసిరొ కాక యుండిరఁ
మదవదరాతికోటులకు
మాటికి బండ్లిగిలించ నేటికిఁ

కొడిగ మింతె కాక తవ
కుఁ వయ సెక్కుడి దమ్మ! నేత్రముల్
వాడి గదమ్మ! పంట బగ
బట్టినవాడు సుధాధరంబు ము
ద్దాడు గదమ్మ! యీ నిసువు
కెక్కుడివల్పు లటమ్మ! యాడికల్
వేడుక లాయె మట్ల తిరు
వెంగళనాథు ననంత శౌరికిఁ.

(సశేషము)

రాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వము

(12 వ పేజీ తరువాయి)

నంచో ప్రజలను రక్షించాలి, రక్షించాలి అంటే?

కాంగ్రెసు సంస్థలోని ఈ భిన్నాభి ప్రాయాలు, పరస్పర దూషణ ఇవే ముఖ్యంగా అరాచకశక్తులు కాలు నిలదొక్కుకోటానికి అవకాశ మిస్తున్నయ్. దేశంలోని అరాచకానికి నైతికంగా కాంగ్రెసుకూడా బాధ్యత వహించాలి.

కాంగ్రెసుసేవాదళం యొక్క తోడ్పాటును ప్రభుత్వం ఉపయోగించు కోవట్లేదని రాష్ట్రకాంగ్రెసు ఫిర్యాదు కాంగ్రెసు సంఘాలు సహకరించట్లే దని ప్రభుత్వపు పితూరీ. దీనికి పరిష్కారమెట్లా? అఖిల భారతకాంగ్రెసుకార్యవర్గం, కేంద్ర ప్రభుత్వనాయకులు ఈ లోపాన్ని దిద్దాలి కాని సేవాదళాల మొత్తం సభ్యులు ఎంత మంది? ఏ, ఏగ్రామాల్లో సేవాదళాలు ఉన్నయ్? ఎన్ని గ్రామాల్లో స్థాపించారు? రక్షణ, ప్రతిఘటన విషయాల్లో ఈ దళాలకు ఇచ్చిన తరిఫీదు ఏమిటి? ఊరికే మల్లయుద్ధమేనా లేక, ప్రజలకు ప్రభోధం కలిగించే శిక్షణ ఏమైనా అలవడిందా? ఈ సేవాదళాలు అహోరాత్రాలు గ్రామాల్లో శిక్షిత, పౌరసైన్యంగా ప్రజల గౌరవాదరాలను అలదుకుంటూ, వారిసహకార, సహాయాలను పొందగలుగుతున్నారా? ఈ సేవాదళాలలో ఎటువంటివారిని సభ్యులుగా చేర్పిస్తున్నారు? ఈ సభ్యులు బరిసెలు వేసుకొని కమ్యూనిస్టులపై బడుటమేనా లేక పోలీసు శాఖతో క్రమబద్ధంగా సహకరిస్తున్నారా? ఈ విషయాలన్నీ అత్యవసరం మిగతాపార్టీల వాలంటీరుదళాలను రద్దుచేసి, ఒక్క కాంగ్రెసు సేవాదళానికే అనుమతినిచ్చారు ప్రభుత్వం. కాని కాంగ్రెసు సేవాదళ మెక్కడా తగిన శక్తిసామర్థ్యాలతో, చాతుర్యంతో పని చేస్తున్నట్టు కనబడదు.

నిష్పక్షపాతంగా విచారిస్తే, అక్కడక్కడ జరిగే పోలీసుఅత్యాచారాలకు కొంతవరకూ స్థానికకాంగ్రెసుసంఘాలు, వ్యక్తులు కారణం తమకయిష్టులైనవారిని కమ్యూనిస్టులని చెప్పి, పోలీసులలా కీలకు గురిచేస్తున్నారు. పోలీసులకు నిజానిజాలు తెలియడం కష్టం. కాని ఇందువల్ల ప్రభుత్వప్రతిష్ట దెబ్బతింటోంది ఈ సందర్భంలో ఇలాంటి అన్యాయ, అక్రమ, స్వార్థ ప్రయోజనాల కోసం పోలీసులను ఉపయోగించుకుంటున్న కాంగ్రెసువారికి తుపాకులిస్తే, పరిస్థితులు పూర్తిగా విషమించిపోతయ్. ఒక్క తుపాకేని చేతిలో పెట్టుకొని ఊరి నంతటినీ పాదాక్రాంతం చేసుకుంటారు వీరు వీరికి శాంతి భద్రతలు, ప్రజాస్వామ్యం లక్ష్యం కావు గ్రామాల్లో తమ పెత్తందారీ తనం చెలామణి కావాలి

ఈ విషయా లన్నీ తర్కిస్తే, కాంగ్రెసు సంఘాలమీద, సేవాదళాలమీద ఆధారపడి నందువల్ల పరిస్థితులు చక్కబడవు అనేది స్పష్టం.

కాంగ్రెసుసంఘాలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న అ-సహకారందృష్ట్యా, ప్రభుత్వం పార్టీప్రమేయం మరచి, యావత్తు ప్రజను (పార్టీ బిళ్లలను వాళ్ల చెళ్లకు తగిలించకుండా) కమ్యూనిస్టువ్యతిరేకఉద్యమంలో పాల్గొనేట్టు చేయాలి పార్టీ పేరు చెప్పితేకన్న, పార్టీల ప్రసక్తి లేకుండా, ఉమ్మడిగా ఆదుకోవాలి అంటే, ఇవ్వాళ ప్రజలకు నచ్చి, బరిలోకి దూకుతారు. ఎందుకంటే ప్రాంతీయకాంగ్రెసునాయకుల ప్రవర్తన, వ్యవహారాలు వీటి మూలంగా ప్రజలకు కాంగ్రెసంటే భయం ఎక్కువ అయి భక్తిగౌరవాలు తక్కువ అవుతున్నయ్. ఇలాంటప్పుడు స్థానిక కాంగ్రెసు నాయకుల ఆధ్వర్యం కింద ప్రజలు చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా పనిచేయలేరు

ఈ అయోమయంలో ఒకటే మార్గం. ప్రతి గ్రామంలో 100 కి పదిమంది చొప్పునైనా ఒక ప్రజారక్షకదళంగా (కాంగ్రెస్ దళంకాదు) ఏర్పడి, పార్టీరాజకీయాలకు తావివ్వకుండా, లారీ, బరిసె, తుపాకి ప్రయోగాల్లో తర్ఫీదు పొంది, కమ్యూనిస్టుల అక్రమదౌర్జన్యాన్ని ఎదుర్కొని, వారి హింసను హింసతో, ప్రబోధంతో నిర్మూలించగలిగేటట్టు చేయాలి ఈ పనికి ప్రభుత్వం పూనుకోవాలి. కమ్యూనిస్టుల విధానం ప్రభుత్వానికే కాదు, తమకే చేటు అను సక్రమఅభివృద్ధికి అనూతం తాము ప్రభుత్వానికిచ్చే పన్నుల్లో [illegible]

ఇప్పుడు కోట్లకొద్దీ పోలీసులకోసం ఖర్చవుతోంది ఈ అరాచకాన్ని నిర్మూలిస్తే ఈ డబ్బు రోడ్లకు, పాఠశాలలకు, వైద్యవసతులకు వినియోగపడుతుంది అనేభావం ప్రజల్లో నాటుకోవాలి ఇది ప్రభుత్వానికి కమ్యూనిస్టులకు మధ్య ఘర్షణకాదు. ప్రజలకు, కమ్యూనిస్టులకు మధ్య సంఘర్షణ అని ప్రజల్లో స్థిరపడాలి ఇప్పటి ప్రభుత్వ ప్రచారం గాని, కాంగ్రెసుప్రచారం గాని ప్రజల నీ విధంగా మేల్కొల్పలేక పోతున్నయ్. మేల్కొల్పలేవు ఇలా ప్రజలు కన్నుతెరచి, కదం తొక్కనంతవరకూ కమ్యూనిస్టుల అరాచకాన్ని సక్రమంగా, ప్రజాస్వామ్యంలో సమూలంగా నిర్మూలించటం దుస్సాధ్యం

పల్లెల్లోకి పోయి చూస్తే, నిజానికి ప్రజలకిలాంటి భావం లేదనిపిస్తుంది. ఏదో పోలీసులు, కమ్యూనిస్టులు కలబడి, చాటుమాటున కొట్టుకుంటున్నారని, ఉభయుల మధ్య తాము నలిగిపోతున్నామని గ్రామస్థుల భావం. అంతేకాని పోలీసులు మన రక్షకులు, ఈ అరాచకంమూలంగా మన ప్రజాస్వామిక స్వాతంత్ర్యమే హరించిపోతుంది మన సక్రమవికాసమే క్షీణిస్తుంది. అనేది వారికి తట్టటంలేదు.

కమ్యూనిస్టులకు, ఇతర పార్టీలవారికి ఇదే తేడా కమ్యూనిస్టులు పదిమందే అయినా, ఐక్యతతో పనిచేస్తారు. మిగతా వారు 90 మంది అయినా వారిలో ఐక్యత లేదు. వారికి ఒక కార్యక్రమమంటూ లేదు. చివరకు రంగంలో కొద్దిమందైన పదిమంది. ఎక్కువమందైన 90 మందిని జడిపించి గగ్గోలు చేస్తున్నారు.

ప్రభుత్వం ఇకనైనా ప్రజలతో కాంగ్రెసుసంఘాలద్వారానే కాకుండా, సూటిగా సంపర్కం కలిగించుకొని, గ్రామంలోని కులాల ప్రతినిధులందరిని ఒక సంఘంగా ఏర్పరచి, ఆ గ్రామ సంరక్షణబాధ్యత వారి నెత్తిన పెట్టి, వారికి, ఫిర్కా పోలీసు అధికార్లకు మధ్య సహకారం సిద్ధించేట్టు చూడాలి

గ్రామాల్లో పార్టీలంటె గౌరవం ఎలా

ఉన్నా, ఇంకా పెద్దమనుష్యులంటె ప్రజలకు మన్నన ఉంది గణ్యత ఉంది వారిని స్వేచ్ఛగా ప్రతినిధులను ఎంచుకోమంటే, ఎంచుకోగలరు వీరితో ప్రజారక్షకదళాన్ని ఏర్పాటుచేయవచ్చు శాసనసభకు, రాష్ట్ర కాంగ్రెసుసంఘాలకు చెందని కాంగ్రెసు ప్రముఖులు తగినంతమంది పల్లెప్రాంతాల్లో ఉన్నారు. వీరిపై ప్రజలకు గౌరవం ఇంకా పోలేదు ప్రజలు, వీరు కలసి సుశిక్షితంగా, సక్రమంగా, కాంగ్రెస్ అహింసా సంప్రదాయాన్ని మరచిపోకుండా, అరాచకశక్తులను ప్రతిఘటించ గలరు.

కాంగ్రెస్‌వారే కాక, పార్టీలకు చెందని వారు, సోషలిస్టుపార్టీవారు ఉన్నారు వీరందరి సహకారం ముఖ్యం అవివేకంగా, వీరినికూడా అనవసరంగా శాంతి భద్రతలవిషయంలో వ్యతిరేకం చేసుకోటం ప్రభుత్వపు పొరబాటు. కమ్యూనిస్టుల దౌర్జన్యాన్ని ఎదుర్కోటంలో సోషలిస్టులు, పార్టీలకు చెందని ఇతరులు ప్రభుత్వంతో ఏకమే. ఇతర విషయాల్లో భేదాభిప్రాయాలున్నా.

కాబట్టి ఇకనైనా రాష్ట్రప్రభుత్వం, రాష్ట్రకాంగ్రెసు పరస్పరవిరోధం మానుకొని, అనహయోద్యమం విడిచిపెట్టి, ప్రజలను మేల్కొల్పి, యావత్తుప్రజయొక్క సహకార, సహాయాలను, అన్నిపార్టీల తోడ్పాటును, పార్టీలకు చెందని ప్రముఖవ్యక్తుల సహాయాన్ని అర్థించి, గ్రామగ్రామాన ప్రజారక్షక దళాలను ఏర్పరచి, సుశిక్షితంచేసి, కమ్యూనిస్టువ్యతిరేక ప్రజాపౌర సైన్యాన్ని తయారుచేయాలి అరాచకశక్తులను ప్రజలే ఎదుర్కొనగలిగినప్పుడే, ప్రజాస్వామ్యం సుస్థిరం కాగలదు.

సంగీతము

(29-వ పేజీ తరువాయి)

తెలిసికొనినచో మన "మహాభారతమందలి శ్లోకములు, పద్యములును, ఇంకను తేవారములు మొదలగునవి (కొన్ని మన దేశరచనలు) వారివారి దేశభాషలలో తాటియాకులు మొదలగు పత్రములపై వ్రాయబడి సేకరించబడియుండె అట్టివాటిని కొన్ని సమయములయందు అచ్చటివారు పాడుచుండుట ఆచారము గలదనియు, ఆ సందర్భములో అట్టి వివరములను మనవారు తెలిసికొని రాదగు ననియు, ప్రభుత్వమువారు కూడ నిందుకు తగు తోడ్పాటొనరించుట తగుననియును" చెప్పియుండిరి. (26-12-49) తేదీగల "హిందూ" పత్రికయందు 5 వ పేజీలోని వీరి ఉపన్యాసభాగమును చూడదగును)

ఇట్టి సందర్భములనన్నిటిని పురస్కరించుకొని మనము జాగ్రత్తగా విమర్శించి తెలిసికొనినచో "హైందవ సంగీతము" (*Indian Music*) యొక్క ప్రాశస్త్యము బాగుగా బోధపడగలదు. పూర్వము త్యాగరాజు దీక్షితార్, శ్యామశాస్త్రి మొదలగు కర్ణాటక గాయకోత్తముల కాలమునుండియును దక్షిణ, ఉత్తరదేశములయందుండెడి ప్రముఖగాయకులందరును ఎట్టి భేదభావములు లేక ఒకరికొకరు అన్యోన్యసహకారగౌరవముల నిచ్చుచూ పుచ్చుకొనుచు, హిందూసంగీతకళను మహోత్కృష్టస్థితికి తీసికొనివచ్చియుండిరి ఇందుకు అనేకచారిత్ర దృష్టాంతములు గలవు. అక్బరుచక్రవర్తియొక్క ఆస్థానగాయకుడగు "తాన్‌సేన్"కు గురువు "హరిదాసస్వామి" యనువారు. ఇతడు దాక్షిణాత్యుడే ఇంక ఎందరో దాక్షిణాత్య గాయకశ్రేష్ఠులు ఉత్తరదేశసంస్థానముల యందు ఆస్థానగాయకులుగా నుండి గౌరవముల నందియుండిరి అట్టివారు ఉభయవిధానములయందు కూడను చాల నేర్పరులై యుండెడివారని తెలియుచున్నది కనుక ప్రస్తుతమున కూడ ఉభయప్రాంతీయ విద్వాంసులు, సంగీతాభిలాషులు కూడను అన్యోన్యసహకారములతో ఆ యావిధానములయందలి ప్రముఖులగు గాయకులచేత కచేరీలను, పరిషత్తులను జరిపించుచు ఉభయవిధానములకు తగు ప్రోత్సాహగౌరవముల నిచ్చుచు హిందూదేశసంగీతకళను ఆచంద్రతారాయిగా నభివృద్ధి నొందించుటకై ప్రయత్నించుట అవసరము.

కూపర్ కళాశాల

(18 వ పేజీ తరువాయి)

20 000 డాలర్ల జీతం ఇస్తున్నారు' అంటూ ఉపాధ్యాయుడు అతనికి చెప్పాడు.

కూపర్ తన సంస్థను కేవలం విద్యార్థులకే కాక, వయోజనులకు విజ్ఞానబోధ కల్గించేందుకు కూడా ఉద్దేశించాడు. ఈ కళాశాల హాలులో, ప్రజలకు అనేక విషయాలమీద పెద్దలచేత ఉపన్యాసాలు ఇప్పించేవారు. ప్రజలు కిక్కిరిసి వచ్చేవారు.

రాబర్టు ఇంగర్సాల్, జాన్ టిండల్, మార్కు ట్వెయిన్, విల్సన్ అధ్యక్షుడు మొదలైనవారంతా ఉపన్యాసాలు ఇచ్చారు. విల్సన్ అధ్యక్షుడు ఇక్కడ ఉపన్యసిస్తుంటే అతను అనుకోనంతగా ప్రశ్నల వర్షం ప్రజలనుంచి అతనిపై కురిసింది. అక్కడున్న విజ్ఞానం స్థాయి ఆశ్చర్యపడ్డాడు. అల్లా తెలిసినవాళ్ల మధ్య ఉపన్యసించటానికి ముగ్ధుడయ్యాడు. బెర్ట్రాండ్ రస్సెల్, మొదలైన వేదాంతులు, అమెరికా ఐరోపా రాజకీయవేత్తలు అనేకమంది ఇక్కడ ఉపన్యాసం ఇయ్యటం ఒక అదృష్టముగా భావించేవారు

సంస్థకు కావలసిన ధనం చాలామటుకు పీటర్ కూపరే, సమకూర్చిపెట్టి, ధర్మకర్తలను ఏర్పరిచాడు. చదువుకొని బైటపడిన విద్యార్థులు కూడా చాలామంది సంస్థకు మళ్ళీ తమ శాయశక్తులా ధనసహాయం చేస్తూనే వచ్చారు సంస్థను వృద్ధిచేద్దామని తద్వారా తన కృతజ్ఞను చూపించుకొందామనీ అక్కడ చదివిన ప్రతివిద్యార్థిలోనూ ఆజన్మాంతమైన అభిలాష ఉంటూనే ఉంటుంది. ఆ అభిలాషకు ప్రత్యక్షధనరూపం ఇచ్చి సంస్థను వృద్ధిచేసిన పూర్వవిద్యార్థులూ, అనేకులున్నారు.

కులాసా కబుర్లు

(26-పేజీ తరువాయి)

కాలేజీలోనూ సమానంగా చదువుకున్నాం. చాలారోజులు ఒకేగదిలో ఉండేవాళ్ళం కూడా చాలా మారిపోయాడు పాపం. నన్ను మొదట గుర్తుపట్టలేకపోయాడు. "కొంచెం ఒళ్ళుచేసినట్లున్నావే" అన్నాడు

"అబ్బే, ఈ రోజుల్లో ఆహారం సరైనది సమకూడటం లేదు. ఒళ్ళు కొంచెం గుల్ల బారింది"

"కాదోయ్ ఒళ్ళు నున్నబడింది కూడా."

"ఆ. దానికేం గాని మనం ఎన్నాళ్ళయింది కలుసుకుని? చాలా ఏళ్ళయినట్లుంది?"

"ప్రిన్స్ఆఫ్ వేల్స్ వచ్చిన రోజుల్లో కాబోలు."

"అబ్బే ఉప్పుసత్యాగ్రహంలో ననుకుంటాను ఒక సభలో అకస్మాత్తుగా కలుసుకొన్నాం"

"అదేలే. దానికీ దీనికీ అట్టే రోజులు తేడా లేదు."

"నీకు జ్ఞాపకం ఉందో లేదో! మనం చదువుకునే రోజుల్లో ఈ చుట్టుపక్కల పెద్ద అడివి ఉండేది. ఇప్పుడంతా కొట్టేశారు."

జేబులోంచి పొగాకు తీశాను రెండు చుట్టలు చుట్టాను. ఒకటి వెంకట్రామయ్య కిచ్చి రెండోది నేను ముట్టించాను.

"హు. పొగాకులో కమ్మని రుచి చచ్చిపోయింది. వొట్టి గడ్డిలావుంది. గట్టిగా పీలిస్తే దగ్గొస్తుంది. ఆ రోజుల్లో ఎంత" కమ్మగా ఉండేది.

"అవును. ఇప్పుడు మందులు పోసి తగలేసి పెంచుతున్నారు. ఇంకెల్లా ఉంటుంది మరీ."

"అప్పుడు క్లాసు ఎగవేసి వచ్చి గ్రౌండ్‌లో చెట్టుకిందకూచుని దమ్ములు లాగేవాళ్లం జ్ఞాపకంఉందా. ఒకసారి, చుట్ట ఇంకోటి లేక, ఉన్న ఒక్కటే ఇద్దరం పీల్చాం"

"ఆ, ఆ జ్ఞాపకమే. అవధానిమాష్టారు దాచుకున్న పొగాకు కొట్టేశాం కూడా. ఆయన అప్పటికే చాలా పెద్దవాడు"

"అయితేం, ఎల్లా ఉండేవాడు. పిడుగులాగుండేవాడు చూస్తుండగా ఒక్క పప్పుతో తప్పెడు నెయ్యిపుఅన్నం తినేసేవాడు. అరోజులు వేరు. ఇప్పుడేది తిన్నా అరగడం లేదు. అక్కడికీ గోధుమజావ ఆరంభించాను. కొంచెం మేలేకాని ఎలాగైనా సరిపడలేదు."

"అవు నవును. చెప్పావుగా ఇప్పుడే"

"చెప్పానేమిటి?"

"ఛ, ఈపొగాకు బొత్తిగా రుచిగా లేదు. వెధవచుట్ట, పారెయ్యలేక కాల్చడం కాని."

"అవునవును. నువ్విందాకా అన్నట్టుగా"

"ఇందాకా అన్నానేమిటి? కాబోలు."

పాపం వెంకట్రామయ్యకూడా సత్తువ ఉడిగిపోయింది మీసాలు తెలా పండిపోయాయి ఏదో అలా అద్దం ముందు నుంచి వెడుతూ ఒక్కసారి చూశాను. ఏమిటో అద్దాలూ మారిపోయాయి. సరిగ్గా కనపడవ్ ఇప్పుడు కనపడినా అంతా అదోకలా వుంటుంది. రూపం సవ్యంగా కనపడదు. అద్దాలు మంచివి కావు.

[కొలియర్స్‌పత్రికలో ఒక వ్యాసం ఆధారం]

నేటి ప్రపంచం

(8 వ-పేజీ తరువాయి)

చేతికి చిక్కిన అరబ్బీ పాలస్తీనాప్రాంతాన్నంతనీ జోర్డన్‌రాజు తన రాజ్యంలో కలుపుకున్నాడు. అరబ్బీ పాలస్తీనా ప్రాంతాన్ని గ్రాండ్‌ముఫ్తీ ఆధ్వర్యంక్రింద ప్రత్యేకరాజ్యంగా నిర్మించాలని ఈజిప్ట్ తలపెట్టిన యత్నం విఫలమయింది

అయితే తీరప్రాంతం దక్కకుండా, సిరియా ఇరాక్‌ల ఐక్యత సమకూరకుండా ఈజిప్ట్ చెయ్యగలిగింది. ఎలాగైనా తీరప్రాంతాన్ని సాధించాలనే తలపుతో జోర్డన్‌రాజు యూదురాజ్యం (ఇజ్రాయల్)తో రహస్యంగా సంధిమంతనాలు సాగించాడు. ఈ మంతనాల్ని నిరోధించడానికిగాను ఈజిప్ట్‌దేశరక్షణసహకార సంధి అవకాశాన్ని పురస్కరించుకుని జోర్డన్‌రాజును బెదిరించింది. అమెరికా ఒత్తిడివల్ల సైనికసంధియత్నాలకు మిగతా అరబ్బీదేశాలన్నీ, అనగా ఈజిప్ట్, సాదీ అరేబియా, ఇరాక్, సిరియా, లెబనన్, యెమెన్‌రాజ్యాలు సమ్మతించాయి. ఈ అవకాశం తీసుకుని, ఇజ్రాయల్‌తో కలిసి కట్టుగా కాకుండా స్వయంగా సమాలోచనలు సాగించే అరబ్బీరాజ్యాల్ని అరబ్బీ రాజ్య సమితినుంచి వెళ్ళగొట్టాలని ఈజిప్ సమితిలో సూచించింది. దీనికిసమితిరాజ్యాలన్నీ అంగీకరించాయి జోర్డన్‌రాజు తన తమ్ముని కుమారుడు ఇరాక్‌రాజు కూడా సమితితో చేరినందువల్లనూ, తనరాజ్యంలో మంత్రివర్గం పతనమైనందువల్లనూ లొంగివచ్చాడు. అయితే ఇందులో ఒక స్వార్థం కూడా లేకపోలేదు. సమితితో ఇప్పుడు సఖ్యతచేసుకుంటే తానాక్రమించిన అరబ్బీపాలస్తీనాప్రాంతాన్ని తన అధీనంలోనే ఉంచుకోవచ్చును. త్వరలోనే ఈప్రాంతంలోనూ తనరాజ్యంలోనూ కలిపి ఎన్నికలు జరపడానికి అబ్దుల్లా నిర్ణయించాడు సమితికార్యక్రమంలో మొదట చేరకపోయినా తరవాత చేరాడు. తాను ఇజ్రాయల్‌తో రహస్యసమాలోచనలు సాగించడం లేదని చెప్పాడు.

జోర్డన్ మొదట చేరనందువల్ల అరబ్బీ పాలస్తీనాప్రతినిధి నొకనిని సమితిలో ప్రవేశపెట్టారు ఈవిషయమై ప్రస్తుతానికి జోర్డన్‌రాజు అభ్యంతరం చెప్పలేదు.

జెరూసలెం భవిష్యన్నిర్ణయంలో కొన్ని షరతులపైన ఐక్యరాజ్యసమితివారి తీర్మానాన్ని (అనగా అంతర్జాతీయాధికార స్థాపనకు) అరబ్బీరాజ్యసమితి అంగీకరించింది.

అమెరికాప్రోత్సాహం పైన సైనికసహకారసంధికి కూడా సమితి ఒక పత్రాన్ని తయారుచేసింది. త్వరలో ఇది అంగీకరించబడవచ్చును ఈ సంధిప్రకారం ఏ ఒక రాజ్యానికి ప్రమాదం సంభవించినా మిగతా రాజ్యాలన్నీ సైనికఆర్థికసహాయాల నివ్వగలవు

అయితే అరబ్బీరాజ్యసమితి అమెరికా కోరిన సంధిని ద్వితీయంగా పరిగణించి, ఇజ్రాయల్‌సమస్యను ప్రధానంగా పరిగణించింది ఇజ్రాయల్‌తో సంధికి అరబ్బీ రాజ్యాలన్నీ కలిసి కట్టుగా పనిచెయ్యాలన్నారు. ఇజ్రాయల్‌పైన ఆర్థికనిర్బంధాలు ప్రయోగించడానికి తీర్మానించారు

కాబట్టి ఇజ్రాయల్‌తో వ్యవహారాలు ఎలా నడుస్తాయో, ఆ వ్యవహారాలలో అరబ్బీరాజ్యాలు, ముఖ్యంగా జోర్డన్‌రాజు అబ్దుల్లా, ఏ రీతిగా వ్యవహరిస్తారో వానిని బట్టే ఈ సైనికసంధి గట్టిదో ఓటిదో రుజువౌతుంది.

[సూర్యనారాయణ]

ఆంధ్రదేశము, నైజామున్ను, బెంగుళూరు, మైసూరు, మద్రాసులందంతటను
క్రిక్కిరిసిన ప్రేక్షకులకు ప్రదర్శింపబడుచున్నది



సులోచన

(7 పేజీ తరువాయి)

లాగు ఇదేదో రాక్షసమాయే అయివుంటుంది. అమ్మా నీ కళ్లలో ఏదో ఇంద్రజాల ముంది. మాయలో పడి పాతాళ మన్న భయంతో మేమేదో ఘోరం చేసేట్లున్నాము, వెళ్లిపో అమ్మా.

సులో నాయనా ఇంత శాంతంగా నెమ్మదిగా చెప్పే తండ్రివి నువ్వు నాకెందుకు ఘోరం తలపెట్టావు? తలపెట్టవు. నాకేమీ వద్దు నన్ను శ్రీరామలక్ష్మణుల వద్దకు తీసుకెళ్లండి.

సుషే ఊహూ! వీల్లేదు

సులో నాయనా ఇటు చూడు

సుషే చూడకు అంగదా చూడకు నాలాగే కళ్లుమూసుకో.

సులో నాయనలారా మీకు కృతజ్ఞురాలనై ఉంటాను. నా నాధునిదగ్గిరకు వెళ్ళనియ్యండి. (ముందు అడుగులేస్తూ వెళ్లిపోతుంది)

అంగదుడు నే కళ్లు తెరిచే లోపలే వెనక్కి వెళ్లిపో అమ్మయ్య అడుగులు వెనక్కి వేసినట్లుంది సుషేణా!

సుషే ఏదీ అంగదా ఆమె ఏదీ. వెనక్కి వెళ్లినట్లు లేదే?

అంగదుడు ఆఁ, ఆఁ, అదిగో ఇంద్రజిత్తు కళేబరాన్నుంచిన శిబిరంలోకే వెళ్తూంది. ఇది తప్పకుండా రాక్షసమాయే పద సుషేణా ముందు పద (గట్టిగా) ఓహో, హనుమంతా! విభీషణా! రాక్షసమాయ! జాగ్రత్త! జాగ్రత్త! పరిగెత్తు సుషేణా పరిగెత్తు ముందు ఆమెను ఆపాలి సామాన్యులెవరూ ఆమెను ఆపలేరు (శిబిరాలకేసి పరుగెత్తుతారు)

3-వ రంగము

రామలక్ష్మణులు—

రామ. లక్ష్మణా, జీవి దేహంవున్నంత వరకూ ఎంత బాధపడాలో ఏమో! ఆనాడు తటకప్రాణవిహ్వలమైన కన్నారా చూశాను ఈనాడీ ఇంద్రజిత్తుని మళ్లీ చూస్తున్నాను ఈ ప్రాణ ఈ దేహాన్ని ఇంత ఎందుకు అలయించాలో?

లక్ష్మ అన్నా, ప్రాణనిగ్రహమనంలోనే ఉందా బాధంతా?

రామ కాదయ్యా, కాదు దేహంలోనే ఉంది మనస్సులోనే ఉంది

లక్ష్మ ఇంద్రజిత్తు దేహంవద్ద ఎవరు కాపలా ఉన్నారు

రామ. హనుమ ఉన్నాడనుకొంటాను. అయినా ఆ శరీరాన్ని రావణుడికి పంపించి వేద్దామా?

లక్ష్మ. విభీషణుడు వద్దన్నారు.

రామ దేనికో

(నేపథ్యంలో అంగదునికేక) రామ లక్ష్మణదేవులారా జాగ్రత్త, ఆ స్త్రీని చూడకండి

రామ ఎవరు! ఆ స్త్రీ ఎవరు!

లక్ష్మ ఎవరు, మళ్లీ ఇంకో మాయాసీత కాదు కదా.

రామ అబ్బా, ఆ ఘట్టం జ్ఞప్తికి తేవద్దు లక్ష్మణా! గుండె ఇంకా దడదడ లాడుతుంది.

లక్ష్మ కాక రావణుడే ఇంద్రజిత్తు చావుతో బుద్ధి తెచ్చుకొని సీతామహాదేవిని పంపివేయలేదు కదా. అంతటి మహాతేజంతో మన సైన్యాన్ని విభ్రమభయాలలో ముంచెత్తగల తేజోవంతురాలు ఆ దేవి కాక మరెవరుంటారు?

రామ (నిట్టూర్చి) లక్ష్మణా, అడియాసలు పెట్టుకోకు రావణుని నీ వెరగవా, నేనెరగనా!

(సులోచన ప్రవేశించి)

సులో శ్రీరామచంద్ర, లక్ష్మణదేవులనుకొంటాను! తండ్రులారా నమస్కారములు.

రామ (దిగ్గునలేచి) ఎవరమ్మా మీరు? ఈ సైన్యాన్ని, యుద్ధరంగాన్ని, చీల్చుకొని అర్ధరాత్రి మెరుపుతీగలాగా ఇల్లా వచ్చారు. మీరెవరో నాకు చూస్తుంటే మా తల్లిలాగున్నారు మేము నీ బిడ్డలం, తల్లీ నమస్కారం ఎవరమ్మా నువ్వు?

సులో అయ్యా, లక్ష్మణదేవా లోకవ్యవహారంలో మీరు నాకంటే చిన్నలే కాని నాకు జనకసమానలని జనకులైన ఆదిశేషుల అవతారమనీ నా భర్త స్మృతితోనే గ్రహించాను,

లక్ష్మణు మీ నాథు డెవరు?

సులో రామచంద్రా. ఆర్తత్రాణుడవని పేరు కాని నేను భిక్ష వేడను. ఒక్క న్యాయమైన కోరిక కోర్తాను అది ఒకటె చెల్లించండి.

రామ అమ్మా నీవు ఇంద్రజిత్తు భార్యవా!

లక్ష్మ ఆహా! విధివైపరీత్యము. ప్రళయాగ్ని భయంకరలోచనుడైన పురుషునికి సర్వలోకాతీత ప్రసన్నమయ లోచన, సౌభాగ్యవతీలలామ, భార్య! అమ్మా! నీవు రూపాన నా తల్లిలాగున్నావు మనస్సుకు కుమార్తెవనిపిస్తున్నావు నీ భర్తను చంపిన ఘోరానికి నేనే బాధ్యుడను.

సులో తండ్రీ నువ్వు నిజంగా తండ్రివే ఆదిశేషుని అవతారమవు. కాకుంటే నా భర్త నీచేత నేల బడడు.

రామ అమ్మాయీ ఏమి కోరుకుంటావో కోరుకో అమ్మా నీ భర్త ప్రాణాలనైనా నీ కిప్పిస్తాను.

అంగదుడు రామచంద్రా జాగ్రత ఈమె స్త్రీ కాదు రాక్షసమాయ మాయాసీతను మరచిపోవద్దు.

సుషే శ్రీరామచంద్రా! విభీషణులు మిమ్మ మరీమరీ హెచ్చరించమన్నారు రావణాంతఃపురాంగన లెవరూ ఇటు రారని ఆయన చెప్పారు ఈమె ఇంద్రజిత్తు భార్య కాదు అసలు నిజంగా మాయ తప్ప దేహి కానే కాదు.

రామ సుషేణా! మాయే అయితే ఇంత సైన్యాన్ని చీల్చుకొని చెక్కుచెదరకుండా వచ్చిన ఈమె ఇంద్రజిత్తు దేహం వద్దకు ఎందుకు వెళ్లలేకపోయింది?

సుషేణ అక్కడ హనుమ కాపలా ఉన్నాడు.

రామ అయితే?

అంగ రామచంద్రా. మీవంటి శరణాగతత్రాణులే కాదు ఎంతటి సామాన్యులూ కూడా ఆమె కంటిచూపున బడి, ఆమె మాట వింటే, ఆమెను నిరోధించగల త్రాణ లేకుండా నిర్వీర్యులై పోతున్నారు.

రామ ఓహో, ఏమి మహిమాస్పద మూర్తి! మరి హనుమ నెందుకు జయించలేకపోయింది?

సుషే హనుమ ఆమెను చూడకుండా దేహం వెంచేసి, కన్నులు చెవులు మూసేసుకొని రామనామస్మరణ చేసికొంటూ, ఆమె మాటను చూపునూ కూడా చెవికి కంటికి ఎక్కనీయలేదు. మాకు ఆ ఏకాగ్రత లేక జారిపోతూ వచ్చాము

రామ అంగదా హనుమను ఇంద్రజిత్తు దేహాన్ని ఇక్కడికి తీసికొనిరమ్మని చెప్పు.

(అంగదుడు సుషేణుడు వెళ్తారు.)

సులో రామచంద్రా ధన్యోస్మి

సుషే (ప్రవేశించి) శ్రీరామచంద్రా విభీషణులొక్కమాట చెప్ప మన్నారు శరణాగతరక్షకబిరుదంకోసం ఇంద్రజిత్తు ప్రాణాలను ఇప్పుడు ఈమెకు వరంగా ఇస్తే, మళ్ళీ నరవానరులు కాదు, దేవతలైనా, ఇంద్రజిత్తును జయించలేరనీ, మనసేన సర్వనాశనం కాక తప్పదనీ, చెప్పమన్నారు

లక్ష్మ (చిరాకుతో) సుషేణా! శ్రీరాములను భయపెట్టడం, రావణుడికే చేతకాలేదు తెనవు కాతుందని విభీషణులవకో నక్కరలేదని చెప్పు

సు. స్వామీ కోపించవద్దు పెద్దవారి సముస్యలు వేరు! బంటుతనపువారి బాధలు వేరు

అంగదుడు శ్రీరామచంద్రా, హనుమకు నామాట వినపడటంలేదు

రామ (గట్టిగా) హనుమా!

హనుమ (నేపథ్యంలో) ఆఁ! స్వామీ! రామచంద్రా

రామ ఇంద్రజిత్తు నిటు తీసికొని రావన్నా

సుషే స్వామీ ఈమె ఇంద్రజిత్తు భార్య అని ఋజువేమిటి? ఈమె పతి ప్రాణాలు భిక్షఅడిగితే?

సులో వానరవీరా నీకా భయంవద్దు నా పతిప్రాణాల భిక్షఅడిగి పౌలస్త్య వంశాని కగౌరవం కల్పించటానికి నేను రాలేదు.

అంగదుడు : (ప్రవేశించి) స్వామీ, హనుమ ఆ దేహాన్ని శిబిరద్వారంలో ఉంచాడు. అదుగో.

రామ : సుషేణా, అతనిలో ప్రాణం ఉందా. నీ వైద్యంతో బ్రతికించగలవా?

సుషే : స్వామీ నేను అల్పుడను. ఏమి చెప్పను.

సులో : శ్రీరామచంద్రా, ఆ పీనుగుకి ఇష్టంలేని పనిచెప్పి వారిని అలయించకండి.

అంగదుడు : అసలీమె ఇంద్రజిత్తు భార్య అని ఋజువు ఏమిటి?

సులో : తండ్రీ లక్ష్మణదేవా! నీవు ఆ విషయం నమ్మగలవా?

లక్ష్మణ : ఔనమ్మా. నీవాక్కు అబద్ధం కాదు.

సులో : రామచంద్రా.

రామ : దీనికి ఋజువక్కరలేదమ్మా.

సులో : ఓహో స్వామీ! ఔనని చెప్పలేదు. ఔను! మీరు నమ్మినా లోకం నమ్మవద్దా! సుషేణా వీరిలో ప్రాణం లేదని కదా నీవనేది

సుషే వైద్యశాస్త్రం ప్రకారం అస్థిగతంగా కూడా ప్రాణం మిగలలేదు

సులో ఆ స్థిలో ఇంద్రియ సంచలనం రాగల పరిస్థితి ఉండదుగదా

సుషే ఉండదు దేవీ

రామ అమ్మా నేను ఋజువు అడుగుట లేదు నీ పతి ప్రాణాలు నవ్వు కోరుకొన్నా ఇస్తాను చెప్పు

సులో కాదు తండ్రీ కోరను కాని వానరవీరులారా ఈ పడిపోయిన నా పతి దేహం నా కోసం కంప్రాణం అట్టే పెట్టుకొని ఉంది ఇదగో ఋజువు చూడండి (గట్టిగా) ప్రాణపతీ, ప్రాణపతీ, రావణేశ్వరకుమారా — నేను సులోచనను నీ ప్రాణపతిని నీతో వచ్చేందుకు నాకు అనుజ్ఞ ఇయ్యండి ప్రభూ పలకవా?

దేహ (సన్నగా) ప్రియసఖీ సులోచనా! రా! నా వెంటరా

అంగ ఆఁ! ఆఁ! మోసం కళేబరం కన్నులు తెరచి చూచింది పెదవులు అల్లాడాయి స్వామీ రామచంద్రా! ఇది రాక్షసమాయ నమ్మకండి ఈ స్త్రీని వదలకండి (గట్టిగా) హనుమా! రామలక్ష్మణులను భద్రం చెయ్యి! విభీషణా! నీలా జాంబవాన్.

రాము అంగదా భయంలేదు

సులో నిజం స్వామీ భయం లేదు నా పతివల్ల మీ కెవరికీ భయం లేదు స్వామీ రామచంద్రా నా పతితో సహగమనానికి అనుమతియ్యి నన్ను దీవించు

రామ సౌభాగ్యవతీ భవ

వానరులు (హాహాకారంతో) ఆ ఆ ఇంద్రజిత్తు బ్రతుకుతాడు


సులో భయం లేదు ప్రాణపతీ, మేఘనాథా ఇదిగో నా కన్నులనుంచే యోగాగ్ని ప్రజ్వరిల్ల చేస్తున్నాను ఈ అగ్నిలో ఇద్దరం శివసాయుజ్యమందుతాము ఓం, ఓం, ఓం (అని జపిస్తుండగా యోగాగ్నిలో ఇద్దరి దేహాలు మునిగిపోతాయి)

వాన అహ్హా ఏమి కంట! రామచంద్రా రక్షించు ఈ వెలుగు, వేడి, భరించలేము ఓహోహో

లక్ష్మ ఓహోహో! ఏమి సౌభాగ్యం తల్లీ నిజంగా నీవు సౌభాగ్యవతివి పతికి నీతో శివసాయుజ్యం కల్పించగలిగావు ఆహా జవితాగ్ని చల్లారిపోయింది వానరులారా! తేజం ఉపసంహరింపబడింది భయంలేదు కళ్లు తెరవండి అన్నా సంతాన మెరుగని నాకు ఈమె నిజంగా కుమార్తె అనిపించింది

రామ ధన్యజీవివి సులోచనా

శ్రీ ఎ. ఎ. ప్రసాదరావు.



పాక్ ప్రధాని లియాకత్ అలీఖాన్ 2వ తేదీన ఢిల్లీ వచ్చినప్పుడు భారతప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్ ఆయన్ను ప్రభుత్వభవనంలో కలుసుకున్నారు.

మనదేశం

(4-వ పేజీ తరువాయి)

పెట్టడానికి వీలుందని స్పీకర్ సూచించారు వెంటనే ప్రకాశంగారు అటువంటి తీర్మానం ప్రతిపాదించడానికి నోటీసు ఇచ్చారు

శాసనసభ కాంగ్రెస్ పార్టీ నియమాల ననుసరించి ఇటువంటి ప్రతిపాదనల్ని శాసనసభలో పెట్టేముందు పార్టీ అనుమతిని కాంగ్రెస్ సభ్యులు పొందాలి కాని ప్రకాశంగారు అలా అనుమతి పొందలేదు. అంతేకాకుండా పార్టీ సమైక్యతా సూత్రాలకు విరుద్ధంగా ప్రకాశంగారు పదిహేను మందిసహచరులతోసహా ప్రత్యేకవర్గంగా శాసనసభలో కూర్చుంటున్నారు.

పార్టీ నియమాల నీరీతిగా అతిక్రమించినందువల్ల ప్రకాశంగారిపైనా వారి సహచరులపైనా క్రమశిక్షణచర్య తీసుకోవాలని కాంగ్రెస్ కార్యవర్గం తీర్మానించింది

శ్రీ శంకర్రావుదేవ్ గారి చర్యనోటీసులకు శ్రీ ప్రకాశంగారు సమాధానమిస్తూ, పరిపాలనానిర్వహణ సక్రమంగా జరగడానికి శాసనసభ్యుల కివ్వబడిన హక్కుల్ని పార్టీ నియమాలు పరిమితం చెయ్యరాదనీ, చర్య తీసుకునేముందు కేంద్రకాంగ్రెస్ కార్యవర్గంవారు ప్రత్యక్షంగా తమ వాదాన్ని తెలుసుకోడం న్యాయమనీ వ్రాశారు అలిండియా కాంగ్రెస్ కమిటీలో తాము ప్రతిపాదించనున్న తీర్మానఫలితం తేలకముందు కార్యవర్గం తమపైన చర్య తీసుకోవడం ఉచితం కాదన్నారు ఇది కేసులో ఆరంభవిచారణ జరక్కుండానే అప్పీలు కోర్టువారు తీర్పుచెప్పినట్లు ఉందని ప్రకాశంగారన్నారు.

కాంగ్రెసు సంస్థకి ముప్పు *

ఈ సందర్భంలో గమనార్హమైన కొన్ని విషయాలున్నాయి. ప్రకాశంగారిపైన ఇప్పుడు చర్యతీసుకోవడం సులువుగానే కనిపించవచ్చును. కాని రాగల ఫలితాల్ని గురించి యోచిస్తే కేంద్రకాంగ్రెస్ కార్యవర్గంగాని చెన్నరాష్ట్రశాసనసభ కాంగ్రెస్ పార్టీ నాయకులుగాని తొందరపడ్డం మంచిది కాదు. కాంగ్రెస్ పార్టీలో కక్షలు, ప్రత్యేకవర్గాలు ఏర్పడ్డానికి ప్రకాశంగారొక్కరే కారకులు గారు. క్షమార్హమైనవైనా మంత్రులవల్ల లోపాలులేకపోలేవు. వాస్తవానికి కాంగ్రెస్ వ్యవహారాల్లో ఈనాడు కనిపిస్తున్న లోటుపాట్లన్నిటికీ మంత్రివర్గపక్షంవారూ ప్రకాశంగారి వర్గంవారూ, తదితరులూ కూడా సమానంగా బాధ్యులే. దేశంలో మంత్రుల చర్యల పట్ల తీవ్రఅసంతృప్తి నిరసన ప్రబలి ఉన్నాయనేది అందరికి తెలిసినవిషయమే ఈ పరిస్థితుల్లో కేంద్రకాంగ్రెస్ కార్యవర్గంగాని నాయకులు గాని ఉభయపక్షాలమధ్యనూ సఖ్యత చేకూర్చడానికి యత్నంచెయ్యాలిగాని ఒక పక్షానికిచెందినవారిని శిక్షిస్తే ఇంటిగొడవలు వీధిలో పడకతప్పవు. ఇంతకుముందు సఖ్యతకోసం కేంద్రనాయకులు యత్నించి విఫలులైనారనీ, ఇప్పుడు తిరిగి యత్నించడం వ్యర్థమనీ చెప్తే ప్రయోజనం లేదు

సఖ్యతకు యత్నించడానికి వీలుగాకపోతే ఉభయపక్షాల్నీ వారి వారి కక్షలకు విడిచిపెట్టాలి. ఇంతకుముందు పార్టీ నాయకుల ఎన్నికలో జరుగుతున్న రభసశాసనసభలో జరగవచ్చును. కాని కాంగ్రెస్ పార్టీ బలాధిక్యత ఉండగా మంత్రివర్గం ఇటువంటి తీర్మానాలకి భీతి చెందవలసిన అవసరం లేదు విరామతీర్మానం బడ్జెట్ సమయంలో కాకపోతే తరువాత సమావేశంలోనైనా ప్రతిపాదించడానికి మంత్రివర్గం అంగీకరించగలిగినట్లయితే, కొద్ది లోపాలవల్ల పెద్ద అపోహాలకి తావిచ్చిన మంత్రులు నిర్దోషులని రూఢి కాగలిగేది

అసలు ప్రకాశంగారి వర్గంతో సఖ్యత చేకూర్చుకోడానికి మంత్రివర్గం హృదయపూర్వకంగా యత్నించడంలేదనే అభిప్రాయం దేశంలో ప్రబలింది. ఉభయపక్షాల వాదాల్లోనూ కొంతైనా న్యాయం లేకపోలేదని కేంద్రకాంగ్రెస్ వారు గ్రహించి, తదనుగుణంగా సఖ్యత చేకూర్చడానికి యత్నించగలిగితే విషయాలు ఇంతదూరం వచ్చేవికావు ప్రకాశంగారు ప్రధానిగా ఉండగా వారిపైన పార్టీలో విశ్వాసరాహిత్యతీర్మానం ప్రతిపాదించబడినప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన కక్షల్ని మాపడానికి, ఉభయవర్గాలమధ్యనూ సఖ్యతను సాధించడానికీ అగ్రనాయకులు మనస్ఫూర్తిగా కృషిచేసిఉంటే తగవు లింతదూరం వచ్చేవి కావు. ఆనాడు కక్షల్నీ ప్రత్యేకవర్గాల్నీ సహించి, ఈనాడు సహించబోరని చెప్తే ప్రజల కిందులో న్యాయం గోచరించదు.


ఇప్పుడైనా ఉభయవర్గాలవారు వ్యక్తిప్రతిష్ఠలకంటె దేశహితం ప్రధానమని గ్రహించి సఖ్యతకోసం యత్నించినట్లైతే ఈ ముప్పు తప్పుతుంది ప్రకాశంగారితో సఖ్యతచేసుకోడానికి మంత్రివర్గం హృదయపూర్వకంగా యత్నించవలసిన సమయం వచ్చింది. కేవలం తమవల్ల ఏ పొరపాటూ లేదని వారు వాదించలేరు. అలా వాదించగలిగే పక్షంలో దేశహితంకోసం, ప్రజల్లో ప్రభుత్వంపట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించడంకోసం తామె శాసనసభ సెలక్టుకమిటీ విచారణకు అంగీకరించడం న్యాయం. ప్రకాశంగారు కూడా లోపాలు అందరివల్లా జరిగేవే నని భావించి మంత్రివర్గంపైన కక్ష సాధించడానికి యత్నించకూడదు. ప్రజల్లో ఇటువంటి అభిప్రాయం ఏర్పడుతోంది. దీనివల్ల కాంగ్రెస్ నాయకుల పరపతికి భంగం. అనుభవజ్ఞులైన ప్రకాశంగారు స్వయంగా సఖ్యత సాధించడానికి ప్రయత్నిస్తే ప్రజలకు వారిపట్ల ఆదరవిశ్వాసాలు ఇనుమడించగలవు.

ఆంధ్రదేశంలో ఈనాడు ప్రకాశంగారి పట్ల ప్రజలకుగల ఆదరప్రేమలు అద్వితీయం. ఈ ఆదరప్రేమలు రాజకీయాలకూ కక్షలకూ అతీతమైనవి ప్రకాశంగారి నాయకత్వం పట్ల ప్రజల్లోగల వ్యామోహం అపారం. ఆంధ్రదేశంలో ప్రకాశంగారి నాయకత్వాన్ని నెహ్రూ పటేల్ ప్రసాద్ మొదలైనవారి నాయకత్వంతో మాత్రమే పోల్చగలం వారివల్ల ఎన్ని లోపాలు జరిగినా ప్రజలకు వారి సేవానిరతిపట్లగల విశ్వాసం అచంచలమైనది. అట్టినాయకుని వాదనను తోసిపుచ్చి ఆంధ్రదేశంలో కాంగ్రెస్ సంస్థ తన ప్రతిష్ఠను కాపాడుకోలేదు. ప్రకాశంగారిపైన చర్య తీసుకుంటే దేశంలో ఇప్పటికే క్షీణదశలో ఉన్న కాంగ్రెస్ పరపతి మరింత అడుగంటిపోగల ప్రమాదం ఉంది. ఉభయవర్గాలూ సఖ్యత చేసుకుని తీరాలని కేంద్రకాంగ్రెస్ కార్యవర్గం నిర్బంధించేపక్షంలో, సఖ్యత చేకూరగలదు.

ఉభయత్రా లోపాలున్న పరిస్థితిలో దేశంలో కాంగ్రెస్ పరపతిని కాపాడాలంటే సఖ్యత చేకూర్చడానికి యత్నించడమే దేశానికి శ్రేయోదాయకం.

[సీతారామ్]

వార్తా చిత్రాలు.



గా॥ శ్రీ సంతానంగారు, రవాణాశాఖ ఉపమంత్రి ఢిల్లీలో రవాణాఅధికారుల సభయందు ఉపన్యసించుచున్నారు
ప్రక్కనే మంత్రి గోపాలస్వామి అయ్యంగారు కూర్చొనియున్నారు



ఢిల్లీలో జరిగిన అ భా సహకారసంస్థల ప్రదర్శనమును భారత అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాదుగారు,
కమలాదేవి ఛటోపాధ్యాయగార్లు తిలకిస్తున్నారు

Regd No M 4479

శుభవార్త

ముఖ్యంగా ముద్రాపకులు గమనించవలసినది

కొత్త టైపులు

మేము పోతపోసి యిస్తాము. గ్రేటుప్రైమరు, ఆంటిక్, ఇంగ్లీషుబాడీలలో ఏ టైపులు కావలెనన్నా, ఎన్ని పౌనులు కావలెనన్నా, చెప్పిన గడువుకు, సరసమైన రేట్లకు, చక్కగా తయారుచేసి యిస్తాము. నేడే వివరాలకు వ్రాయండి.

బొమ్మలులేనిదే రాణింపులేదు

బొమ్మలు లేనిదే నేడు పత్రికలుగాని, పుస్తకాలుగాని, కాలెండర్లుగాని రాణించడంలేదు మంచి బొమ్మలకు మంచి బ్లాకులు ఆధారం కనుక ఎవరికి ఏ బ్లాకులు కావలెనన్నా

లైను, హాఫ్‌టోన్, కలరు

అన్నిరకాల బ్లాకులూ, అన్నిరకాల ముద్రణకూ అనుకూలంగా ముచ్చటగా తయారుచేసి ఇస్తాము.

ముచ్చటయిన ముద్రణ

పుస్తకాలు, క్యాలెండర్లు, కరపత్రాలు, క్యాటలాగులు

★

ముద్దుగా, ముచ్చటగా, సరసమైన రేట్లకు అచ్చువేసి యిస్తాము.

మేనేజరు, ఆంధ్రపత్రిక మద్రాసు 1.

Edited, Printed & Published by S Sambhu Prasad, at the Andhra Patrika Press, 7 Thambu Chetty St Madras.